ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




4 అణాలు
6-5-'53

ANDHRA PATRIKA ILLUSTRATED


అద్దంతో ట్రిక్ చేసి తీసిన ఫోటోలు

ఫోటోలు—శ్రీ కంభంపాటి సత్యనారాయణ (విజయనగరం)



నేపియర్ బ్రిడ్జి - మద్రాసు.

బ్రిడ్జిక్రింద నీరు నిశ్చలంగా లేకపోయినా ఫోటోలో ప్రతిబింబం పరిపూర్ణంగా ఏర్పడింది.



మద్రాసు విశ్వవిద్యాలయ భవనాలు

వాస్తవానికి ఈ భవనాలకి ముందు తారురోడ్డేగాని నీళ్లులేవు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder: K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 36
6.5-53

విజయ వైశాఖ బహుళ సప్తమి; బుధవారం



నృత్యభంగిమ

శ్రీ బి. వి. రత్నం (రాజమండ్రి) గారు చాక్‌పౌడర్‌తో వేసిన చిత్రం

విషయానుక్రమణిక

ముఖచిత్రం :— ప్రసిద్ధ నర్తకి

అమలాశంకర్.

కాలక్షేపం

"గ్రాసము లేక స్రుక్కిన, జరా
కృశమైన, విశీర్ణమైన, సా
యాసమునైన, నష్ట రుచి
యైనను, ప్రాణభయార్తమైన, ని
స్త్రాసమదేభ కుంభ పిశిత
గ్రహలాలస శీల సాగ్రహ
గ్రేసర భాసమానమగు
కేసరి జీర్ణతృణంబు మేయునే?"

తా॥ తిండి లేక స్రుక్కియున్నను, ముసలితనము చేత కృశించినను, శరీరములోని కీళ్ళు సడలి శిథిలమైయున్నను, ఆయాసపడుచున్నదైనప్పటికి, కాంతివిహీనమైనప్పటికీ, ప్రాణాపాయకరస్థితిలో ఉండినప్పటికీ, మదించిన ఏనుగుయొక్క కుంభస్థలములోని మాంసమును గ్రహించి తినుటయందు ఆసక్తి కలిగినటువంటి పౌరుష గ్రేసరియగు కేసరి ఎండిన గడ్డిపరకలను మేయునే? (మేయదు అని భావము.)

గడ్డి తినడం దొడ్డపని కాదనే భావం మనకు ఉన్నది. నోటితో గడ్డినిగాని, పూరి పుడకనుగాని కరచినవాడు రణరంగములో శత్రువునకు శరణాగతుడై తెల్లజెండా పైకెత్తినట్లుగా భావింపబడుచుండేది. "అడ్డమైన గడ్డితిని" ఒక పనిని సాధించుకొని రావడం అంటే, ఎందరెందరినో శరణువేడి కాళ్లు చేతులు పట్టుకొని కార్యము సాధించడం అని అర్థం. అరవంలో కూడా "కాకా పట్టినాడు" అనే జాతీయ ప్రయోగం ఒకటి ఉన్నది. పై అధికారిని క్రింది ఉద్యోగి ఆశ్రయించి ఆశ్రయించి కొంత స్వలాభమును సాధించినట్లయితే, "పై అధికారిని క్రింది ఉద్యోగి కాకాపట్టినాడు" అని అంటారు. "కాకా" [illegible] అని అర్థం. అందువల్ల "కాకాపట్టడం" అనే మాటను ఇంగ్లీషులోకి తర్జుమా చేసి "Crow Catching" (కాకులను పట్టడం) అనడం కూడా జరిగింది. అనే భావంలో ఆ యింగ్లీషు మాటను మనవాళ్లు చాలామంది ప్రయోగిస్తున్నారు. కాని "కాకా పట్టడం" అనే అరవమాటకు అసలైన అర్థం "కాకులను పట్టడం" అని కాదు. "కై" అనే అరవ మాటకు "చెయ్యి" అని అర్థం. "కాలు" అనే మాటకు "పాదము" అని అర్థం. "కై కాలు పట్టుకొని పని సాధించాడు" అని చెప్పటకు గాను, మాటలతొందరలో "కాల్ కైపట్టి" లేదా "కాకాపట్టి" తనపని సాధించినాడని చెప్పడం సంభవించింది. కాబట్టి ఇంకొకరి చేతులు కాళ్లు పట్టి పని నెరవేర్చుకొన్నాడనే మాటయొక్క ఉచ్చారణ సరిగ్గా లేనందున, చిట్టచివరకు కాకులను పట్టి పని నెరవేర్చుకొన్నాడను అపార్థం చేసిన లోకుల మాటలే అవాకులు చవాకులు అయినాయి.

అసలు చతుర్విధ సాధనోపాయాలలో సామోపాయం అనేది మొట్టమొదటి ఉపాయంగా, ఉత్తమ కార్యసాధన విధానంగా చెప్పబడింది. "నాయనా! యీ పని నీకు తగదు. ఇది యిహమునకూ పరమునకూ అక్కరకు రానిది. పాపభీతి లేకపోయినా, లోకనిందకైనా వెరచి, పరువు మర్యాదల తలపోసి, దాక్షిణ్యము వహించి యికనైనా యీ కృత్యము చాలించి వర్తించు! నిన్ను బతిమాలుకొని నామాట మన్నించమని వేడుచున్నాను. నేను పట్టుకొన్నది చేతులు కావు. అగ్రహావేశముతో కత్తులు నూరుట వల్ల నీవు పిచ్చుకపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించినవాడవవుతావు. నామాట మన్నించి నా విన్నపం పాలించి దయ [illegible], [illegible] నన్ను" అని వేడుకొని [illegible]గా దయా సత్య శౌచము లనెడి [illegible] బోధించి వేడుకొని, కార్య [illegible] కాళ్లు చేతులు పట్టుకుంటే తప్పేమిటి? "నాయనలారా! కల్లు త్రాగకండి! ఇల్లూ ఒళ్ళూ గుల్లచేస్తుంది యీ కల్లు పిశాచం" అని యిదివరలో కాంగ్రెసు సత్యాగ్రహులు కల్లు దుకాణాలవద్ద పిక్కె-

దాసు వామనరావు

టింగు చేసి, కల్లు త్రాగేవారి గడ్డం పట్టుకొని, కాళ్ళు చేతులు పట్టుకొని బ్రతిమాలినారు.

“నాయనలారా! యీ విదేశీ సీమ గుడ్డలను కొనవద్దు – కట్టుకొనవద్దు. స్వదేశీగుడ్డలను కొనండి. ఖద్దరు వస్త్రములను కట్టి దేశంనుంచి హరించిపోతున్న అయిశ్వర్య ప్రవాహమును అరికట్టండి! దేశ దాస్యం తొలగించండి! మీ కాళ్ళు చేతులు పట్టుకొని, మా మాట మన్నించండని ప్రార్థిస్తున్నాము” అని యిదివరలో విదేశీ బట్టల షాపుల వద్ద పికెటింగు చేసిన కాంగ్రెసు సత్యాగ్రహులు లారీలధాటికి ఎదురొడ్డి దొడ్డ సాహస ధైర్యములను చూపించారు. ఈ విధంగా దేశదాస్య విమోచనకై యితరుల కాళ్ళు చేతులు పట్టుకొని బ్రతిమాలినవాళ్లందరూ పురుషసింహులు కారని తృణీకరించగలమా? స్వరాజ్యం సాధించడంకోసం జెయిళ్ళలోకివెళ్ళి అడ్డమైన గడ్డీ తిన్నారు. కేసరి జీర్ణతృణంబు మేయునే? అని ఆంధ్ర కేసరి కూడా అనలేదు. కాని, నిజంగా అడ్డమైన గడ్డీ తిన్న వారెవ్వరు? ఆనాడు బ్రిటిష్ సర్కారువారి సవారీ మోస్తూ, వారిచ్చిన బిరుదులకు మురియుచు, వారి చేతి కీలుబొమ్మలై గులాములై సలాములు చేసి, వారి ఉప్పు తినుచు దేశమునకు వాటిల్లిన ముప్పును తలపెట్టక, కాంగ్రెసును తిరస్కరించి, గాంధిమహాత్ముని తృణీకరించినవారే ప్రభుత్వ గ్రాసమును మేసినవారు. కాని, జెయిళ్లలోకి వెళ్లి, ఆత్మగౌరవం చెడకుండా అడ్డమైనగడ్డిని తిని కాంగ్రెసు మహారథమును ఆనాడు యీడ్చిన పురుష పుంగవులు నేడు అతి రథులు, మహారథులై సహోదర దేశీయుల మన్ననలకు పాత్రులైనారు.

గాంధిమహాత్ముడు తన సహాయ నిరాకరణోద్యమమును కాంగ్రెసు మహాసభవారు ఆమోదించవలెనని కోరుచూ, నాగపూరు కాంగ్రెసు మహాసభలో ఒక తీర్మానమును ప్రతిపాదించెను. అప్పుడు జిన్నా సాహెబు గారు లేచి, ఆ తీర్మానమును ప్రతిఘటించారు. చేతనైతే, మొగతనం ఉంటే, బ్రిటిష్‌వారిపై కత్తికట్టి ఎదిరించి యుద్ధం చేయవలెనన్నాడు. బ్రిటిష్‌వారిపై యుద్ధం చేయడానికి భారతజాతికి ఆయుధాలు కావాలంటే తెప్పించాలన్నాడు. అందుకొరకై తనవద్దఉన్న ద్రవ్యం కావలెనంటే యిస్తానన్నాడు. కత్తికట్టి యుద్ధం చెయ్యలేక, యీ సహాయనిరాకరణ మంత్రం జపిస్తే చింతకాయలు రాలునే? అని ప్రశ్నించాడు. తాను సూచించిన పద్ధతి పురుషసింహానికి అర్హమైన పద్ధతి యనిన్నీ గాంధిమహాత్ముడు అవలంబించిన సాత్విక నిరోధం అనబడే శుద్ధసాత్వికపద్ధతి అబలలు అనుసరించే పద్ధతి యనిన్నీ నిరసించి గాంధి మహాత్ముని సత్యాగ్రహముయెడల జిన్నా గారు చాలా చిన్నచూపు చూచారు.

కాని, యీనాటివరకు “కేసరి జీర్ణతృణంబు మేయునే?” అని మీసాలు మెలియబెట్టునట్టి, తొడ కొట్టునట్టి, తిట్లబు అట్టహాసములు చేయకమానరు. అటువంటి వారు “బస్తీమీద సవాలు!” అని నిలువబడి తమ కెదురు ఎవ్వరూ నిలువబడలేరని మీసాలు దువ్వియుండిరి. అటువంటి అహంకారంతో హుంకరించిన కాంగ్రెసువీరులు ఓడిపోయి, అనేకచోట్ల అన్య పక్షముల వారు ఎన్నికలలో మిన్నలైనారు. అదివరకు బాపూజీ బాగున్న రోజులన్నీ కాంగ్రెసు అభ్యర్థుల అభ్యుదయ పరంపరాభివృద్ధి దాయకంగా బాగున్నాయి. కాని, గాంధి మహాత్ముడు అస్తమించిన పిమ్మట, మరొక యుగం ప్రారంభమైంది. కాంగ్రెసు అభ్యర్థుల వోట్లపెట్టెమీద సింహం బొమ్మ లేక పోయినప్పటికీ వారు అదివరకు అధికార పదవులలో ఉన్నప్పుడు అడ్డమైన గడ్డి తిన్నారనే అపవాద యొకటి దశదిశల వ్యాపించింది. కాంగ్రెసు అభ్యర్థుల వోట్ల పెట్టెమీద ఎద్దులజతబొమ్మను చూచినప్పుడు “జీర్ణతృణంబు మేసెడి ఎద్దు” లివి యనెడి తృణీకారభావం ఏర్పడింది. కాని, వెనుకటి కాంగ్రెసు పురుష పుంగవుల మహాత్కార్యములు వోటర్ల మనస్సులకు స్ఫురించలేదు. ఆవిధంగా ఆలోచిస్తే, అడ్డమైన గడ్డీ తినకుండా, సింహంలాగున బ్రతికిన వానినే లోకం పూజిస్తుందని గ్రహించాలి.

అయితే, ఒక్క విషయం ఆలోచించాలి. లోకంచేత పూజించబడవలెననే కోరికతో లక్షాధికారి కావాలనే దీక్షతో దూరదృష్టి లేని దురదృష్టుడు కృషి చేస్తాడు. సముద్రంలో ఉన్న నీళ్లు, ఎండవేడికి ఎప్పుడు ఆవిరియై ఆకాశంలోకి పోయినాయో ఎవడు చూచాడు? ఆకాశంలో మబ్బులేర్పడిన తర్వాత ఆ మబ్బులు మనకు నీటిని వర్షించేటటువంటి ఘనులు అని వినుతించడం లోకానికి సహజం.

“ఘనులు” అంటే మేఘములు అని నిఘంటువులు అర్థం చెప్పుతున్నాయి. ఏ చాటుమాటు బ్లాకుమార్కెట్టులో ఏ లంచాలు ఏ ఆవిరిరూపంలో ఎవడు పైకి పీల్చుచున్నాడో ప్రత్యక్షంగా చూచి చెప్పగలవాడు లేడు. కాని, ఆవిధంగా అపారవ్యాపారపారావారం మూలంగా నల్ల బజారులో ఏర్పడిన నల్లమబ్బులు కూడా ఘనులని కీర్తింపబడగలవు. కనుక, గడ్డి తినడంవల్లనే దొడ్డవాడను కాగలనని తలంచెడి పురుషపుంగవులు నిజమైన లోక పూజ్యులు కాలేరు. వారిచుట్టు చేరిన వందిమాగధులు మాత్రమువారి యండనుండి కొన్ని దండకములు చదువుతూ ఉంటారు. “నీ యీవి, నీ రీవి, నీ ధాటి కీడెవ్వ రీ పృథ్వి? నీ పోటి కెవ్వాడు నీసాటియై మేటియై సూటిగా నిల్చు? నిన్నెంచ నేనెంతవాడన్? నమస్తే నమస్తే నమస్తే నమః” అని సాంబ్రాణి ధూపం వేస్తారు. సర్వజన వోటింగు గల ఈకాలంలో ఒక్కొక్క నియోజకవర్గానికి లక్షలకొలదిగా వోటర్లు ఉన్నారు. వీరందరికి భిక్షులు చదివిస్తేనే గాని, వోట్లపెట్టెలు నిండవ నేయెడల, లక్షలు కూడా లక్ష్యం లేకుండా ఖర్చు చేయుగల దక్షత ఉండాలి. ఆవిధంగా ఎన్నికఅయిన పిమ్మటఉన్న తాసనం కొరకు, మంత్రిపదవుల కొరకు మరొక యజ్ఞం మళ్ళీ చెయ్యాలి. ఈవిధంగా ఘనులైనవాళ్లు తారాపథంలోకి వెళ్ళగలరు. వాళ్ళు అంబరమార్గంలోనే మబ్బులవలెనే కండ్లునెత్తికివచ్చిఆకాశంలో తిరుగుతూ ఉంటారు. ప్రజాసామాన్యంతో సంబంధించిన ప్రజాస్వామ్య ధర్మం ఇది.


ఈవిధంగా లోకపూజ్యతకొరకై లోక వంచన చేయడం లోకాచారం అయింది. అందువల్ల “మీకే సరి” యీ అమాత్యపదవి యని లోకము వినుతించిన వాడే అమాత్య కేసరి అవుతున్నాడు. అతడే అగ్రేసరుడవుతున్నాడు. కాని, ఆ కేసరి అడ్డమైన గడ్డి తిన్నదంటే, ఎవ్వరూ నమ్మరు. “కేసరి జీర్ణతృణంబు మేయునే?” అని శంకిస్తారు.

ఇంటిపేరు కస్తూరివారు. ఇంటిలో గబ్బిలముల గబ్బు. ఇంట్లో యీగలమోత బయట సవారీల మోత. ఈవిధంగా పైకెత్తిన మీసములు క్రిందకు దింపకుండా, క్రిందపడినా మీసములకు మన్ను కాలేదని వాదిస్తూ, తిరిగేటటువంటి పురుష సింహములు ప్రతిగ్రామంలోనూ ఉన్నటువంటి గ్రామ సింహములుగా వ్యవహరింపబడుటలో వింతగాని కొరంతగానియిసుమంతైనా లేదు. “ఏమండీ! మీ యింట్లో యీ వేళ శాకపాకము లేమిటి?” అని ప్రశ్నిస్తే “ప్రతిరోజూ మా యింట్లో బంగాళా దుంపలు నేతిలో వేయించి కూర చేయడం తప్పదు” అని జవాబు చెప్పేటటువంటి జవరాండ్రు చాలామంది ఉన్నారు. బంగాళాదుంపల కూర చేసినామని చెప్పుకొనడం ఒక గొప్ప. తోటకూర కాడలకు రవ్వంత పులుసుపెట్టి కమ్మగా వంట చేసికొన్నాము అని చాటుమాటున కూడా చాటించకూడదని పిల్లలను దండించిన తల్లులున్నారు. “అకుకూరలు తిన్నాడు” అంటే, జీర్ణతృణంబు మేయడంవంటిదనిన్నీ, బంగాళాదుంపల కూర తినడం అంటే, మదించిన ఏనుగయొక్క కుంభస్థలమును ఆరగించడం వంటిదనిన్నీ, రెంటికి

★ కాలక్షేపం ★

హాస్తిమశకాంతరము చూపించి, బంగాళా దుంపలు తినడం అంటే బంగారు రేకులు తినుచున్న అన్నట్లుగా భావించేది, భ్రమించేది భామామణు లున్నారు. వేరుసనగ పప్పు తిని మేకపాలు త్రాగిన గాంధీమహాత్ముని కంటె పూజ్యలసంప్రాప్తించాలంటే, బహుశః బంగాళాదుంపల కూర అనుదినం ఆరగిస్తేనేగాని ప్రాప్తించదు కాబోలు. నిజానిజాలు బాగా పరిశీలిస్తే జంతుప్రదర్శనశాలలలోకి వెళ్ళి చూడండి. అందరూ వచ్చి వినోదార్థంగా చూడడానికి సింహాములను బోనులలో పెట్టి బంధించి ఉంచుతారు. ఆ సింహాములకు అనుదినము మేకమాంసం తెచ్చి ఆహారంగా వేస్తారు. ఆ మాంసం అవి హాయిగా ఆరగిస్తాయి. అంతేగాని, ప్రాణం పోయినాసరే, మదగజముయొక్క కుంభస్థలంమీది మాంసమే కావాలని భీష్మించి, పెట్టిన ఆహారం తినకుండా అలకపాన్పుమీద అల్లునివలె మూతిముడుచుకొని కూర్చుండవు. కనుక మదగజ కుంభస్థల మాంసమునేగాని మరొకటి ఆరగించదు కంఠీరవ మనుట కల్ల - అబద్ధం అయినప్పటికీ సింహానికి అటువంటి పేరున్నూ, అటువంటి ప్రతిష్ఠయున్నూ ఏ ప్రకారంగా వచ్చిందో, అటువంటి కీర్తి విఖ్యాతి మనకు కూడా వస్తే చాలునని అవస్థలు పడడం అవసరం అంటారు ప్రపంచతంత్ర ప్రవీణులు. ఇంట్లో పెట్టుకున్నది గోచీఅయినా వాకిట్లోకి వచ్చినప్పుడు జరీ ఉత్తరీయం ఉండాలి. మింగ మెతుకు లేకపోయినా, మీసాలకు సంపెంగ నూనె ఉండా లంటారు. సెంటు భూమి లేనివానికి సెంటు వాసన లెందుకని అడిగితే, ఆ సెంటు లేని వానికే యీ సెంటు జనవశీకరణార్థం అవసరం అంటారు. విద్యాగంధం చూచి ఉద్యోగం యివ్వని కాలంలో, కళాశాలలందు ప్రవేశార్హత లేనికాలంలో, కులతత్త్వాభిమాన వాసనలతో కళాశాలలోనూ, కార్యాలయములలోనూ సులభంగా ప్రవేశించవచ్చు. అభిమాన వాసనలతో అధికార పదవులను అలంకరించవచ్చు. కూటికి పేదలైనా కులానికి పేదలము కామనేడి కీవితో "మా పములు లే" రని మీసములు మెలియబెట్టడం, కులతత్త్వాభిమాన దురభిమానములతో కుల కత్తులను దువ్వి కవ్వించడమే గాని మరొకటి గాదు. రెడ్డి, కమ్మ, వెలమ, తెలగ, కాపు, కులవిభేదాల చూపు "మా పములు లే" రనుచు మీసములు దువ్వుట కవకాశ కారణము లవుతున్నాయి. మన జాతీయైక మత్యం యీవిధంగా "మీసాలపై తేనియల్" అన్నట్లుగా పరిణమించింది.

ఎవరో కొందరు జమీందార్లు ఢిల్లీ భోగాలు తింటూ ఉన్నామని చెప్పుకొనడమే గాని, నిజంగా ఢిల్లీ భోగాలు అనుభవించడం లేదు పల్లెలోని ప్రజలు. పూర్వమొక జమీందారుగారు ఉండేవారు. ఆయనకు ఉన్నటువంటి జమీ చిన్నదే. కాని, అదివరకే కేళీలాసంగా కాలం గడిపినవాడు కావడంచేత కరి మ్రింగిన వెలగపండువలె ఆ వెలమదొర మిగిలి ఉన్నాడు. కాని మీసాలు మెలియబెట్టడంలో ఆయన కీవి అంతా మూర్తీభవించి ఉండేది. ఇప్పుడు ఇంట్లో వరి అన్నం కూడా వండించడం నిలిపివేసి తన పొలంలో పండిన జొన్నల అన్నమునే సుఖంగా భోజనముచేసి, తన



ఒకప్పుడు పందుల వ్యాపారంచేసే ఒక ప్రముఖుడి తాలూకు 24 పందులు రైల్వే రవాణాలో దురదృష్ట వశాత్తు చచ్చిపోవటం జరిగింది. రైల్వే మీద ఆయన నష్టపరిహారం కోసం కోర్టులో దావా వేసి, క్రొత్తగా పట్టా పుచ్చుకొన్న కుర్రలాయరు ఒకాయనకు తన వకాలత్ యిచ్చాడు.

కేసు విచారణకు వచ్చిన నాడు ఆ కుర్రలాయరు గొప్పగా వాదించి జడ్జీగారిని హడలగొట్టెయ్యాలన్న పట్టుదలకొద్దీ, గుండెలు అర్చుకుపోయేలా అరుస్తూ, "యువర్ ఆనర్! పార్టీకి 24 పందులు నష్టమైనాయి. ఒక్క పందీ, రెండు పందులు కావు! ...మన జ్యూరీ పెద్దలకి రెండింతలు..." అన్నాడు.


దివానుతో సహా దివాణం మర్యాదలన్నీ జరుపుకుంటున్నాడు. ఇంట్లో వంటవాడు ఉండేవాడు. శ్రద్ధగా ఆయనకు జొన్న అన్నం వండి వడ్డించేవాడు. కాని చిన్న పిడతలో రవ్వంత ఢిల్లీభోగాలతో నాజూకైన వరి అన్నం కూడా వండి పెట్టేవాడు. జమీందారుగారు భోజనం అంతా అయిన తర్వాత, మూతి చేతులు కడుకుకొన్న తర్వాత, ఆ ఢిల్లీ భోగాల వరి అన్నము తీసి ఆ మెతుకులను తన మీసములకు అంటించుకొని, దివాణంలోనికి వచ్చి దర్జాగా కూర్చుండేవాడు. ఎవరైనా పెద్ద మనుష్యులు జమీందారుగారిని చూడవచ్చిన యెడల, ఆయన మీసాలకు అంటుకొని యున్న ఆ సన్నని ఢిల్లీభోగాల మెతుకులు చూచి,ఆయన తినుచున్నటువంటి ఆనాజూకైన అన్నమును చూచి ఆయనయందు గౌరవమర్యాదలు చూపించేవారు. ఒకనాడు జమీందారుగారున్నూ ఆయన యొక్క దివానుగారున్నూ దర్జాగా దివాణంలో కూర్చుండి పదిమంది పెద్దమనుష్యులతో పెద్దపెద్ద వ్యవహారాలు, అనగా, ఆంధ్రరాష్ట్రానికి తాత్కాలిక రాజధానీ నగరమునకు తగిన పట్టణ మేది అని తర్కిస్తూ ఉన్నారు. సరిగ్గా ఆ సమయంలోనే ఇంట్లోనుంచి ఆ జమీందారుగారి వంటవాడు కచ్చేరీ చావడిలోనికి పరుగెత్తుకొని వచ్చి "బాబుగా రండీ! మీసాలకూడు పిల్లి తినిపోయిందండీ!" అని కేక వేశాడు. వెంటనే ప్రక్కనున్న దివానుగారు ఆ వంటవాని మాటవల్ల తంటా వచ్చిందని గ్రహించి పదిమంది పెద్దమనుష్యుల మధ్య జమీందారుగారికి అప్రతిష్ఠ రాకుండా ఉండగలందులకై "చాలులే నీమాట లిక కట్టిపెట్టి లోపలికిపో! మీసాల పిల్లివచ్చి కూడు తినిపోయిందని చెప్పలేక, మాటల తడబాటున వెర్రివాడా! మీసాల కూడు పిల్లితిని పోయినదనడ మేమిటి? నీవు చెప్పదలచిందేదో అర్థమైనదిలేపో! లోపలికి వెళ్ళి నీపని నీవు చూచుకో" అని వంటవానికి చీవాట్లు పెట్టి పంపించాడు. కాని మీసాల కోసం వండిన కూడు పిల్లితినిపోయిన మాట వాస్తవమే - అయితేనేమి? మీసాలకొరకైన కూడు ప్రత్యేకించి ఉన్నదనేమాట చిన్నతనంగా ఉంటుంది. మీసాలపిల్లి కూడు తిన్నదనేమాట మోసమైనా, అదే లోకానికి అభ్యాసమైంది. మదగజ కుంభస్థలం తప్ప మరేమీ తినదు సింహం అనే మాటకూడా అబద్ధమే-

జీర్ణతృణంబు మేసెడి గోవును లోకం పూజిస్తుంది. గోవు చేసిన ఉపకారం లోకానికి సింహం చేయడంలేదు.

"మేకపాలు త్రాగు- లోకైక పూజ్యుండు
ఆంగ్ల సింహమతని-ఆట బొమ్మ
మాంసభుక్కు కాడు-మహి మహాత్ము
విశ్వదాభిరామ-వినుర వేమ." [డెపుడు

అటువంటి గాంధి మహాత్ముడు బ్రిటిష్ సింహము నాడించిన మేకపిల్ల -

"కేసరిజీర్ణతృణంబు మేయునే"అనే అహం సింహానికే చెల్లును. కాని, యీ అహంలో ఇహంలేదు, పరంలేదు. ★



కాంతాసమ్మితం

శ్రీ వై. వి. రమణమూర్తి

వసంత ఆలోచిస్తున్నది. ఒంటరిగా కూర్చుంటే ఇలాంటి ఆలోచనలే వస్తాయి. వీటికి తెగ తెగవులంటూ లేదు. భర్త ఆఫీసునుంచి తిరిగివచ్చే దాకా తను ఒంటరిది కాక ఆలోచించక చేసే పని లేదు. తన చిన్ననాటి తలపులు, ఆశలు, ఆ తర్వాత తనని చూసుకుందుకు ఒక పెళ్ళికొడుకు రావడం అన్నీ కళ్ళకి కదులుతున్నాయి. నిజంగా అప్పుడు పెద్ద భయం వేసింది తనకి. అతను ఊఁ అంటే తన కతనితో పెళ్ళి అయిపోతుంది కాబోలు. తన ఊహాగానాలకి భరతవాక్యం అది. అని భయం. అదృష్ట వశాత్తు ఆ సంబంధం కుదరలేదు. మళ్ళీ తనలో కోర్కెలు ఆశలు చచ్చినవల్లా బతికాయి. ఆ తర్వాత ఇద్దరు ముగ్గురు తనని చూసుకుందుకు రావడం, ఈ మారు కూడా దాటిపోతే బావుణ్ణు అనుకోడం!! కాని ఆ తర్వాత తనకి పెళ్ళి అంటే ఔత్సుక్యం పోయింది. విధిగా జరగవల్సిన అనేక విషయాలలో అదొకటి. తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేనిదీను. ఈ తతంగం మీద తనకి ఇష్టం పోవడమూ బాగానే ఉంది. ఎవర్నీ ఎదిరించా అక్కర్లేదు. తన మనసులో కూడా విచారించక్కర్లేదు. వచ్చిన వాళ్ళంతా తిరిగిపోరు ఎవరో ఒకరు సిద్ధం అవుతారు. తను అందులోనూ అందంగా వుంటుంది కూడాను. తనకి ఆ వరునిపై ఇష్టం ఉందో లేదో అక్కర్లేదు ఎవరికీ. తన పెళ్ళికి సంఘాన్నీ తల్లిదండ్రులనీ కూడా నిందించదు తను. తనకే అక్కర్లేకపోయిందప్పుడు. వాళ్ళదాకా ఎందుకు. కాని అలాంటి తను ఇప్పుడు అలా అనుకోడం లేదు. సుందరం తనను పెళ్ళాడ్డానికి వప్పుకున్నప్పుడు తనేమీ ఫీలింగు అనేది లేకుండా ఒప్పుకుంది. వచ్చే పెళ్ళికొడుకుల్లో ఎంచుకోవల్సింది కనపడలేదు. అది తన ఏడాది అనుభవం.

నాలుగ్గంటలయినట్టుంది. లేచి స్నానం చేసి మంచి చీరకట్టుకుని కూర్చుంటే ఆయన వస్తారు. ఏం చీరలో! అందరి చీరలూ చూస్తే కళ్ళు జిగేలుమంటాయి. తన కలాంటి యోగం లేదు. ఉంటేట్లు కనిపించదు — తనూ తయారయివచ్చే సరికల్లా సుందరమూ వచ్చాడు, అలిసిపోయిన మొహం అతనూ. వసంత చిరునవ్వుతో విషాదచ్ఛాయలు లేకుండానే అతన్ని సేదతేర్చింది. ఎంత ఏమన్నా అతనువస్తే తనకి హాయిగానే వుంటుంది!! కాఫీ తాగిన అనంతరం అతను పొద్దుటి పేపరు తీశాడు. వసంత అతన్ని తిలకిస్తూ కూచుంది. చిత్రమైన ఆలోచనలు వస్తాయి. పొద్దుటినుంచి వేచి కూర్చుంటే ఒకమాటైనా మాట్లాడరు! ఆధునిక నాగరికత మీదే తనకి కోపం వస్తుంటుంది. ఎవరికీ పని లేకుండా వుంటే ఎంత బావుణ్ణు — తనకి కాలం గడవడం ఎలా? తనూ చదువుకుని ఉద్యోగం చేస్తే ఇలా ఏడవక్కర్లేకపోయేది — తన భర్త ఎంత మారిపోయారో — పెళ్ళి భర్తా అంటే తనలో ఉన్న వైముఖ్యం నిరాశాభావం పోగొట్టి జీవితం అర్థవంతమైనదేమో అనే ఆసక్తి కల్గించి; జీవిత సంధ్యలో తొలివెలుగు కిరణాలు చూపించి ఉత్సాహపరచి తనలో మళ్ళీ వసంతం వెలయించి, తన ఆశావృక్షం మొగ్గ తొడిగించిన దీయనేనా అనిపిస్తుంది. అదొక మోసమేమో. "హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది అప్పుడప్పుడు వచ్చేవాడని తెలియబట్టి కాని లేకపోతే హడిలిపోయేదాన్ని" అనుకుంది.

"ఇందాక మీ స్నేహితులు పోలీసు రాజారాంగారు వచ్చారు. తక్షణం కల్సుకోవాలిట మీరు." అంది 'పోలీసు' అంటే ఇనస్పెక్టరు — ఆయన్న తన కళ్ళకి తనవూళ్ళో ఒక పోలీసు పోలికను వుంటాడని తనే ఆపాదించింది. "సరే. ఇప్పుడీయన బైటికి నడుస్తారు కావల్ను. నాపని మళ్ళీ ఎప్పటిలాగే. ఎందుకు చెప్పాను" అనుకుంది.

తను అనుకున్నంతా అయింది. ఆయన వెళ్ళిపోయారు. అప్పుడప్పుడు ఆ పోలీసు గారువచ్చి కబుర్లు చెప్పిపోవడం వసంతకి తెల్సు. కాని ఈ పని ఏమిటో అని ఈసారి ఆలోచనలో మునిగింది. రాత్రి ఎనిమిది గంటలకి ఎవరో ఆడ మనిషిని వెంటపెట్టుకుని తిరిగివచ్చాడు తన భర్త. వసంత గుండెలు ఝల్లుమన్నాయి. భర్తలోనూ, పెళ్ళిలోనూ అంత పూర్తిగా *Interest* కోల్పోయిన తను కూడా గాభరాపడ్డం ఎందుకంటే సమాధానం చెప్పలేదు తను! శల్యపరీక్ష చేద్దాం అంటే అందని అనుభూతి అది — ప్రేమ కాబోలు అది. ఆమెకి దుఃఖం కూడా వచ్చినంత పనయింది. ఆ వచ్చిన మనిషి కాంతం అని తెల్సుకునేసరికి కొయ్య అయిపోయింది వసంత ఆశ్చర్యంతో. "కాంతం ఇక్కడికెలా వచ్చిందో!" అనుకునేలోపల

"రాజారాంగారు నన్ని వేళ బ్రోతల్సు (వ్యభిచార గృహాలు) అన్నీ తిప్పారు — ఇదీ ఒకందుకు మంచిదేలే —" అన్నాడు సుందరం.

వసంతకి మరీ భయం కల్గింది. వ్యభిచార గృహాలకీ ఈయనకీ కాంతానికీ అర్థం కుదరడం లేదు.

"కాంతం! ఈవూరికెలా......"

"నే చెప్తాన్లే. ఆ అమ్మాయికి కావల్సినదేమో చూడు." అన్నాడు — కాంతం దిగులుగా ఉంది, అనారోగ్యంగా.

రాత్రి సుందరం చెప్పాడు. రాజారాంగారు దొంగసాక్ష్యం చెప్పమన్నారు తనని అని. ఈ బ్రోతల్సు నడిపేవాళ్ళని పట్టుకోడానికి. అటువంటివాళ్ళెవరో పోలీసులకి తెల్సు కాని సాక్ష్యమే దొరకదుట. అందులో పిల్లలూ చెప్పరు — వాళ్ళకీ ఆ జీవనాధారం పోతుందని — తను మొదట ఒప్పుకోలేదు. అటయితే దొంగసాక్ష్యం వద్దు — అవన్నీ చూసే చెప్పు అన్నారట. సరే చూద్దాం అని ఆయన చెప్పినట్లు చేస్తే ఒకడు కాంతం ఉన్న ఇంటికి తీసుకెళ్ళగా, ఆయన సహాయంతో ఈమెను రక్షించి తీసుకొచ్చారట కాంతం అక్కడికెలా వచ్చిందో ఆయనకీ తెలీదు. కాని వాళ్ళు ఈమెని అందులోంచి బైటికి పోనివ్వడం లేదని తెల్సుకున్నాననీ, తను రక్షించినందుకు ఆమె చాలా కృతజ్ఞత చూపిందనీ చెప్పాడు!

"ముఖ్యంగా నాగొడవ తీరింది — నా పరువు ప్రతిష్ఠలు మంటగలవకుండాను."

వసంత కుదుటబడింది. కాంతంమీద



జాలికూడా ముంచుకొచ్చింది — ఇక్కడికెలా వచ్చిందో!

"మీవూళ్ళో మీమీదా, కాంతంమీదా అనుమానాలున్నాయని తెల్సుగదా మరీ ఎలా ఈమెని ఇంట్లో పెట్టుకుంటానన్నారు" అంది. కాని, ఛా. ఏం ప్రశ్న అది. నిజంగా ఆయన తనకంటె ఎంత మంచివారు అభూతల నరకంలో పడి అఘోరిస్తూ, ధనం పెట్టి తనను ఆరాత్రికి కొనుక్కున్న ప్రతివాడు చేసే బలవంతానికి విధిలేక లొంగిపోయే కాంతం తనకళ్లకి కడితే తనూ అలాగే చేస్తుంది.

కాంతాన్ని గురించే ఆలోచనలు తనకి. ఎన్నో మధురస్మృతులు — తను కాపురానికి వెళ్లిన తొలిరోజుల్లో - తలపుకి వచ్చాయి వసంతకి - ఇక్కడికెందుకొచ్చిందీ? కాంతం - తను ఆమెని ఎంతమారిపోయిన పరిస్థితుల్లో చూసిందో తననీ అంతగా మారిపోయినదాన్నె చూస్తుంది కాంతం కూడాను.

2

గ్రామదేవత జాతర, దేవుడి కల్యాణం, తప్ప పెద్ద ఉత్సవాలు జరగని ఆపల్లెటూళ్ళో చుట్టుప్రక్కల గ్రామాల వాళ్ళంతా చెప్పుకునేటంత పెద్ద విశేషం జరిగింది. అది వసంత పెళ్లి. కాంతం పెళ్లి- ఎదురెదురు గుమ్మాలలో అయిదారురోజుల ఎడంలో జరిగిన వివాహాల్లు. ఇంటిముందు ఒకటే పెద్ద పందిరి. తను మూడు నిద్రలకు వడికట్టుతో అత్తవారింట్లో కాలు పెట్టేనాడే తెలిసింది ఎదటింటికి కూడా కొత్తకోడలు వచ్చిందని. ఆ అమ్మాయి ఎలా వుంటుందో అనీ కల్సుకోవాలనీ ఉవ్విళ్ళూరింది. ఆపల్లెటూరు, ఆ మనుషులు పట్నవాసజీవితాని కనుకూలపడ్డ తనకి ఏదో భయంగా తోచేవి. కాని అంత కొత్తదనంలోనూ తాను కొత్తగా చూసిన ఆ కొత్తకోడలుని గురించిన ఆలోచనలతో మూడురోజులు గడిచిపోయినాయి. ఎఱ్ఱగా సన్నగా అందంగా వుండే ఆ అమ్మాయిని పలకరించడం లేదు. తనని చూడ్డానికి వచ్చే పల్లెటూరి అమ్మలక్కలందరూ కబుర్లలో విధిగా ఆ అమ్మాయికీ తనకీ పోలిక తెచ్చి మాట్లాడేవారు. ఎదురు గుమ్మాలు,

కాంతాసమ్మితం

కొత్త కోడళ్లు ఒకేసారే రావడం, ఇద్దరూ అందమైనవారే కావడం విశేషించి ఊరేగింపులు వినోదాలు కనివిని ఎరుగనంతగా జరగడం - అదంతా ఊళ్ళోవాళ్లకి ఎంత చెప్పుకున్నా తరగని పురాణకాలక్షేపం అయిపోయింది. ఆరోజుల్లో తన జీవితంలో వచ్చిన మార్పునీ, భర్తనీ కూడా గురించి అట్టే ఆలోచించని తను ఆలోచించిన విషయమల్లా ఆ అమ్మాయిని గురించే - ఆ మూడురోజులూ కాగానే ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్లిపోయారు - పుట్టిళ్ళకి.

ఆరోజునుంచీ తనలో ఏవేవో కొత్తఆశలు రేకెత్తడానికీ అవి మొగ్గతొడిగి క్రమంగా పూలు విచ్చడానికీ తన భర్తరాసే ఉత్తరాలు కారణం అయ్యాయి. తను వసంతలక్ష్మి కనుక నవవసంత శోభలాగే అతని యౌవనపు తొలితుకాల్లో బతుకుబాటలో అడుగుపెట్టి అర్థవంతం చేసిందట - తనని ఎందుకంతగా ప్రేమిస్తాడో! అనిపించేది. బహుశా తన అందంచూసి - కాని ఎన్నాళ్ళు నిలుస్తుంది ఆ మోహం? ఇలాంటి నిరాశాపూరితమైన ఆలోచనలు వచ్చినా తనకేమిటో చాలా తృప్తిగా హాయిగావుండేది. ఆఖరికి క్రమంగా ఈయన్ని బాగా ఇష్టపడే పెళ్ళిచేసుకున్నానని తను ఆత్మవంచన చేసుకుంది కూడా. ఇదంతా తన అందానికీ; యౌవనానికీ అతని జోహారులేమో అనిపించినా; తాళికట్టిన యువకుడు, ఏదో రకంగా తనమీద హక్కుకల్గిన అతను అంత ప్రేమ చూపితే ఏమిటో మనసుకి బావుండేది!! కాంతం మొగుడు ఇలాంటివేమన్నా రాస్తాడా! ఎలా రాస్తాడు చదువురాని పట్టిపొలం పనివాడైతే వాడు. ఈ రకంగా తను కాంతాన్ని గురించి ఆలోచించేది.

తను ఎదురింటిఎఱ్ఱటికొత్తకోడలుకాంతం కంటె ఆరునెలలు ఆలస్యంగా కాపరానికి వెళ్లింది. ఉద్యోగంజూపి మరీ తీసుకెడదామనుకున్న సుందరానికి తన బలవంతంవల్లే తీసుకువెళ్ళక తప్పలేదు - తను ఆయన్ని వదిలి ఉండలేకపోయేది!! ప్రేమంటే పల్లెటూళ్లో కాదుకదా కారడవిలో ఉండమన్నా ఉంటేనే ప్రేమ అని తన సిద్ధాంతం. ఇప్పుడు తన ఉద్దేశాల్లో వచ్చిన మార్పుకి వసంత తనలోనే వింతపడింది.

కాంతం అత్తగారు మొదలైనవారు తరుచు ఏదో వేళలో వీళ్లింటికివచ్చి కబుర్లు చెప్పిపోతూండేవారు. వసంత మాత్రం మొదట్లో ఆ కబుర్లలో కలిసేది కాదు. తన గదిని ఆనుకునివున్న వసారాలో వాళ్ళ మీటింగు. మొట్టమొదట "ఏముంది అత్తగార్ల మీటింగు" అనుకుంది. కాని వాళ్ళ సంభాషణ వినాలనిపించేది. ఒకనాడు కాంతం పిన్నత్తగారు వచ్చి చెప్తోంది.

"వాళ్లింటికీ వీళ్ళింటికీ వెళ్ళొద్దంటే మానదండీ. మొన్నా పొలాన్నుంచి వొచ్చి ఏదని అడిగాడు. అది ఇంట్లోలేదు. ఉన్నచోటి కెళ్లి లాక్కొచ్చి తిట్టేడు. ఎందుకండీ తనకీ తిరుగుళ్ళు ఇంట్లో కూర్చోక? చదవడం వచ్చుగదా ఏ భారతమో చదవరాదూ. మీ యింట్లో ఎన్ని పుస్తకాలున్నాయి, ఇమ్మంటే ఇవ్వరూ!"

ఈ వార్తమీద జరిగిన వ్యాఖ్యానాలు తాను మరి వినలేదు. కాని కాంతంమీద తన ఆలోచనలు ఎక్కువైనాయి. అంతకంటె ఆశ్చర్యమైనది వీళ్ళిలా బహిరంగంగా తర్జన భర్జనలు చెయ్యడం! ఈ పల్లెటూళ్ళలో ఏమీ రహస్యాలున్నట్టు కన్పించవు! తమ కుటుంబానికీ వీళ్ళ కుటుంబానికీ తరతరాల్నుంచి మనసు లెంతగానో కల్సినాయని తెలిసినా అది ఇలాంటి రహస్యాలు కూడా దాచుకోకుండానా అని! పట్నవాసపు వాళ్లలాగ వీళ్ళకి పెద్ద ఇళ్లలో జరిగే విశేషాల్ని చెప్పుకుని రహస్యంగా ఇతరులకి చెప్పి, మనసులోనే '*Scandals enjoy*' చెయ్యడం చేతకాదు.

ఒకనాడు కాంతం అత్తగారు వచ్చి చెప్తోంది.

"మా కాంతం చిత్రమైన మనిషండీ. అంతా తన బాగే. తన వస్తువు లెవరూ ముట్టుకోకూడదంటుంది. ఇంక మా రెండో అమ్మాయి ఉంది. మా పెద్దకోడలు దగ్గర దాని పిల్ల తాగినా ఇంకొకరికి సరిపోయే పాలుంటాయి. అవి తన పిల్లాడికి పాలు తక్కువగదా ఎందు కివ్వకూడదు అని ఏడుపు దానికి. ఇలాంటి కుచోద్యాలు నాకు నచ్చవు సుమండీ."

ఈవిడ కొంచెం విశాలహృదయంకల అత్తగారు కాబోలు ననిపించింది. కాంతంతో మాట్లాడాలని వసంతకి కోర్కె కూడా ఎక్కువైంది.

"ఏమిటో కబుర్లు చెప్తావు. కోడల్ని ఒకసారి పంపించవు. నువ్వు వచ్చేటప్పుడు తీసుకురాకూడదూ? అది వస్తే నేరాలు చెప్పేందుకు వీలుకాదుగా" అంది నవ్వుతూ వసంత.

"అదుగో చూశారు. అమ్మాయిగారు కోడళ్ళపార్టీ అన్నమాట. నా కలాంటివి లేవండోయి. మీతో కలిస్తే అది కొంచెం బాగుపడుతుంది" అంది నవ్వుతూనే కాంతం అత్తగారు.

మర్నాడునుంచీ కాంతం రావడం ప్రారంభించింది. పూర్తిపేరు సూర్యకాంతం. చాలా చక్కటిపిల్ల. తెలివైనకళ్లు. చాలా అందమైన ముఖం. ఎఱ్ఱగా సన్నగా బక్కపలుచగా ఉంటుంది శరీరం. అలంకారం చేసుకోకకాని చేసుకుంటే కాలేజి గరల్‌లాగ ఉండి మగవాళ్లందరికళ్లూ దానిమీదే కేంద్రీకరించుకోగలదు.

"నీకు చదవడం రాయడం వచ్చుటగా" అని అడిగింది వసంత - వచ్చును అంది కాంతం.

"మరి మీ ఆయనకు ఉత్తరాలు రాసేదానివా?"

"నా మొహం. అవి చదివించుకోడాని కెవరివద్దకో పట్టుకెళ్ళకపోతేను! మీలా చదువా ఏమన్నానా?"

"మీ ఆయన్ను సెంట్లూ తల నూనెలూ తెమ్మని పీక్కుతింటావట. చదువే రానివాడు ఇవన్నీ ఎలా చేస్తాడని." అన్నది వసంత. ఇది ఆమెమీది నేరంలా కాకుండా మీ అత్తగారు ఇలా ప్రాపగండా చేస్తోందిలే అన్న ధోరణిలోనూ, అత్తగార్ని వెక్కిరించినట్లూనూ. కాని ఆవ్యంగ్యం కాంతానికి అర్థం అవుతుందా అని భయపడింది.

"బోధపడిందిలెండి పరిహాసం. అత్తగార్లు అలా అనక ఏమంటారు. మీరు చెప్పండి ఆడదైపుట్టేక అలాంటి కోరికలు ఉండడం మహా పాపమా?"

వసంత ఈ సూటి ప్రశ్నకీ ఆ ధైర్యానికీ విస్తుపోయింది. తెలివైనదే అనుకుంది. టేబిలుమీద ఫ్రేములో పెట్టిఉన్న వసంత సుందరం ఉన్న ఫొటోను ఇష్టంగా చూస్తూ కాంతం "ఏమండీ వసంతలక్ష్మి అంటే ఏమిటండీ" అంది.

> భార్య: నేనే విషయం చెప్పినా మీరు యీచెవితో విని, ఆచెవితో వదిలేస్తారు. నేనెట్లా చచ్చేదీ?"
>
> భర్త: "నిజమే, కావచ్చు కానీ, నేను ఏది చెప్పినా, నీకు రెండు చెవుల్లోనుంచే కాక, నోట్లోనుంచి కూడా బయటికి వచ్చేస్తుంది కదా! నేను మాత్రం ఏం చావను?"

"నా పేరు అది."

"అవునండీ. దానికేం అర్థం లేదూ. అదీ నే నడిగేది."

"చైత్రవైశాఖ మాసాలు వసంతఋతువు. అప్పుడు ప్రకృతి అంతా పూలతో, పళ్లతో పచ్చగా ఆనందంగా ఉంటుంది. ఆ అందాన్ని లక్ష్మిగా పోల్చి వసంతలక్ష్మి అంటారు. వసంతఋతు శోభ అన్నమాట."

"ఏమండీ మీ ఆయన చెప్పారా మీకీ అర్థం ?"

వసంత సిగ్గుపడింది, అవును ఆయనే రాశారు ఒక ఉత్తరంలో. తనకీ తెల్సు కాని ఆయన కూడా రాశారు. అదంతా చూసినట్లు అడిగింది ఈపిల్ల. అందుకే వసంత ముఖంలో సిగ్గుదొంతరలు. చివరికి అది కూడా ధ్వనించింది ఆ పిల్ల.

"మా ఆయన కలాంటివేం తెలియవు లెండి."

అమ్మయ్యో! ఈపిల్ల! పల్లెటూరిది అనుకుంది తను. ఎంత చాకచక్యం ఉంది!

"ఎంతవరకూ చదివావు కాంతం ?"

"తెలుగైతే ఎంత పుస్తకమైనా చదివెయ్యగలను. మీయింట్లో నవలలూ కథలూ పత్రికలూ ఈ ఆరునెలలనుంచీ చదువుతోనే వున్నాను. మీవారు ఎప్పుడు పుస్తకం కోసం పంపినా లేదనేవారు కాదు."

ఆ తర్వాత వాళ్ళ సంభాషణ వాళ్ళు తెచ్చుకున్న సారె; వసంత తెచ్చుకున్న కొత్తఫాషను పందిరి మంచాలు రెండూ, [illegible]పులూ, టేబులుమీద ఫోటో వీనిమీద జరిగింది. అందులో సుందరం కుర్చీలో కూర్చుండగా వసంత కుర్చీ చేతిమీద కూర్చుని అతని మెడమీద చెయ్యివేసుకున్నది-ఆపిల్ల వెళ్లిపోయేదాకా ఆ ఫోటో నే చూస్తూ కూచుంది. ఆఖరికి "పందిరి మంచాలు రెండు చేయించుకోడం ఫాషనాండి" అని అడిగింది అమాయికంగా. ఆ ప్రశ్న "ఫోటోలు అలా తీయించుకోడం మంచాలు మాత్రం పేరు" అన్నట్లు వసంతకి అనిపించింద.

3

వీధి అరుగుమీద భూములు కౌలుకి అడగడానికి వచ్చిన రైతులతో మాట్లాడుతున్నాడు సుందరం. భూముల అమరకం రోజులు - సుందరానికి 20 ఎకరాల భూమి ఉంది. కాని స్వంత వ్యవసాయం లేదు. భూమి ఉంది కాని మొదటినుంచీ అప్పూ ఎక్కువే. తన తండ్రికాలంలో వ్యవసాయం వుండేదట. తను చిన్నప్పటినుంచి చదువునే నమ్ముకున్నవాడు కావడం వల్ల ను పెట్టలేదు. ఆ రోజుల్లో ఎదుటింటి కాంతం మామగారు కాస్త డబ్బు కలిగి ఉండి అతను చనిపోయేదాకా అప్పు కావాలంటే ఇస్తూండేవాడు - ఇప్పటికీ వాళ్లకి సుందరం బాకీ ఉన్నాడు. యుద్ధం వచ్చి ధరలు పెరగబట్టి మిగతా అప్పులన్నీ తీర్చుకోగల్గాడు - కాంతం మామగారు చనిపోయే ముందు తనవద్ద నాల్గువేలు నిలవ ఉన్నది కూడా ఇతని చేతికిచ్చి చెప్పాడు.

బాబూ- సుందదం బాబూ. నేనింక బతికినన్నాళ్ళు బతకను. నా పెద్దకొడుకు సంగతి నీకు తెల్సుగదా. నాకళ్లెదటే నే పంచియిచ్చిన భూమి తగలబెట్టేశాడు. వాడిపిల్లలు ఎదిగి వొస్తున్నారు. కొడుకులాంటివాడవు కాబట్టి నీకిస్తున్నా ఈ నాల్గువేలూ - ఇదీ నువ్వివ్వలిసిందీ కలిపి - మాకుటుంబాన్ని కనిపెట్టి సాయం చెయ్యాలి. మీ బాబుకీ నాకూ ఒకటే ప్రాణం. నువ్వు ఆ విశ్వాసం ఉంచి మావాళ్లకి నిర్వాకం చెయ్యాలి "ఇవి చేతులు కావు"

"ఎంతమాట తాతా. నామీద భారంవేసి నిశ్చింతగావుండు" అన్నాడు.

"మా రెండోవాడిమీదకూడా నాకు నమ్మకంపోయింది. డబ్బు తగలెయ్యడం బట్టేసు. పెళ్ళోటి కావాల. మేనరికం ఉందనుకో అయినా కావాలగదా. ఆపైన ఇంకోపిల్లకి పెళ్లికావాలి—మా రెండో పిల్ల మొగుడితో కలిసి వచ్చి ఇక్కడే వుంటోంది. నాతర్వాత ఈళ్ళలో ఏంపోట్లాటలు వస్తాయో - ఈ డబ్బుదాస్తావనీ; నువ్వు మమ్మల్ని చేసుకోనిచ్చే పొలం చేసుకోనిస్తావనీ మాటిస్తేగాని నేపోదల్ను". అన్నాడు.

ఆ మాటలు తల్చుకుంటేను వీళ్ళ సంసారం చూస్తేనూ సుందరానికి అతనుతల్చినంతా అయిందనిపిస్తుంది. ఆ రెండోవాడే కాంతం మొగుడు వెంకటరత్నం. చదువులేక చెడు సహవాసాలకి అలవాటుపడ్డాడు-తాగుడుకీ, కోడిపందేలకీ. కాని మంచి వ్యవసాయం చేస్తాడు. ఆ విశ్వాసంతో తాత చనిపోయాక సుందరం ఈరెండేళ్లనుంచీ వాళ్లని కనిపెట్టి చూస్తోవచ్చాడు.

"మా నాయన నీకు డబ్బిచ్చిపోయాడటగా" అంటుండేవాడు వెంకటరత్నం. సుందరంనవ్వి "అవున్నే. దానికేం ఎక్కడికీ పోదు. కాని వొళ్ళువొంగి పనిచేసుకు బాగుపడు"అనేవాడు. తనెలాగూ వుద్యోగాలమీద పోవాలి కనక వీణ్ణి అండగా పెట్టుకుంటే పొలంపుట్రా చూసి పెడతాడని ఆశవుండేది సుందరానికి. కాని ఆ ఆశ ఎదిగిరానివ్వడం లేదు వీడు.

"నాపద్ధతి మీకు తెల్సు - నేను సాధారణంగా రైతుల్ని భూముల్లోంచి తప్పుకోమనను. ఒకోక్క యేడు ఇవ్వలేకపోతారు అయితే మాత్రం కాలూ చెయ్యీ కూడదీసకుని ఇచ్చుకోరా - మక్తారేట్లు హెచ్చు లేదు - కిందటేడులాగే యివ్వండి మీరం తాను. కాని వెంకటరత్నాన్ని చూ[స్తే] ఆ నమ్మకంపోయింది నాకు - పొలంలోం[చి] తప్పుకోమన్నాను. అదితీసుకోడానికిఎవరూ అంగరారేమోయ్"అన్నాడు సుందరం.

"అది వాడి స్వంతం కదండీ, మీరు అమ్మేస్తారని చెప్తున్నాడు" అన్నారంతా. సుందరానికి వొళ్ళు మండింది - వివరాలు కనుక్కుంటే - సుందరం తనకి చాలాబాకీ ఉన్నాడనీ ఇంకా అప్పులున్నందువల్ల ఇది తీర్చలేడనీ, పరిహారంగా ఆ భూమి తనకి వదిలేసినట్లే అనీ వెంకటరత్నం అందరితోటీ చెప్తున్నాడట - వాళ్లందర్నీ పంపించివేసి సుందరం కరణంగారింటికి పరుగెత్తాడు. "వాడిడబ్బు తక్షణం పారేస్తాను. కనుక్కోండి" అంటూ.

ఆయన వాడికి కబురంపి అలా చెప్పినందుకు కూకలేసి ఫలానారోజున ఆసామ్మిలో నీ వాటాఎంతో అడిగి నీకిచ్చేస్తాడు అని చెప్పి పంపించాడు - ఆభూమి వదిలెయ్యమని గట్టిగా చెప్పారు.

ఆ సాయంత్రం వసంత శుభ్రంగా నీళ్లు పోసుకుని మంచి చీరకట్టుకుని డాబామీదికి చల్లగాలికి వెళ్లింది. కింద వసారాలో కాంతం అత్తగారిగొంతుక కన్పించింది. ఎదుటింటి కాంతం గారి పెరటివసారాలో కాంతం కన్పించింది.

ఆ గొంతుక అంటోంది. "మీ మనవడితో చెబుదురూ. ఆ డబ్బు ఇవ్వవద్దనీ. ఇస్తేక్షణంలో తగలేస్తాడు..."

"నాకు తెలియవు. ఆ మొగాళ్ళ గొడవలు—"

"పోనీ లెండి నేనే బతిమాలతాను" ఏమిటోనండి దిక్కుమాలిన సంసారం. మా రెండోపిల్ల ఇక్కడ ఉందని వీడేడుస్తాడు. మా కాంతానికి దానికీ ఒక్కనిముషం పడదు కదా. కాంతం తెచ్చుకున్న పొడరు దీని కెందుకు చెప్పండి - అది అన్నదంటే అన్నది అనడం. కాని—" ఆ తర్వాత గొంతుక నొక్కుకుని ఏవో చెప్పింది.

కాంతాసమ్మితం

కాంతాన్ని రమ్మని సైగచేసి వసంత కిందికి వెళ్లింది. "చూశావా. నే వస్తున్నానని గొంతుక తగ్గించేసుకున్నావు" అంది నవ్వుతో.

"లేదండమ్మాయిగారూ. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందిట. మొన్న ఉంగరం పోయిందాండి. అనేక విధాల అనుకుని అఖరికి ఒంటెత్తుగావుంటుంది కనక ఆ పరాయి పిల్ల కాంతంమీదకి తోశేశాం-మా వెంకటరత్నం ఇంట్లో వున్న వాళ్ల పెట్టెలన్నీ వెతికిస్తే మా రెండో దాని పెట్లో ఉంది. ఇంట్లో పీనుగులే దొంగలైతే ఎలాగండీ చావడం అంది"

ఇంతలోకే కాంతం వచ్చింది. పుస్తకం తిరిగి యిచ్చేసేది పట్టుకుని. వసంత ఆమెను తనగదిలోకి తీసుకెళ్లింది.

"విన్నారుగదా ఇప్పుడే. ఇలాంటి చోట ఎలావుండ బుద్ధి అవుతుందీ—లేచి పోతే బావుణ్ణు ఎక్కడికేనా అనిపిస్తుంటే"

"గట్టిగా అనకు కాపరం వేరెట్టించిందంటారు."

ఏమనుకున్నా సరే. ఏమిటండీ ఈ బతుకు. ఇక మావారు! ఏరికోరి చేసుకున్నారట నన్ను అందుకే ఇంత ప్రేమ! నేను పౌడర్లు తెమ్మంటానని ఊరంతా చాటతారుగాని తను తగలేశేదానికి లెఖ్ఖ లేదు! 'మీరదృష్టవంతులండీ. మీరంటే ఎంత ప్రేమో మీ ఆయనకి."

ఆమాటే కాంతం ఇవేళంటే - వసంత "హమ్మో! బతుకు!" అంటుంది. ఆవేళ తన ఆదర్శప్రేమని ఆమె పొగిడితే బావుండేది.

"నీకు సందుదొరికితే చాలు పొగడుతావు నువ్వు! మీకు మేము డబ్బు ఇవ్వాలట విన్నావా?"

"అదే అడగడానికి వచ్చాను. ఎలాగేనా ఆయనచేతిలో పడనివ్వద్దని చెప్పండీ. మీ మాటకాదనరు. అసలు మీకంటె డబ్బెంతేదట మామగారి కాలంలో అంతా పోయింది. ముఖ్యంగా మావాటాకి అదే ఆధారం. అదీ పోతే ఏముంది ఇంక?"

వసంతకి దూరదృష్టి ఆశ్చర్యం గొల్పింది. కాని తను మధ్యాహ్నమే చెప్పింది.

"మనకెందుకీ బాధ్యత,లక్ష్మి పోనిద్దూ. వదిలినదల్లా మంచిమాట" అన్నాడు. అదే అంది.

"అవును లెండి ఎంతమంచి వారండీ మీ ఆయన - పత్రంముక్కైనా లేకుండా మాటమాత్రం ఆధారంగా డబ్బు తిరిగియిస్తున్నారు వడ్డీతో సహా - అపూర్వ కాలపు ప్రేమలుండబట్టి. ఎవరిస్తారీ రోజుల్లో. మళ్ళీ చెప్పి చూడండి. ఆ తర్వాత మా అదృష్టం...ఆ ఫొటోలో మీ దంపతుల ప్రేమంతా ఉట్టిపడుతోందండీ."

మర్నాడు మధ్యాహ్నం కాంతం అత్తగారూ, కాంతం వచ్చారు. సుందరాన్ని ఆ డబ్బు ఇవ్వవద్దని అత్తగారు ముందు ప్రార్థించింది. కాని అతను నాకెందుకమ్మ ఈ బెడద అన్నాడు. తలుపుచాటున ఉన్న కాంతం అంది.

"మాకు అంటే, మావాటాకి వచ్చేవి ఆ కాస్త డబ్బూ తప్ప ఇక చెప్పుకోదగ్గ ఆస్తి లేదని మీకు తెలుసు—మా కుటుంబ పరిస్థితులూ మీకు తెలుసు - మిగతా డబ్బు అంతా మా బావగారి పిల్లలకోసం; మా పెళ్లి కాని ఆ పడుచుకోసం దాచనే దాస్తున్నారు - ఒక్క మేమంటేనే మీకు అభిమానం లేనట్లుంది. ఇది మర్నాడు మాయమై పోతుంది. ఆతర్వాత మా గతి ఏం కావాలి. కొంచెం దయతో ఆలోచించండి."

గుమ్మం దగ్గర తలుపుచాటున నిలబడి కాంతం ఈ మాటలు వప్పగించేసరికి సుందరం బిత్తరపోయాడు - అయినింటి కోడలు అలా వచ్చి అడుగుతే కాదనలేదు-

ఆ వేళే కరణంగారి సాయంతో ఆ డబ్బుకి ప్రామిసరీనోటు రాసి ఇవ్వడానికి నిశ్చయించాడు. "తాడూ బొంగరం లేని కబురంటూ అసలు పత్రం గా రాయించుకున్నావు. నీ బాకీ ఇంక భద్రం అన్నమాట. సంతోషించు" అని కరణంగారు నచ్చచెప్పినమీదట వెంకటరత్నం నసుగుతూనే 'ఊఁ' అన్నాడు. పొలం కూడా కవులుకిచ్చే షరతుమీద.

జరిగినదానికంతా మహాశ్చర్యపోయింది వసంత! కాంతం అంటే ఎందుకో మొట్టమొదటిసారి కొంచెం భయపడింది. తను ఆయనచేత చేయించలేని పని అది చేయించింది!!

4

తాళం తాళంలా ఉండగా కాంతంగారి గాదెలో తిండికి పెట్టుకున్న వొడ్లు అయిదు బస్తాలు మాయమై పోయాయి — బహు తక్కువ ఉన్న మూలాన అనవాలైనా తెల్సింది పోయినట్లు.

వాళ్ళ కుటుంబం అంతా గగ్గోలు అయింది. అయిదారు రోజులు పోయాక కాంతం వసంతతో కబుర్లు చెప్పడానికి వచ్చింది.

"పట్నాల్లో ఊరికే చదువూ, పనులూ నేర్పే స్కూళ్ళుంటాయటకదండీ" అంది కాంతం.

ఉంటాయి కాని బహుతక్కువనీ; ఏ ఆధారం లేని బీదలకి అందులో తక్కువ మందికి మాత్రం అవకాశం ఉంటుందనీ వసంత చెప్పింది. వసంతా, కాంతం చాలా స్నేహితులయ్యారు. మనసులు కలిసి రహస్యాలు చెప్పుకున్నారు - వసంత తనకి సుందరం తీసిన ఫొటోలు, ఇతరులు చూడకూడనివి కూడా చూపించింది కాంతానికి.

"మీరెంత బావుంటారండీ ఈఫొటోల్లో నిజంగా సినిమాస్టారుంగా వున్నారు. మీరు బలే అదృష్టవంతులండీ" అన్నది కాంతం.

"నువ్వుమాత్రం బావుండవూ? నాకంటె బావుంటావు- దానికేంగాని మీ అత్తగారు వేరే కాపరం పెట్టిస్తుందట నీచేత."

"సుఖపడతాం. నేనే కొంచెం కొంచెం గొడవ చేశానులెండి అందుకు."

"ఏం."

"చెప్పమంటారా. మొన్న వొడ్లు ఎలా పోయాయని మీ ఉద్దేశం మా ఆయన వాటిని సద్వినియోగం చేశారు. ఇది మా అత్తగారు ఇంకా మీయింట్లో ఎందుకు ప్రసారం చెయ్యలేదో! నిజంగా తెలియదండీ మీకు."

ఇదేదో వసంతకీ విచిత్రంగానే వుంది.

"తోటకూర కాడల సేజీ దాటిపోయింది మావారి పని - పెళ్లి కావల్సిన పిల్ల ఉండగా ఇంకా వాళ్ళని పాడు చెయ్యడం ఎందుకు? మావైతే తగువు లేదు. కాని అంతా అలా అనుకోరులెండి."

"కాని మీరు చెన్నపట్నం వెడతారుట కదండీ ఉద్యోగానికి. నాకూ చూడాలని ఉందండీ. మరిచిపోతారేమో అసలు నన్ను. అక్కడ పెద్ద పెద్ద భవంతుల్లూ, రోడ్లూ ఉంటాయేమండీ?"

"నేను మాత్రం చూశానా నీవు చెప్పేటందుకు" అంటూ వసంత నవ్వింది ఆ ప్రశ్నకి.

"మీరు నవ్వితే ఎంత బావుంటారండీ. అందుకే మీవారి కంత ప్రేమ."

వారం రోజుల్లో - ఒక మంచి రోజున కాంతంచేత వేరే వంట పెట్టించింది వాళ్ళత్తగారు ఇంట్లో ఒకవైపు వాళ్లకిచ్చి. ఆవాటాలో నట్టివాకిట్లో నుంచుంటే వసంతగారి డాబా ఎదురు—

ఒకనాడు పుచ్చపువ్వులా వెన్నెల కాస్తుండగా, వసంత డాబా చివరికి వెళ్లి కాంతంగారి వాటావైపు చూసింది - వేసవి కావడంవల్ల పడకలు డాబామీదే - రాత్రి పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకున్నారు. ఆ వెన్నెట్లో నైట్ క్వీన్ చెట్టుదగ్గర నిల్చుని

తమ మాటలు వింటోంది కాంతం! తను చూస్తుండగానే వెంకటరత్నం ఇంట్లోంచి వచ్చి ఆమెని తిరుతో గబగబా లాక్కుపోయాడు.

"నీకు ఆడిమీద కన్ను పడిందిటే లంజా" అంటూ.

వసంత భయపడింది అది నిజమా — ఏమో! కాని ఆ జెన్నెల్లో అలానుంచుంటే ఎంత బావుందో! తనకంటె బావుంటుంది అంటారందరూ - అది నిజమే - ఆ భర్తకి ఆ అందాన్ని అనుభవించడం తెలిస్తేగదూ!

ఈ సంగతి సుందరంతో చెప్పలేదు వసంత.

తన ఆటలు సాగడానికి వేరే పెట్టించింది అన్న వాళ్ళ నోళ్లు కట్టడిపోయాయి కాని కాంతం ఈమధ్య వసంతదగ్గరికి రావడం మానేసింది. మాట్లాడుకోవాలంటే డాబా ఎక్కి పల్కరించాలి పది రోజుల తర్వాత వసంత పల్కరించింది

"ఏం రావడం మానేశావు?"

"అయ్యో! మీకింకా తెలియలా! నేను తిరిగి చెడిపోతున్నానని తెలియలా? అంగుకూ."

"నేను నిజంగా అడుగుతున్నా. మన స్నేహం జ్ఞాపకం పెట్టుకు చెప్పు కాంతం. వేరు కాపరం నీకేం లాభం?"

కాంతం నవ్వింది. మల్లెలు విచ్చినట్లు నవ్వుతుంది కాంతం.

"మేం పూర్వంకంటె స్వేచ్ఛగా పోట్లాడుకుందుకి వీలు. అదీ లాభం మా అత్తగారు చెప్పలేదూ మా యిద్దరి మధ్యా దెబ్బలాట లెక్కలైనాయనీ, తిండి సరిగా తినం అనీ ."

కాంతం ధోరణి చూస్తే వసంతకి వివరాలు అడిగేందుకు జంకు పుట్టింది - తన కావేళ కల్గిన అనుమానమే కారణం బహుశా కాంతాన్ని కల్సుకోలేదు మళ్లీ. వేసవి గడచిపోయింది. సుందరం మద్రాసు కాపరం పెట్టాడు మద్రాసు ప్రయాణమయ్యేనాడు కాంతాన్ని పిల్చి చెప్పింది వసంత.

"నన్ను మరిచిపోకండీ - నేనూ మీతో వచ్చేస్తే ఎంత బావుణ్ణు" అంది కాంతం.

ఆనాడే కాంతం కూడా ఊళ్ళోంచి లేచిపోయిందనీ వసంతకీ సుందరానికీ ఊళ్ళో వాళ్లెవరో రాస్తే తెల్సింది. చాలా రోజులు సుందరంతో నే పోయిందని పుకారు కూడా పాక్కిందట. కాని వెంటనే ఉత్తరం రాశాడు సుందరం తనకేం తెలియదనీ ఊళ్ళో ప్రకటించమనీ కరణంగారికి.

నాటికి నేడు కాంతం మళ్ళీ మద్రాసులో వసంతదగ్గరికి వచ్చింది. ఆమె చాలా బాధలు పడిందని వాలకమే చెప్తోంది - ఆమె అసలు ఎందుకు లేచిపోయిందో - విశేషించి ఇప్పుడు తన స్థితిని చూసి ఆమె ఏమనుకుంటుందో! ఆయన వద్దన్నారని కాంతాన్ని ఏం అడగలేదు ఆమె జీవితం వివరాలు. రేపు అడగాలి అనుకుంటూనే వసంత నిద్రపోయింది ఆ రాత్రికి.

5

మరునాడు కాంతాన్ని ప్రశ్నించింది వసంత. "నీ కాయన ఎలా తటస్థపడ్డారని కథంతా కాంతం చెప్పింది

"కాని ఆయన నన్ను రక్షించారు నేను ఆయన్నీ రక్షించానండోయి" అంది కాంతం.

"ఎలాగ"

"ఎలాగేమిటి ఆయన చెప్పవలసిన సాక్ష్యం నే చెప్తున్నాను. ఆయన కన్పించకపోతే నే చెప్పేదాన్ని కాదు - ఇందువల్ల ఆయన గౌరవమూ చెడదు.

ఆమె నికృష్టజీవితం అంతా తెలివిగా తెల్సుకుంది వసంత ఆమెలో చేసినపనికి ఏ కోశానా పశ్చాత్తాపం లేదనీ తెల్సుకుంది ఈమెని ఏం చెయ్యడం అన్నది తాము పరిష్కరించాల్సిన సమస్య తన పూరు తిరిగిపోనని చెప్పేసింది కాంతం. కాంతానికి తన భర్తమీద మనసుందని అనుమానం - ఈమెను త్వరలో ఏదో పని చూపి పంపివెయ్యకపోతే తనకే ముప్పు. క్రమక్రమంగా కాంతం కోలుకొని ఆమె పూర్వపు అందం రాసాగింది. వసంతకానీ సుందరంకానీ ఆమెకు ఏలోటూ రానివ్వలేదు ఆమె రోజురోజూ అందంగా తయారౌతున్న వసంతకి భయం లేకపోడానికి కారణం సుందరం ఆమెతో ఎప్పుడూ మాట్లాడడు కనుక.

కాంతం ఒకనాడు వంటరిగా కూర్చుని చాలా మడతలుపడిన పాతకాగితం రహస్యంగా చదువుతోంది వసంత రాగానే అది దాచుకుంది. కాని వసంత వదిలిపెట్టలేదు.

"సరే మీ ఉత్తరం నే నెందుకు దాచాలి. చూసుకోండి" అంటూ కాంతం ఇచ్చేసింది.

అది తన భర్త ఏడాదిక్రితం తనకు సహం సహం రాసిన ఉత్తరం!! వసంత లక్ష్మి నవవసంతంలా నా జీవితంలో అడుగుపెట్టి అర్థవంతం చేసిందనీ వసంత నిర్ఘాంతపోయింది. ఎలా వచ్చిందని అడిగింది

"నన్ను నమ్మతారా? నాకు చదువుకుందు కిచ్చే పుస్తకంలో వచ్చేసింది నేనది బావుండి దాచుకున్నాను. తిరిగి యివ్వలేదు ఆయనకి. ఎక్కడో పారేశాననుకుని మళ్ళీ రాసిఉంటారు ఆయన మీకు. అది

వేటకోసం అడవిలో మకాం వేసిన ఆఫీసరుగారి గడియారం అకస్మాత్తుగా ఆగిపోయింది ఆయన నౌకరునౌకణ్ణి పిలిచి, వేగం పట్నానికి పోయి సరైన టైము కనుక్కొని రమ్మన్నాడు.

వాకిట్లోదాకా వెళ్ళిన నౌకరు వెనక్కి తిరిగివచ్చి, బుర్ర గోక్కుంటూ 'ఆడ టైము చూత్తా ననుకోండి ఈడకి ఎట్టా తీసుకురానా అని!" అంటూ నసిగాడు. ఆఫీసరుగారికి వొళ్లు మండిపోయింది.

"ఏడిసినట్లుంది. వెధవ తెలివి తేటలు. అక్కడెవరినైనా అడిగి టైం ఎంతైందీ చిన్న కాగితం ముక్కమీద రాయించుకరా? పో!" అన్నాడు.

చూసే ఆయన మిమ్మల్నెంతగా ప్రేమిస్తారో అనుకున్నాను"

"ఆс. ప్రేమ" అనేసిందివసంత.

కాంతానికి ఈ దీర్ఘం అర్థంకాక అలా చూస్తూ నిలబడింది.

తాను యిల్లువదలడానికి కారణం ఎన్ని మాట్లడిగినా మాట్లాడేదికాదు కాంతం - వసంతకూడా తనలోనూ, తమ దాంపత్య సుఖంలోనూ వచ్చిన మార్పుని కాంతం గ్రహించలేదనుకు నేంత వెర్రిదికాదు. కాని కాంతం ఒక్క మాటకూడా ఆ విషయమై మాట్లాడలేదు అడగలేదు తన కీమధ్య మాటిమాటికీ ఏడ్పు వస్తోంది - తనలో ఏదో అసంతృప్తి హెచ్చైపోతోంది తన బాధిత హృదయాన్ని శాంతపరిచే భర్త కాకపోయాడు తన భర్త - ఆపైన తనకు తీరని కోరిక లున్నాయి - పలుకుబడి, డబ్బున్న వాళ్ళతో స్నేహం; ధనం, చీరలు నగలు; సొసైటీలైఫ్ - ఇవేమీ ఇతను వెయ్యి జన్మ

(52-వ పేజీ చూడండి)

మా సుందరమ్మక్క

శ్రీ మధురాంతకం రాజారాం

ఉగాదికి పుట్టింటికి వచ్చిన మా అత్తయ్యను రైలెక్కించేసి ఇంటికి తిరిగి వచ్చేసరికి సరిగ్గా తొమ్మిది గంటలయింది. తొమ్మిదిగంట లయినందుకు గుర్తు చర్చి బెల్ టాంగుటాంగుమని మ్రోగడం ఒకటి, పార్కులోనుంచీ సైరన్ మ్రోత రెండు నిముసాలపాటు కర్ణకఠోరంగా వినరావడం రెండు. రాత్రి తొలిజాము గడచిపోయినా నానాగల్లంతులతో ఇంకా అలజడినే కొనసాగిస్తున్న పురజనులపైన కాలపురుషునికి కోపం వచ్చి "ఇంతవరకూ చేసిన గోల చాలు, ఇకనైనా పడుకోండర్రా" అని అరుస్తున్నట్టుంది ఈ సైరన్ మ్రోత అనుకొని, ఇంతటి అద్భుతమైన ఛలోక్తిని ఊహించగలిగినందుకు నన్ను నేనే అభినందించుకుంటూ, వీధి మెట్లెక్కి తలుపు తట్టబోయి, మా పొరుగింటి మోహనరావు బావ ఎప్పుడూ లేనిది, వీధి అరుగుపై పండుకొని వుండడం చూచి ఒక క్షణంపాటు నిర్ఘాంతపడి అలానే నిలచిపోయాను. నిర్ఘాంతపోవడానికి కారణం జరుగుతున్నది పండు చలికాలం కావడం ఒకటి, భార్య ఆయన్ను వియోగాంబుధిలో ముంచి పుట్టింటికి కాదు సరికదా, పొరుగింటికైనా పోకుండా ఇంట్లోనే వుండడం రెండు. ఆమె ఇంట్లో వున్నందుకు నిదర్శనం రేడియోలో 'శ్రోతలు కోరిన పాటలు' వినవస్తుండడం ఒకటి, వరండానుంచీ వంటగదివరకూ లైట్లు ధగద్ధగాయమానంగా వెలుగుతుండడం రెండు. చలికాలపు రాత్రిలో, నులివెచ్చని పానుపుమీద పడుకొని, తులలేని సౌఖ్యం అనుభవించడానికి బోలెడంత అవకాశమున్నా, పాపం ఈ మానవుడీ అరుగుమీద పడుకున్నాడేమా అనుకొని దగ్గరికివెళ్ళి 'బావా' అని పల్కరించాను. ఆయన పలక్కపోతే పోనీ, నావైపైనా చూడకుండా బాహ్యప్రపంచంతో ఏమాత్రమూ సంబంధం లేని మహాయోగిలా తీక్ష్ణదృక్కులతో గగనాన్ని పరిశీలించడంలో నిమగ్నమై వున్నాడు. ఈ ఖగోళశాస్త్ర జిజ్ఞాస హఠాత్తుగా ఈయన కెందుకు కలిగిందో అర్థంగాక "ఏం బావా! చలికి గజగజ వణకుతూ ఇక్కడ పడుకున్నావ్" అన్నాను. "ఇంట్లోకంటే ఇక్కడే బాగుంది. ఆ మాటకు వస్తే ఈ అరుగుమీదకంటే జనసంచారమే లేని ఒక అడివికి వెళ్ళిపోతే మరీ బాగుంటుంది" అన్నాడు మోహనరావు బావ ఏ నక్షత్రంపైనో కేంద్రీకృతమైవున్న తన దృష్టిని చెదరిపోనీకుండా! "నూటికి, కోటికి విలువైనమాట చెప్పావు బావా! ఐతే ఈ మాట ముక్తసంగులైన మునులు చెప్పవలసింది. నువ్వు చెప్పవలసింది కాదు" అంటూ నేను మా ఇంట్లోకి వెళ్ళిపోయాను.

భోంచేస్తుండగా మాఅమ్మద్వారా అసలు విషయం బైటపడింది. మోహనరావు కెందుకోగానీ భార్యపైన కోపం వచ్చిందట! పనికిరాని పిచ్చిపుల్లయ్యకు కూడా భార్యమీద కోపం రావడం సహజమైనప్పుడు నెలకు రెండువందల రూపాయలు సంపాదించే మోహనరావు విషయంలో ఇదేమీ వింతకాదు. ఐతే మోహనరావుకు కోపం వచ్చినప్పుడు చూచీ చూడనట్టు ఊరుకునే స్వభావం కలదికాదు సుందరమ్మ. తల్లిదండ్రులకు ఒక్కతే కుమార్తె కావడంచేత ఆమె బాల్యంలో అల్లారుముద్దుగా పెరిగింది. అందువల్ల ఆమెలో స్వాతిశయం బాగా వేరూనుకొని నిలిచిపోయింది. ఇందుకు తోడూ ఆమె తనను గొప్ప అందగత్తెగా భావిస్తుంది. ఈ అందాన్ని గురించి ఈ విశాల ప్రపంచంలో ఏ ఇద్దరికీ ఒకే అభిప్రాయమంటూ లేనప్పుడు, నేనామెను రూపవతి అంటే చాలామందికి కోపం రావచ్చు. కాగా పోగా ఒరులకు కోపం రావచ్చునని కూడా జంకకుండా నేను చెప్పగలమాట ఒక్కటే ఒక్కటి. పెదవులపైన చిరునవ్వు విరిసినప్పుడు మాత్రం ఆమె ఎంతసేపైనా చూస్తూవుండిపోదామా అనిపిస్తుంది. కానీ ఆమె హృదంతరాళంనుంచీ లేతనవ్వు పెల్లుబకడం చాలా అరుదు. అంటే ఆమె సామాన్యంగా నవ్వదని కాదు, నిజ చెప్పాలంటే ఆమె ఇంతమాటకు, అంత మాటకు కూడా విరగబడి నవ్వేస్తుంది. ఐతే పకపకా నవ్వుతున్నప్పుడు మాత్రం ఆమె ముఖాన్ని చూడకుండా తలవంచుకొని కూచోవడమే హాయి!

భోంచేసిన తర్వాత ఒకసారి పక్కింటికి వెళ్లి భార్యాభర్తలకు రాజీ కుదిర్చి వద్దామా అన్న ఆలోచన కల్గింది. కొంపదీసి వాళ్లిద్దరిమధ్య కలిగింది ప్రణయకలహమైవుంటే! అది వాళ్లల్లోనే చల్లారడం మంచిదనుకొని, తాత్కాలికంగా ఆ విషయం మరచిపోయి నిద్రపోయాను. ఉన్నట్టుండి వేకువజామప్పుడు మెలకువ వచ్చింది. లేచి పడకపై కూచొని ఈ వేళ కాని వేళలో మనకెందుకు మెళకువ వచ్చిందబ్బా అన్న ఆలోచనలో పడ్డాను. అంతకుముందు ఎన్నిసార్లు పిలిచిందోగానీ, ఈసారి మాత్రం మా అమ్మ కొంచెం విసురగా కేక వేసింది. "ఒరే నాయనా కొంచెం లేవరా బాబూ!" అని. 'ఏమమ్మా' అన్నాను. 'పాపం, ఆ అమ్మాయి ఎందుకో ఏడుస్తున్నట్టుందిరా' అంది. చెవులు నిక్కించి ఆలకించాను. అంత చలిలో కూడా కాలవలో స్నానం చేసివచ్చి మాఘపురాణం చదువుకునే మా సుందరమ్మక్క, పురాణపఠనానంతరం కుమార్తెను నిద్రలేపేందుకు మేలుకొలుపులు పాడే మా పొరుగింటి ఇల్లాలు గొంతెత్తి ఏడుస్తున్నది. ఆమె నీలాటి శోకసాగరంలో ముంచిన మోహనరావు క్షంతవ్యుడు కాదు, కాడు అనుకుంటూ లేచాను.

తలుపుతీసుకొని బయటకువచ్చి పక్కింటి అరుగువైపు చూచాను. అది శూన్యంగా వుంది. కొన్నిగంటల క్రితం, కాంతారంలో జీవిత శేషాన్ని గడుపదలచుకొన్న మహావిరాగి మోహనరావుగారు అప్పుడే తమ మహదాశయానికి మంగళంపాడి లోపలికి వెళ్లిపోయారేమా అనుకొంటూ పక్కింటి తలుపు తట్టాను. అది గబాలున తెరచుకొన్నది. ఆలుమగలు కలహాల్లోపడి, కవాటబంధనాన్నే మరచిపోయినందుకు ఆశ్చర్యపడుతూ లోపలికి వెళ్ళాను. హాలు కు



"సుందరమ్మక్క రిబ్బన్లను, బెలూన్లను, రోజాపువ్వుల్ని చూచి విస్తుపోయినా నే నక్కడ ఉండడం మూలాన కూతురితో మాట్లాడలేకపోయినది."

ముందుగదిలో పందిరి మంచంపైన పరుపు పరచబడివుంది. ఐతే నే ననుకొన్నట్లుగా ఆపడకపైన మోహనరావు లేడు!

ఒక వేళ, "ఇదేం అవాంతరంరా బాబూ; కలకంఠికంట కన్నీరొలికిన సిరి ఇంట నుండ నొల్లదుగదా!" అని తన మతిని సందలించుకొని భార్య దగ్గర్నే కూచొని ఆమెను సముదాయిస్తున్నాడేమో నను కొంటూ హాల్లో ప్రవేశించాను. అనసూయ నిద్రపోతోంది. సుందరమ్మక్క మాత్రం ఈజీచేర్లో పండుకొని, దుప్పటిని నిలువెల్లా కప్పుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఇదంతా ఏమిటక్కయ్యా? బావేడీ?" అన్నాను. ఆమె ముసుగు తీసి నాకేసి చూచింది. కొండంత దైన్యావస్థను కనులో లీనం చేసుకొన్న ఆ చూపులు మోహనరావు చేసిన పనిని చెప్పకనే చెప్పేశాయ్.

నిజం చెబుతున్నాను, నాకు కోపం వచ్చింది చరాలున! భార్యాభర్తలమధ్య కోపాలు, తాపాలు రావడం ఏమంత విడ్డూరమా? ఐతే అవి వచ్చినంత మాత్రాన భార్యను ఏకాకిగా ఇంట్లో దిగవిడిచి భర్త రాత్రికి రాత్రే ఎక్కడికైనా పలాయనం చిత్తగిస్తే ఒంటరిగా ఆమెగతి ఏంకాను? చిన్నారిపాపాయిల చిరునవ్వుతోనూ, ఎప్పుడో ఒకప్పుడు ముఖంముడుచుకొన్నా మిగతా సమయాల్లో తనను ఆనందపారావారంలో ముంచితేల్చే సహధర్మిణి అనురాగంతోనూ పునీతమైన గృహమే స్వర్గసీమ అని మహామహా మనీషులే ఏకకంఠంతో ఉద్ఘోషిస్తుండగా మా సుందరమ్మక్క హృదయంలో ఆ వేదన రగుల్కొల్పి చిలిపితనాల చిట్టిపాప అనసూయను విడిచిపెట్టి, గహనానికి కాకపోయినా గృహాన్ని వదలి మరెక్కడికో వెళ్లిపోవడానికి ఈ మోహనరావేమైనా గౌతమ బుద్ధుడా? "కాదు. ఇతడు గౌతమ బుద్ధుడూ కాదు! ఇది మహాభినిష్క్రమణమూ కాదు!!" అని నాలోనేనే ఒక నిర్ణయానికి వచ్చాను.

ఈ ఆలోచనా పరంపర నాలో చెలరేగుతున్నప్పుడు తలవంచుకొని నేలను చూస్తూ వుండిన నేను మోహనరావు బావను బుద్ధభగవానునితో పోల్చుకున్నప్పుడు మాత్రం తటాలున తలఎత్తి సుందరమ్మక్కను చూచి "హే భగవాన్! ప్రపంచచరిత్రలో ఒక యశోధర విషాద జీవితగాథను చదువుకోడానికే మాగుండెలు బ్రద్దలైపోతున్నాయ్. మా అక్కయ్యను రెండవ యశోధరగా జేశావంటే, రెండు వందలకోట్ల మానవులం మేమందరమూ ఒక్కుమ్మడిగా నిన్ను పాషాణహృదయుణ్ణిగా భావించేస్తాం. కర్మ గిర్మ అని తరువాత నువ్వెంత సర్ది చెప్పినా లాభముండదు. ఈ దెబ్బతో మేమందరమూ నాస్తికులమైపోయే అవకాశం కూడా ఎంతో వుంది. జాగ్రత్త సుమా జాగ్రత్త!"

★ మా సుందరమ్మక్క ★

అని జగన్నేతను లోలోపలనే ఒకసారి కుందలించాను.

"కూచో తమ్ముడూ" అన్నది సుందరమ్మక్క. "ఐతే ఇంతకూ ఏమంత అపరాధం జరిగిపోయిందక్కయ్యా ఆ మహానుభావుడు వెళ్ళిపోవడం?" అంటూ కూచొన్నాను. ఆమె ఒక గంటసేపు చెప్పగా చెప్పగా కట్టకడకు తేలిన సారాంశం ఇది: పెండ్లైన కొత్తలోనే మెం భర్త ఆమెను "చాలా ఇదిగానే" చూచుకొనేవాడట! తరువాత రానురానూ అతనికి ఆమెను చూస్తేనే ఒళ్ళు మండుతున్నదట! ఆ మండటం కూడా ఆరు నెలలనుంచీ మరీ విశేషమైపోయి, ఇంతింత వటుడు అంతంతై బ్రహ్మాండాన్నే ఆవరించుకొన్నట్టు ఈ నాటికి పరిపూర్ణాకృతి దాల్చిందట! వెళ్ళిపోయాడట!

"ఇదంతా వట్టి బెదిరింపులే అక్కయ్యా! ఇంతమాత్రానికే ఏడుస్తూ కూచున్నావు నువ్వు! సెకండు షో సినిమాకు వెళ్ళి వుంటాడు. అక్కడెవడైనా ఫ్రెండు కనపడివుంటే వాడితో కూడా వెళ్ళి పడుకొని వుంటాడు. తెల్లవారి ఎనిమిది గంటలయ్యేసరికి అతడింటికి పరుగెత్తుకొని రాకపోతే నేను చెవిగోసుకుంటాను" అని సుందరమ్మక్కకు ధైర్యం చెప్పి, అనసూయకు చక్కలిగింతలు పెట్టి, వాళ్ళమ్మకు బదులు నేనే మేలుకొలుపులు పాడి అది లేచి నిద్రాభంగానికి కోప్పడి దురుసుగా నాలుగు మాటలు వడ్డించగా వాటిని ఆనందంతో స్వీకరించి "మళ్ళీ వస్తా నక్కా" అని మా యింటికి వచ్చేశాను.

ఐతే నేనన్నట్టు మోహనరావు ఎనిమిది గంటలకు రాలేదు! నిలిచిపోకుండా చక్రకంగా తిరుగుతున్న అన్ని గడియారాల్లోనూ చిన్నముల్లు ఎనిమిది దగ్గరకు ఎనిమిది సార్లు వచ్చి వెళ్ళిపోయినా మోహనరావు రాలేదు! ఈ నాలుగు రోజులు సుందరమ్మక్కకు నాలుగు యుగాల్లా కనపడ్డాయి. ఐదవరోజు ఉదయాన అనసూయ వచ్చి 'మా అమ్మ నిన్ను రమ్మంటోంది బావా' అన్నది. వెళ్ళాను. సుందరమ్మక్క ఉండి ఉండి కడకేలాగో ఒక లాగు తెగువ తెచ్చుకొని 'ఒకసారి ఆఫీసుకు వెళ్ళిరా తమ్ముడూ' అన్నది. "ఆఫీసుకువెళ్ళి అతణ్ణి పిలిస్తే మనం తట మనమే ఓడిపోయినట్టవుతుం దక్కయ్యా! అతడీలా ఎన్నిరోజులు ఇల్లు విడిచి వుండ గలడనుకుంటున్నావు? బహుశా ఈ వేళకే తలబట్టగట్టి వుంటుంది" అని నేనంటూ వుండగానే సుందరమ్మక్క నా మాట లామెకు వచ్చకపోవడంవల్ల కాబోలు విసరుగా లోపలికి వెళ్ళిపోయింది. ఇక ఆఫీసుకు వెళ్ళకా తప్పదు, అతణ్ణి బ్రతిమిలాడుకోకా తప్పదు అని నేనొక నిట్టూర్పు విడిచాను.

ఆ సాయంత్రం స్కూలు వదలిన తర్వాత మోహనరావుగారు ఉద్యోగం వెలిగించే ఆఫీసుకు వెళ్ళి అతని కుర్చీ ఖాళీగా వుండడం చూచి దిగాలుపడి ప్రక్క కుర్చీలో కూచొని ఏదో వ్రాసుకొంటున్న క్లర్కును "మోహనరావుగారెక్కడండీ?" అని అడిగాను. నేను లోపలికి వచ్చిన సవ్వడినైనా గమనించకుండావుండిన ఆ గుమాస్తా నా ప్రశ్న చెవినిబడగానే ఇంటి పైకప్పునుంచీ తేలో, పామో తనపై పడ్డంత ఖంగారుతో తల ఎత్తి నాకేసి చూసి 'ఏమిటీ, ఏమిటీ' అని మళ్ళీ తన పనిలోనే లీనమైపోయాడు. ఎడమచేత్తో మాటిమాటికీ క్రాపింగును చెరుపుకుంటూ, ముద్దలు ముద్దలుగా పడుతున్న ఇంకును ఒత్తడానికోసం తన ఎదుట పడివున్న కాగితాల గుట్టను తల్లక్రిందులు జేసి బ్లాటింగు పేపరు దొరక్క నిరాశా నిస్పృహలతో అలమటించిపోతున్న అతన్ని చూచేసరికి (పాపం క్షమించుగాక!) నాలో ఒక విపరీతపు టూహ పుట్టింది. ఒక లక్షాధికారి ఉన్నాడనుకొందాం. ఇంకొక ఐదు నిముషాల్లో తన గుండె ఖచ్చితంగా ఆగిపోతుందనీ, అందుకేమీ సందేహం లేదనీ తెలియగానే అతి సమీపంలోవున్న మృత్యువుకు భయపడినా దుఃఖించడానికి తీరికలేకుండా అతడెంత తొందరగా తన వీలునామాను వ్రాయగలడో ఊహించుకొన్నవారికి ఈ గుమాస్తా ఎంతటి గందరగోళంలో వున్నాడో అర్థం కాగలదు. అంత తీవ్రంగా ఏదో వ్రాసి పారేస్తున్న అతన్ని మా మనోనేత్రాలకు ప్రత్యక్షం చేయాలన్న సదుద్దేశంతో నేనీవిపరీతపు ఉపమానాన్ని చెప్పినందుకు క్షంతవ్యుణ్ణి. వ్యక్తిగతంగా అతనిపై నాకేమీ పగలేదు. అసలు అతడెవరో కూడా నాకు తెలియదు. ఇంతలో నా అదృష్టవశాత్తు అక్కడికొక జవాను వచ్చాడు. అతన్నడగ్గా తెలిసింది మోహనరావుగారు రెండువారాల సెలవులో వున్నారని!

ఆఫీసు మెట్లు దిగుతూ, ఈ దుర్వార్తమానాన్ని సుందరమ్మక్కకు చెప్పకుండా వీలైనంతవరకూ కాలహరణం చేయడం మంచిదనుకొని ఎనిమిది గంటలవరకూ రీడింగురూములో వుండి, తొమ్మిదిన్నర వరకూ వీధుల్లో తిరిగి, ఇంటికి వెళ్ళి ఐదు నిముషాల్లో భోంచేసి మా అమ్మతో చెప్పి పరిమళాటాకీసులో 'పరదేశి'ని చూడ్డానికి వెళ్ళాను. హాలు చేరుకునేసరికి న్యూస్ రీలు ప్రారంభమైంది. చెవులు మాటల్ని, పాటల్ని వింటూనేవున్నా, కండ్లు తెరపైన బొమ్మల్ని చూస్తూనేవున్నా మనసు మాత్రం మోహనరావును వెంటాడుతోంది. అతడెక్కడికి పోయినట్టు? ఎప్పుడు వస్తాడు? కొంపతీసి ఇక రానే రాడా? రాకపోతే సుందరమ్మక్క గతి ఏమిటి?...

ఇంటర్వెల్లో దీపాలు వెలగ్గానే, అప్పటికప్పుడే నా తలపైన కూచుంటున్న [illegible] దేవిని మరికొంతసేపు దూరంగా నంపాలనుకొని తాంబూల సేవకోసం [illegible] స్టాల్ వైపు వెళ్తూ, ఫస్టుక్లాసు టిక్కెట్లవాళ్ళు కూచొనే సోఫాలవైపు చూడ్డం తటస్థించి వాటిలో ఒకదాన్లో ఆదిశేషుని పైన శ్రీమన్నారాయణమూర్తిలా పవ్వళించివున్న మోహనరావుగారిని చూచి నోట మాటరాక నిశ్చేష్టుడినై నిలిచిపోయాను. అతడు నన్ను చూడ్డంలేదు. సిగరెట్టు పొగతో నృత్యాలు చేయిస్తూ నాబోటి అజ్ఞాని ఇది అది అని చెప్పలేని అనిర్వచనీయానందంలో దేన్లోనో లీనమైవున్నాడు! నేను తలుపుదాకా వెళ్ళి 'ఏమండోయ్' అని పిలిచాను. అతడు నన్ను చూచి ఉలిక్కిపడి, మళ్ళీ అంతలోనే తమాయించుకొని అన్నెమూ పున్నెమూ ఎరుగని అమాయకుడులా "ఏమిట్రా" అన్నాడు నెమ్మదిగా! "కొంచెం దయచేసి ఇక్కడికి వస్తారా?" అన్నాను. అతడు తక్షణం పైకిలేచి గడపదగ్గరికి వచ్చి 'అబ్బబ్బ, ఎంత చలిగా వుందిరా' అన్నాడు, అంత చలిగా వుండడానికి నేనే

బిచ్చగాడు: అమ్మా! కాస్త పరమాన్నం వుంటే పోయించండి అమ్మా!

ఇల్లాలు: ఏం? పరమాన్నం ఎందుకూ?

బిచ్చగాడు: మామూలు రోజైతే అదే చాలు ననుకోండి. కానీ యీ వేళ నా పుట్టిం రోజు పండుగ అండీ అమ్మా!

కారణమైనట్టు! అందు కేమనాలో నాకు తోచలేదు. తరువాత అతడు 'టీ త్రాగేసి వద్దాంరా' అని ముందు నడిచాడు. అతడు కనపడితే నిలువునా నీరైపోయేట్టు దబాయించా లనుకున్నాను నేను, కానీ కనపడేసరికి మాట నోటిని పెకలించుకొని బయటకు రావడంలేదు. టీ త్రాగడం ముగించి మళ్లీ అతడే మాట్లాడించాడు 'మీ అక్కయ్య ఏలావుందిరా' అని.

ఇంతసేపటికి దొరికిందిరా అవకాశం అనుకొని "ఏం? ఆమె విరహవేదనతో కృంగి కృశించిపోతోందనుకుంటున్నావా? అదంతా ఏమీలేదు. హాయిగా వుంది. ఆనందంగా వుంది" అనేశాను. మోహనరావు పగలబడి నవ్వి "అంతకోపం వస్తుందేమిట్రా నీకు? ఒకవేళ ఆమె విరహవేదనా దోదూయమాన మానసయై బాధపడుతుంటే పూర్వ మెప్పుడో ఒక యక్షుడు మేఘంతో చెప్పిపంపినట్టు నేను నీద్వారా మీ అక్కయ్యకు పంపించాలనుకుంటున్నాను ఒక సందేశం" అన్నాడు. "నీ సందేశాలు, గింజేశాలు అనవసరం. ఆమె రేపో ఎల్లుండో పుట్టింటికి వెళ్లిపోవా లనుకుంటున్నది" అన్నాను. "అలా అనుకుంటున్నదని నీకేలా తెలుసు?" అన్నా డతడు. "ఆమే నాతో అన్నది" అన్నాను. "అంటుంది గానీ వెళ్ళదు" అని మళ్ళీ షో ప్రారంభం కావడంచేత మోహనరావు విస నడిచిపోయాడు థియేటర్ వైపు.

నిమా చూస్తున్నానుగానీ ఈసారి నాకు లు కూడా వినపడ్డంలేదు. 'అంటుంది కానీ వెళ్ళదు' అన్న మోహనరావు మాటే నా చెవుల్లో మార్మ్రోగుతోంది. మేరువు తలక్రిందైనా తనమాటకు తిరుగులేనంత ధీమా వున్నదా మాటలో. తాను పంపకపోయినట్టయితే - తన భార్య పుట్టింటికైనా పోలేని అసమర్థురాలని ఈ పెద్దమనిషి ఉద్దేశం? సినిమా ఐపోగానే అతడు బుద్ధి తెచ్చుకొని నాతో కూడా ఇంటికివస్తే సరేసరి, లేకుంటే ఏలాగైనాసరే సుందరమ్మక్కను పుట్టింటికి పంపేయాలని నేను దృఢ నిశ్చయం చేసుకున్నాను.

ఆరాత్రి నాతల్లో రైళ్ళు పరుగెత్తినాయి. సుందరమ్మక్క తాను పుట్టింటికి వెళ్లిపోదలచుకున్నట్టు నాతో చెప్పలేదనుకోండి. అది నేను స్వయంగా కల్పించి చెప్పిన మాటే. ఐతేమాత్రం? తానుభార్య మీద చూపుతున్న నిరాదరణకు కినుక వహించి ఆమె పుట్టింటికి వెళ్లిపోబోతుందని తెలిసినప్పుడు, ఇసుమంత గాబరా ఐనా పడకపోవడం అలావుండగా, షో ఐపోయేంతవరకూ హాల్లోకూచుంటే తరువాత నన్ను వదిలించుకోవడం తనతరం కాదనుకొని షో జరుగుతూండగానే పలాయనం చిత్తగించిన మోహనరావును ఏంచేస్తే తీరుతుంది? తర తరాలుగా పురుషుడు స్త్రీపైన చూపుతున్న నిరాదరణకు, నిర్లక్ష్యానికి ఈ మోహనరావు చెయిదం ప్రత్యక్ష నిదర్శనం కాదా? ఇతనికి ఒక గుణపాఠం నేర్పాలి, నేర్పి తీరాలి అని నా అంతరాత్మ ఘోషించింది.

మరునాడు భళ్ళున తెల్లవారకముందే పక్కింటికి వెళ్ళాను. సుందరమ్మక్క హాల్లో స్తంభానికానుకొని అవనతముఖియై కూచొనివుంది. ఆమెను చూస్తుంటే అశోకవృక్షంక్రింద సీతాదేవిని చూచినట్టుంది! ఖయస్‌ను వదలిపోతున్న లైలాను చూచినట్టుంది! నన్ను చూడగానే ఆమె నాకోసమే ఎదురుచూస్తున్నదానిలా 'రా తమ్ముడూ! కూచో,' అన్నది. నేను ఈజీచేర్ పై కూచుంటూ "నిన్న ఆఫీసుకు వెళ్ళావనక్కయ్యా!" అన్నాను. గొంతుక

★ మా సుందరమ్మక్క ★

తడబడుతుండగా “పిలుచుక రాలేక వుండి వుంటే పిలవడమే కొదక్కయ్యా పోయావా” అన్నదామె. “అతడక్కడ బరబరా ఈడ్చుకొనివచ్చి నీముందరతోసి వుండేవాణ్ణి! ఆఫీసుకు ఒక నెల సెలవు పెట్టేశాట్ట! ఎంతో వాకబు చేశానుగానీ అతడెక్కడికి వెళ్ళాడో తెలియ లేదు” అన్నాను. ఈ వార్తను వినగానే ఆమె

(65-వ పేజీ చూడండి)

పత్రత

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

9

జమీందారు భార్య పార్వతమ్మ. ఆమె ఆదరణకు శాంతమ్మ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

శాంతమ్మనీ - రవినీ - స్నానాలు చేయించిన తర్వాత విలువైన కొత్తబట్టలు శాంతమ్మచేతులో పెట్టింది.

"ఎందుకండీ" శాంతమ్మ జంకుతూ అడిగింది.

పార్వతి మెల్లగా నవ్వింది "నువ్వాకోక కట్టుకొని, అబ్బాయికా బట్టలు తొడుగు"

శాంతమ్మ తిరిగి ఏలాంటి సమాధాన మిస్తే, ఆమెకు తృప్తిగా ఉంటుందో ఆలోచిస్తుంది. తిరిగి శాంతమ్మ తలెత్తేలోగానే పార్వతమ్మ అక్కణ్ణించి వెళ్లిపోయింది.

శాంతమ్మ వెంకమ్మను ఈ సమయంలో హృదయానందంతో తలచకుండా ఉండ లేకపోయింది. ఆనాడు తనకు ఆమెయిచ్చిన [illegible] బాధాపూరితమైందీ, భయంకరమైం[illegible] తోచింది. అయితే ఈనాడు జమీం దారు యింట్లో పొందే ఆదరణద్వారా, ఆమె సలహా ఎంతో అమూల్యమైందిగా భావించింది. ఎంతకాలం ఈ సంతోషం సుస్థిరంగా నిలచిపోయి ఉంటుందోమాత్రం ఆమె అంచనా వేయలేకపోయింది.

అందమైన సోఫాలతో నిండిన ఒక విశాలమైన గదిలోకి రవినీ శాంతమ్మనూ దాసీ సుబ్బులు తీసుకవచ్చింది.

ఎదురుగా సోఫాలో పార్వతమ్మ కూర్చొని ఉంది.

"అలా కూర్చోమ్మా" అని అంది.

శాంతమ్మ ఒక సోఫాలో కూర్చొని రవిని ప్రక్కగా కూర్చొబెట్టుకుంది. ఎదురుగా టేబిల్ మీద ఫలహారాలతో నిండిన పళ్ళాలు చూసినరవి, తల్లికేసి చూసి, వేలు పెట్టి వాటికేసి చూపాడు. శాంతమ్మ తప్పని వారించింది.

పార్వతమ్మ నవ్వింది. "మీ కోసమే తీసుకోండి" అని లేచి గదిలోనుంచి వెళ్లి పోయింది.

సుబ్బులు కాఫీ తీసుకవచ్చింది. శాంతమ్మ రవి ఫలహారాలు తీసుకుంటూ దాసీకేసి చూశారు.

"వారికి చుట్టాలామీరు" దాసీది అడిగింది.

"అవును" శాంతమ్మ సమాధానమిచ్చింది.

"ఎవరో అనుకున్నాను...ఏమనుకో వద్దమ్మా-" అంటూ భయంగా వెర్రిగా చూస్తూ ప్రాధేయపడింది.

శాంతమ్మ నవ్వింది. ఈలాంటి నవ్వు భర్త ఉండగా పూర్వం నవ్వేది. నవ్విన తర్వాత తనే ఆశ్చర్యపడింది. దాసీది, వెళ్లి పోయింది.

రాత్రి సమయాన కారు మేఘాలతో నిండి లోకాన్నంతా మరీచీకటి మయం చేసిన గగనంలో మెరిసిన మెరుపు ఎదుట గోయి ఉందేమోనని భయపడుతూ నడుస్తున్న పాంధునికి తాత్కాలికంగా దారి చూపడంతో అతను పొందే ఆనందం - శాంతమ్మ నవ్వులో స్ఫురించింది.

కాఫీలు పూర్తయిన తర్వాత "దాసీ వచ్చి" అయ్యగారొస్తున్నారు" అని కప్పులూ సాసర్లూ తీసే ప్రయత్నంలో ఉంది.

శాంతమ్మలేచి నిలబడింది. గంగాధరం వచ్చి "కూర్చోండి ఫరవాలేదు" అని తానొక సోఫామీద కూర్చున్నాడు.

దాసీ సామానులు తీసుకవెళ్లిపోయింది. శాంతమ్మ కూర్చోడానికి సంశయిస్తుంది.

"కూర్చోవే" రవి కూడా అన్నాడు. గంగాధరం నవ్వాడు. "మీకన్నా పిల్లలే తెలివైవాళ్లు" అని కూడా అన్నాడు.

ఆలాఅనడంలో తన తెలివిలేమిని వేలెత్తి చూపినందుకు శాంతమ్మ చింతించలేదు. బిడ్డలు తెలివైనవాళ్లు కావడమే తల్లికోరికేమో; మొగంలో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రవిని చూసింది.

"సరే మీరు సోఫామీద కూర్చోడానికి సంశయిస్తే క్రిందయినా కూర్చోవచ్చు"

కట్టుబాట్లతో పెరిగిన హిందూ స్త్రీ గౌరవ వంతులయిన పెద్దవాళ్ల ఎదురుగా సమాన స్థానంలో కూర్చోడానికి తప్పక వ్యతిరేకిస్తుందని తెలిసిన గంగాధరం ఆరెండో సూచన యివ్వడం మంచిపనే అయింది.

శాంతమ్మ మెల్లగా జంకానా మీద కూర్చుంది. "మీరసలు ఎందుకొచ్చినట్లు.?"

శాంతమ్మ ఈ మాట విని స్తంభించి పోయింది. తరువాత సిగ్గుతో తలవంచుకుంది.

గంగాధరం వేసిన ప్రశ్న తీవ్రంగా గాని కఠినంగా గాని ధ్వనించలేదు. కాని దాని భావం ఉదాసీనంగా అవమానకరంగా మాత్రం శాంతమ్మను స్ఫురించింది.

శాంతమ్మ మాట్లాడలేదు సరికదా తల పైకెత్తి కూడా చూడలేదు.

గంగాధరం ఆమెకేసి క్షణం చూసిన మీదట "ఈ ప్రశ్న మీకు బాధకలిగించవచ్చు - కాని మిమ్మల్ని బాధించాలని నా ఉద్దేశం కాదు. మరి మీరు వచ్చిన కారణాన్ని తెలుసుకోవడం నాకవసరమేగా" అన్నాడు.

శాంతమ్మ మెల్లగా తల పైకెత్తింది

"మారాముని చూసి వెళదామని..." అంది. గంగాధరం నవ్వాడు. ఈ నవ్వులో కనీ కనిపించని బాధ ఉన్నట్లుగా శాంతమ్మకు వినిపించింది.

"మీరు చూడలేదూ ?"

"శాంతమ్మ అట్లాగునే చూస్తూంది. సమాధాన మీయలేదు.

"కారులో ఎక్కేముందు చూసినట్టున్నారు"

"అవును..."

"మరి చూశారుగా"

ఈసమాధానం శాంతమ్మకు చాలా క్షోభ కల్గించింది. గంగాధరం జేబులో చుట్ట తీసికొని, అగ్గిపుల్లగీసి చుట్ట కాల్చిన తర్వాత, ఆరిపోతూఉన్న అగ్గిపుల్లకేసిచూస్తూ "తల్లి

★ దత్తత ★

ప్రేమ" అన్నాడు. శాంతమ్మ అతని కేసి చూసింది.

"కాదనను...కాని తల్లి ప్రేమకన్నా పెంచిన ప్రేమ హెచ్చని ఈ మూడేళ్ళ అనుభవం చెబుతుంది...శాంతమ్మగారూ! మీకు మరొక అబ్బాయి ఉన్నాడు, మాకసలు సంతానంలేకనే కదా మీ అబ్బాయిని తీసుకున్నది..." మాట్లాడుతునే సోఫామీదనుంచి లేచాడు "భగవంతుడు మనుషుల మనస్సులు ఏలాంటి విచిత్రపదార్థంతో సృష్టిస్తాడో అర్థంకాదు...ఒకర్ని ఒకరు తెలుసుకున్నామని అనుకోడంకూడా

చాలా పొరపాటనిపిస్తుంది. పైగా తన మనస్సును తనే తెలుసుకోలేని దౌర్బల్య మానవుడు పరుల మనస్సులను గుర్తించానని విర్రవీగడం పొరపాటు"

"ఏమిటో మీరనేది" విస్మయ స్వరంతో, అతని భావం అర్థంగాక శాంతమ్మ ఆందోళనగా అడిగింది. ఈసారి గంగాధరం శాంతమ్మకేసి చూచాడు. అతని గంభీర ముఖమండలంపై ఏదో పశ్చాత్తాపవీచిక అటూయిటూ సంశయాస్పదంగా సంచారం చేస్తూంది.

"మీ గురించే కాదు...నా గురించే నేనే అనుకుంటున్నా" మళ్ళీ సోఫామీద కూర్చొని, ఎదుటికివంగి శాంతమ్మ మొగంలోకి చూస్తూ "ఈ మూడు సంవత్సరాలుగా బిడ్డను చూడ్డానికి మీరు రాకపోవడంవల్ల మిమ్మలను నామనస్సు శుభాకాంక్షగల మాతృహృదయంగా అభినందించుకుంది. కాని..." ఇక మాట్లాడలేదు. మళ్లీ యథాప్రకారం కూర్చున్నాడు.

"అలా కోరడం తప్పా?" మనోవ్యథను వ్యక్తంచేసిందా ధ్వని.

"మీరు మరొకటి ఏదీ కోరినా నేను యింత బాధపడను..."

"మాస్తే—"

"గుర్తిస్తాడు" ఆలోచనగా లేచాడు మళ్లీ యిలా అన్నాడు "బహుశా గుర్తించకపోవచ్చు...మీరు తల్లని నేను చెప్పచ్చు...అంతమాత్రాన్న మీకువచ్చిన లాభం?" ఆమె మొగంకేసి తీవ్రంగా చూస్తూ ప్రశ్నించాడు "ఇందువల్ల వచ్చిన నష్టమేమిటో నాకర్థం కావడంలేదు" ఈలాంటి ప్రశ్న శాంతమ్మ వేస్తుందని గంగాధరం ఊహించలేదు. అతని మొగం కొంత ఎర్రబడింది. కాని వెంటనే నిగ్రహించుకున్నాడు. బాధగా నవ్వాడు.

"నష్టం యిదని నేను వేలుపెట్టి మీకు చూపకపోయినా చాలా నష్టముందని నాకు తెలుసు...నిజంగా మీరు వాడికి కన్న తల్లి అయితే; ఈ సమయంలో ఈలాంటి కోరిక కోరడం సబబుకాదని గట్టిగా ఆలోచిస్తే మీకే తెలుస్తుంది. తల్లిబిడ్డను గురించి ఏం కోరుతుంది" కొన్నేపు సమాధానం వస్తుందని చూశాడు. నిశ్శబ్దమే శరణ్యమైంది. మళ్లీ ప్రారంభించాడు "బిడ్డ శ్రేయస్సు... రాముకి పట్టిన అదృష్టం ప్రపంచంలో ఎవరికి పడుతుంది...మీదగ్గరే రాము ఉంటే, తిండికికూడా బాధపడి, మురికిగుడ్డల్లో మూలుగుతూ, కటిక నేలలో పండుకొని..."

"బాబుగారూ!" శాంతమ్మ హృద్వేగంతో మాటలు పూర్తికాని క్రితమే బిగ్గరగా అరచింది. గంగాధరం ఆమె మొగం కేసిచూశాడు. ఆలోచించాడు. ఆమె కళ్ల వెంబడి నీళ్లు కారుతున్నాయి.

"ఏడుస్తారేం... ఏడవద్దు..."

ఆమె కళ్లు తుడుచుకుంది.

"శాంతమ్మగారూ! ఒక పనిచేస్తారా?"

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

"మీ అబ్బాయిని మీరు తీసుకవెళ్ళిపోగలరా"

ఈ మాటతో శాంతమ్మ నిశ్చేష్టురాలుగా అయిపోయింది. ఆశ్చర్యంగా అతని మొగం కేసిచూసింది. మెల్లగా లేచింది "నా చిన్న కోర్కెకు మీకింత బాధకలుగుతుందంటే; నేను అడిగేదాన్ని కాను... శలవివ్వండి" రవితో రెండడుగులు ఎదరకు వేసింది.

"ఆగండి" జమిందారు పిలచాడు.

శాంతమ్మ ఆగిపోయింది.

జమిందారు నవ్వాడు. ఆ నవ్వులో విజయగర్వం ఉంది. తాను మాటలు ద్వారా శాంతమ్మను ఒక స్థితికి తీసుకవచ్చి, ఆమె కోరిన కోర్కె ఆమెకు తప్పుగా తోచేటట్లు చేశాడు. తోచేటట్లు చేయడమే కాదు. ఆ నిర్ణయాన్నుంచి ఆమె బుద్ధిని మరలింపచేశాడు. మెల్లగా జేబులోనుంచి పర్సు తీసి—"శాంతమ్మగారూ" అని పిలచాడు.

ఆమె అలాగునే అతని కేసి చూస్తూంది.

"తెలివైన వాళ్లెప్పుడూ ధనాన్ని తిరస్కరించరు..."

పర్సులోనుంచి డబ్బుతీసి, కాగితాలు లెక్క పెడుతున్నాడు.

ఈ మాటలో అసత్యం లేదని, వెంకమ్మ పోయిన తర్వాత పరిపూర్తిగా గ్రహించింది. అందుకే శాంతమ్మ మాట్లాడలేదు.

"పదిహేను వందలు...తీసుకోండి"

శాంతమ్మ మాట్లాడకుండా తీసుకుంది. అంత సులభంగా తీసుకోవడం గంగాధరానికి ఆశ్చర్యం వేయక మానలేదు.

"వెళతాను"

"మరొక్క మాట"

శాంతమ్మ ఆగిపోయిచూస్తుంది.

"ఎక్కడికి వెళతారు"

ఈ ప్రశ్నకు శాంతమ్మ సమాధానం యివ్వలేకపోయింది. అసలు ఆమె ఒక చోటకు వెళ్లాలనే నిర్ణయంకూడా చేసుకోలేదు.

"సరే! మీ యిష్టంవచ్చిన చోటుకు వెళ్లండి...కాని రాము, మీ అబ్బాయిగా మాత్రం ఎక్కడా చెప్పద్దు"

ఆమె మాట్లాడలేదు.

"ఏమంటారు?" ఈసారి బిగ్గరగా అరచాడు.

"సరే" మెల్లగా సమాధానమిచ్చింది.

"ఇక వెళ్ళండి" అధికారపూర్వకంగానే ఆజ్ఞ యిచ్చాడు గంగాధరం. ఆమె ఆగది నుంచి కదలి రవితో బైటకు ప్రయాణమైంది.

10

గంగాధరం జమీందారు తండ్రి పేరను ఒక పాఠశాల కట్టించాడు. దానిలోనే రాము యిప్పుడు చదువుకొంటున్నది. ఆ పాఠశాలలో ధర్మయ్య అనే ఉపాధ్యాయుడు సాటి కులస్థుడు కావడంవల్లనూ, మంచివాడుగా పేరు పొందడంవల్లనూ ప్రధానోపాధ్యాయ పదవి నిచ్చి, స్కూలు వ్యవహారాలన్నీ అతనే చూసేటట్లుగా నిర్ణయించాడు గంగాధరం.

ఆరోజు ఉదయము పిల్లలకు ధర్మయ్య శ్రద్ధగా పాఠాలు చెప్పే సమయంలో, శాంతమ్మ రవిని నడిపించుకుంటూవచ్చింది.

ధర్మయ్య ప్రక్కగా మరో చిన్న కుర్చీ మీద కూర్చున్న రాముమీద ఆమె దృష్టి పడింది. రాముకూడా ఆమెకేసి చూస్తున్నాడు.

"ఎవరు మీరు" ధర్మయ్య అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. రాముకేసి అలాగునే చూస్తోంది. ఈ విచిత్ర వీక్షణకు అర్థమేమిటో ధర్మయ్య ఆలోచిస్తున్నాడు.

క్లాసులో ఉన్న పిల్లలంతా శాంతమ్మకేసి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మీ కిక్కడేం పని" మళ్ళీ ధర్మయ్య తీవ్రంగా అడిగాడు. శాంతమ్మ తేరుకుంది.

"మా అబ్బాయిని తమ స్కూల్లో చేర్పిద్దామని..."

ఆమె ఆ విధంగా ఆలోచించుకునే యిక్కడకు వచ్చింది. వచ్చినతర్వాత విషయాన్ని మరచి రాముని, ఆప్యాయంగా చూసింది. అలా చూడ్డం తన కెంత నష్టమో; గ్రహించినమీదట అటు చూడ్డం విరమించింది. రాము మాత్రం అలాగునే చాలాసేపు చూశాడు.

"మీ పేరు?" ఉపాధ్యాయుడు అడిగాడు.

"శాంతమ్మ, మా అబ్బాయి పేరు రవి."

వేసే రెండో ప్రశ్నకు కూడా ముందుగానే సమాధానమిచ్చింది.

"ఈ వూరేనా?" కాదేమోనని అనుమానంతోనే అడిగాడు ధర్మయ్య.

"ప్రస్తుతం యీవూరే"

"ఎక్కడుంటున్నారు?"

ఈమాటకూడా 'ప్రస్తుతం యిక్కడే ఉన్నాను.' అని సమాధానం యిచ్చేదేమో; కాని ఆ పదం ఈపిల్లలముందు ఎంత అపహాస్యానికి పాత్రమౌతుందో ఆమె గ్రహించింది. ఏమీ సమాధానం చెప్పలేదు.

ధర్మయ్య ప్రక్కగా పెట్టమీద



'మాతా శిశువులు'

శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మగారు జానపదరీతిలో చిత్రించిన రేఖాచిత్రం

కూర్చున్న లక్ష్మి ఆక్లాసులోఉన్న అందరి కన్నా చిన్నది. బహుశా నాలుగేళ్లు మించి వుండవు. ఇంత చిన్న వయస్సులోనే ఆబాల అంత శ్రద్ధగా స్కూల్లోకి రావడం శాంతమ్మకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

రవి ప్రక్క లక్ష్మి పెట్టెమీద కూర్చొని కాలుఊపింది. రవికి కోపంవచ్చి కాలు ఎత్తి 'తన్నుతా' అన్నాడు.

పిల్లలంతా గొల్లున నవ్వారు. రవి జడుస్తూ తల్లిని కౌగలించుకున్నాడు. మళ్లీ పిల్లలు నవ్వారు.

ఇంతవరకూ ధర్మయ్య శాంతమ్మకేసి రాముకేసి చూస్తూ పోలికలు గమనిస్తున్నాడు. రాము పెంపుడుబిడ్డగా ధర్మయ్యకు తెలుసు. కాని ఎవరి బిడ్డో మాత్రం గంగాధరం చెప్పలేదు.

"చూడు నాన్నా!" లక్ష్మి ఆలోచిస్తున్న ధర్మయ్యను చేయిపట్టుక లాగింది.

శాంతమ్మ ధర్మయ్య కూతురుగా వెంటనే గ్రహించింది. ధర్మయ్య కుర్చీలోనుంచి మెల్లగా లేచాడు. శాంతమ్మకేసి చూశాడు "అమ్మా! ఈ వీధి చివరనే మా యిల్లు. స్కూలు విడిచిన తర్వాత ఇంటికి వస్తాను. అక్కడుండండి...మంచిరోజు చూద్దాం. అప్పుడు మీ రవిని స్కూల్లో వేద్దురుగాని" అని సౌమ్యంగా పలికాడు.

"అలాగేనండి."

ఇక ఎవరికేసి చూడకుండానే, రవిని తీసుకొని స్కూలు వెలుపలకు వచ్చింది.

రాము ఒక్కమాట కూడా మాట్లాడలేదు. రాము మాట వినాలని శాంతమ్మ కోరిక. తాను చేసిన ఈ సాహసం జమీందారు దృష్టిలో క్షమించరానిదే కావచ్చు. కాని కడుపుతీపి కన్నవాళ్లకే తెలుస్తుందనే న్యాయంముందు జమీందారు యిచ్చే శిక్ష కూడా శాంతమ్మముందు తేలిపోయింది.

శాంతమ్మ స్కూల్లోనుంచి వెలుపలకు వచ్చింది. ఎదురుగాఉన్న మామిడిచెట్టు క్రింద, రాము ఎక్కివచ్చిన జమీందారు గారి కారు నిలిపిఉంది. కారుముందు డ్రైవరు కూర్చొని ఏమీతోచక నేలమీద పులీ మేకా గళ్ళు గీస్తున్నాడు.

గీట్లు గీస్తూన్న డ్రైవరు చప్పుడు విని క్రిందగా చూడ్డంలో శాంతమ్మ కాళ్ళు కనిపించాయి. తరువాత రవినీ శాంతమ్మను 'ఏంపని?' అనే భావంతో చూశాడు.

"ఈ కారూ..." శాంతమ్మ సంశయంగా అడిగింది.

"జమిందార్ గంగాధరంగారిది" క్లుప్తంగా సమాధానం చెప్పి మళ్ళీ తన పనిలో నిమగ్నుడయ్యాడు.

అతని ఉదాసీనమైన భంగిమ చూసి శాంతమ్మ మళ్ళీ ఏమీ మాట్లాడలేదు. వెళ్ళి మామిడిచెట్టుక్రింద కూర్చొని ఉంది.

డ్రైవరు మూడు పులులూ - పన్నెండు మేకలూ - రాళ్ళల్లో ఏరుకొని ఒక్కడే ఆట ప్రారంభించాడు.

శాంతమ్మ దగ్గర్నుంచి రవి మెల్లగా డ్రైవరుదగ్గరకు వెళ్ళాడు. పరధ్యాన్నంగా ఉన్న శాంతమ్మ రవి ప్రక్కనే ఉన్నాడనుకుంది.

డ్రైవరు పేర్చిన రాళ్లన్నీ రవి పాదాల తాకిడితో చెల్లాచెదరైపోయాయి. డ్రైవరు నిప్పులాంటి కళ్ళతో రవి కేసి చూశాడు. రవి నవ్వుతున్నాడు. డ్రైవరుకోపం మాయమైంది.

"పులీ మేకా ఆడతావా?"

"ఓ -" రవి చాలా ఉత్సాహంగా సమాధాన మిచ్చాడు. శాంతమ్మ అటు చూసింది. రవి డ్రైవరు ప్రక్కను కూర్చొని ఆటలో పడ్డాడు.

కాస్సేపటిలో రవి పుణ్యమా అంటూ, డ్రైవరు శ్రమించి గీచిన గీట్లుకూడా మాయమయ్యాయి.

డ్రైవరికి చాలా కోపం వచ్చింది. వెంటనే లేవదీసి "ఏవమ్మా నీ కొడుకుని జాగ్రత్త పెట్టుకో" అని బిగ్గరగా పిలచాడు. శాంతమ్మ తొందరగా వచ్చి రవిని తీసుకుంది.

"మా చినబాబు కూడా యిలాంటి వెధవ పని చేయడు" అన్నాడు చెరచిన గీట్లు చూపుతూ.

"చినబాబెవరూ?" అంది.

(54-వ పేజీ చూడండి)

మల్లి మీద మమకారం



రాత్రి భోజనంచేసి, 'బాబి' ని కడుపు మీద పడుకోబెట్టుకొని దొడ్డి వాకిట్లో వాల్చిన మడతమంచంమీద నడుం వాల్చాడు ప్రకాశం. 'బాబి' కడుపుమీద పడుకోకుండా లేచికూర్చుని ఆకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రాలవైపు వేలుతో చూపుతూ తండ్రి గడ్డం పైకెత్తి చూడమంటున్నట్టు సంజ్ఞలుచేస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్న ప్రకాశానికి 'బాబి' మూకభాషను అర్థంచేసికోగల సత్తా లేకపోయింది. అయినా, 'బాబి' మాత్రం తన అవ్యక్తానందాన్ననుభవిస్తూ, ప్రకాశాన్ని అందులో భాగం స్వీకరించమని ప్రోత్సహిస్తూనే ఉన్నాడు. మడతమంచానికి [illegible]రెడు దూరంలోఉన్న మల్లి పందిరిమీద [illegible]వ్వల సువాసన మత్తెక్కిస్తూన్నది. ఇది [illegible]ంలో ప్రకాశం ఆ పూలవాసన మత్తులో కన్నుమూసి హాయిగా నిద్రించేవాడు. ఇప్పుడు ఆ పూలవాసనే అతనికి తగలటం లేదు. అతని సౌఖ్యంకోసం శ్రీమతి ప్రమీల కొన్ని పువ్వులను కోయటమే మానేసేది. కోసిన వాటిలో కొన్నిటిని అతని ప్రక్కమీదనే విరజిమ్మేది. మల్లెలంటే మహా ప్రీతి ప్రకాశానికి.

ఒకనాడు కాలేజీనుంచి తిరిగి యింటికి వస్తున్నాడు. నెలరోజుల వ్యవధిలో రాబోయే పరీక్షలను గురించి ఆలోచించే అతని మనస్సు ఒక్కసారిగా ఏదో అనుభూతిని పొందింది. ఎదురుగా వెళ్లే ఒక అమ్మాయి తలలోని మల్లెలవాసన అతని ఆలోచనను అరికట్టి, మనస్సును, కన్నులను అటు త్రిప్పినది అతని ఘ్రాణేంద్రియం వేగంగా పనిచేయసాగింది. అలా అతను అజ్ఞాతంగా ఆమె వెనకాలే ఎంతోదూరం నడిచిపోయాడు. వాస్తవానికి అతను ఎటు నడుస్తున్నదీకూడా తెలీదు. ఆ అమ్మాయి తలలోని మల్లెలు అతని కన్నులను ఆకర్షిస్తే, ఆ మల్లెపూల పరిమళం అతని నాసికను త్రాడువేసి లాక్కుపోతున్నది. అలా నడిచి, నడిచి ఒకచోట ఆగిపోయాడు. అప్పటికతనికి స్మృతివచ్చింది. ఏమిటిది? అనుకున్నాడు. ఆ రోజు సాయంత్రం తన స్నేహితుడు చేయబోయే సంగీతకచేరీకి తప్పకుండా హాజరవుతానని యిచ్చిన వాగ్దానం అప్పుడు జ్ఞప్తికివచ్చింది. తటాలున వెనుదిరుగబోతుండగా ఆ అమ్మాయి పిలిచింది. ఆమె ఎవరో కాదు. తన క్లాస్‌మెట్. ఇంకా తన గ్రూప్‌దికూడా! ఆమెను అతను ఎరుగు; అతన్ని ఆమెకూడా ఎరుగును.

అయితే ఆ పరిచయం కాలేజీ గోడల మధ్యనే. అదికూడా చదువుకు సంబంధించినంతవరకే. అతనెప్పుడూ ఆమెవైపు కన్నులుంచేసి పిచ్చి, పిచ్చి ప్రసంగాలు చేయలేదు. నోట్సు పుస్తకాలిస్తూ ప్రేమగీతాలు వ్రాయలేదు. ఏదో జీవనదిలో కలిసికొట్టుకొనిపోయే రెండు కర్రలకున్న సంబంధం వారికి ఉన్నది. రెండు, మూడుసార్లు ఆమె ఆహ్వానించింది. అలాగేనని వెళ్ళటం మానేశాడు. ఈ రోజున ఆమె వెనకాలే తనకు తెలీకుండా వెళ్ళి గుమ్మంలో నిలబడిపోయాడు. ఈ సమయంలోకూడా ఆమె ఆహ్వానాన్ని కాదనటం సభ్యంగా తోచలేదు. తలయెత్తకుండానే మెట్లెక్కాడు. ఆమె లోపలకు తీసికెళ్ళి, తనగదిలో కుర్చీ చూపి, లోపలకు వెళ్ళి కాఫీ, బిస్కట్లు తీసికొనివచ్చి అతని కెదురుగాఉన్న స్టూల్ మీద ఉంచి తాను మరోకుర్చీ లాక్కుని కూర్చున్నది. ఇరువురూ ఆరగించారు. ఆ రోజున ఆమె ఏమేమో మాట్లాడింది. తను కొంతసేపు సంకోచించినా, తరువాయి ఆమెను అధిగమించి ప్రసంగించాడు. కొంతసేపటివరకూ చదువు, పరీక్షలు. ఆ తరువాయి సినిమాలు. ఆ తరువాయి ప్రపంచ విషయాలు. అంతే! అతను లేచాడు. అప్పుడప్పుడు వస్తూండమంది' అప్పుడు అతనన్నాడు.

"ఈ రోజున యిలా ఎందుకు వచ్చానో మీకు చెప్పటం అవసరం. ఇదివరలో మీరు ఎన్నిసార్లు పిలిచినా నేను అలాగే అంటూ, రావటం మానేసేవాణ్ణి. కాని ఈ రోజున మీ తలలోని మల్లెలు నన్ను మీ వెనకాలే నడిపించినై. మల్లెపువ్వులు నన్ను మత్తెక్కిస్తై"

అని నవ్వుతూ లేచాడు. అది మొదలు అతను అప్పుడప్పుడు ఆ యింటికి వెళ్ళేవాడు. ఒక్కోరోజు చాలా ప్రొద్దుపోయే వరకూ కూర్చునేవాడు. అతన్ని భోజనం చేయమంటానికి ఆమె సంకోచించేది. అతను సాహసించి అడగలేకపోయేవాడు. ఆఖరుకో రోజున ఆమె చెల్లెలు సాహసించి భోజనానికి లెమ్మంది. అతను సభ్యతకోసం కొంత అభ్యంతరంచెప్పినా ఆఖరుకు అంగీకరించాడు. అప్పట్నుంచీ మరి కాస్త సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పుడప్పుడు కొద్ది, కొద్దిగా వేళాకోళాలు పరీక్షలు ఆ సాన్నిహిత్యాన్ని మరీ దృఢం చేసినై. శకుంతల నాటకం చదువుతుంటే యిద్దరూ చెరోకపాత్రస్వీకరించేవారు 'ట్వెల్ నైట్' చదివేప్పుడూ అంతే. దీనికి తోడు ఆమె చెల్లెలు అప్పుడప్పుడు 'బావగారూ' అంటుండేది. అటువంటప్పుడు ఆమె సిగ్గుతో కన్నులరమోడ్చి తనవైపు జూచేది. అంతకంతకు ఆమె చెల్లెలే తమ బాంధవ్యాన్ని మరీ దగ్గర చేసేసింది. అతను 'నువ్వు—నువ్వు' అని ఏకవచన సంబోధనచేయటం, ఆమె మాత్రం 'మీరు' అనే పిలుస్తూండటం, ఇలాటివెన్నో జరిగిపోతున్నై. ఆ రోజుల్లో అతను కాని, ఆమె కాని వీటిని వేటినీ అంత ప్రధానమైనవిగా పరిగణించలేదు. కాని ఆ యింట్లో మాత్రం ఈ యిరువురి స్నేహాన్నిగురించి కొన్ని నిశ్చయాలు జరుగుతున్నై. ఒక్కోనాటి అతని ప్రవర్తన వాళ్ళ నిశ్చయాలన్నీ తలక్రిందులు

★ మల్లిమీద మమకారం ★

చేస్తే, మరోరోజున అతని సంభాషణ వాళ్ళ అభిప్రాయాలను ఘుట్టిపరచేది.

ఆమె వారానికొక్కసారి మాత్రమే మల్లెపువ్వులు పెట్టుకోవటం మొదలు పెట్టింది. కాని రోజూ ఆమె చెల్లెలు అలంకరించుకొనేది. ఒకే గదిలో ముగ్గురూ కూర్చొని చదివేవారు. ఆ మల్లెలు మత్తెక్కిస్తూన్నంతసేపు అతని దృష్టి మల్లెలమీద నుంచి మరలేదికాదు. పుస్తకంలోకి చూచేవాడే కాని ఆమె ఏం చదువుతున్నదీ తెలిసేదికాదు. ఆమె ఏదయినా అడిగితే 'ఔను'—'కాదు' అని అస్తవ్యస్తంగా జవాబిచ్చేవాడు. ఆఖరుకు అతని దృష్టి పుస్తకాల్లోకి మళ్ళటానికి కొంచెం శ్రమ తీసికోవాల్సివచ్చింది.

మల్లెలు ప్రతిరోజూ ముణుచుకోవద్దని చెల్లికి చెప్పింది. కాని ఆమె కొంచెం తిక్కది, మరి కొస్త పెంకిది, కావటంవల్ల వినిపించుకోలేదు. ఆఖరుకు చదువు గది మార్చేసింది. అయితే మల్లెల వాసన తగిలితేనే కైపెక్కుతాడు కాని, దానికోసం తహతహలాడడు. అక్కడికి ఏ తొమ్మిది గంటలకో చెల్లి ఒక్కసారి ఆ గదిలోకి వచ్చి రెండు నిమిషాలు ఘంకా ప్రక్క నిలబడి కైపెక్కించి వెళ్ళిపోయేది. ఒక రోజున అక్కా-చెల్లెలు ఆ విషయంలో అతను లేనప్పుడు ఘర్షణపడ్డారు కూడా. ఆఖరుకు తండ్రి కలగజేసికొని వారించాడు.

ఇలా మల్లెలతో ముక్కుకు త్రాడేసిన ఆమె చివరకు జీవితంలో అర్థాంగిఅయింది. అర్ధాంగి కావటానికి ముందు చాలా తతంగం జరిగింది. ఏమయితే నేం పర్యవసానం ప్రమోదమే అయింది.

ఈ మల్లెఅంటు ఆమె కాపురాని కొచ్చిన తొలి రోజుల్లో నాటింది. అప్పట్నుంచి దాన్ని ఎంతో శ్రద్ధతో పోషించింది. ఆకులు దూయటం, దూసిన ఆకులన్నీ మొదళ్లోపోసి నీరుపెట్టటం, పురుగు పట్టకుండా చూస్తూండటం ... ఇలాంటి వానితో ఆ పందిరి మరీలా వ్యాపించింది.

చైత్రం ప్రవేశిస్తుండగా అది గుమ్మన వాసనలీనేది. వసంతాగమనాన్ని మల్లె వాసనతోనే అతను గుర్తించేవాడు. ఆమల్లి పందిరివార ఆమెతో అతని జీవితం ఎన్నో అనుభూతులను పొందింది. ఆ మల్లి అతని చేత ఎన్నో కథలు, నాటికలు, వ్యాసాలు వ్రాయించింది. అదే మల్లి అతనికి వేసవి తాపం కలుగకుండా చేసేది. ఆ మల్లి దగ్గర నిలబడి ఉండగానే ఆమె పుట్టింటినుంచి 'బాబి'ని చంకనెట్టుకువచ్చి నవ్వుతూ నిలబడ్డది. అలా ఆ మల్లితో అతని కెంతో సంబంధం.

ఇంక రెండు రోజులు. ఆ రెండు రోజుల్లో యిల్లు అప్పులవాళ్ళ వశమై పోతుంది. ఇల్లు పోతే యింకో యిల్లు వస్తుంది. కాని మల్లి. మల్లిమాత్రం యింకోటి రాదూ! ఉహూం. తన జీవితంతో ఎంతో సన్నిహితంకలిగిన యీ మల్లి! నిజంగా మల్లి యిల్లాలులానే ఉంది! ఆమె తన జీవితంలో ప్రవేశించటానికి కారణభూతమయిన మల్లెలనుపుష్పించిన అంటుతొలూకు కొమ్మపాతిన ఈ మల్లి తన జీవితంనుండి వేరుకావటం అతనికి దుర్భరంగా ఉంది. మల్లిని మరచిపోవాలనుకున్నాడు. అందుకే బలవంతంగా ఆలోచనలోపడి మల్లి వాసనలను దరిజేరనీయటం లేదు.

అతనికి తెలీకుండానే అతని కన్నులు అర్ధనిమీలితమై, కనుగొలకులు నీటితో నిండినై. కంచాలు తోలిచి, వంటింటి పనులు పూర్తిచేసికొని వచ్చిన ప్రమీలాదేవి బిడ్డను భర్త కడుపుమీదనుంచి తీసికొని, చంకలోకి ఎత్తుకొని:

"మీరింకా ఆలోచిస్తూనే ఉన్నారు. ఏమిటో ఈ యిల్లు మనం సంపాయించాం కనకనా! మనదిగా ఉండిపోవటానికి. మీ నాన్నగారు చెమటోడ్చికట్టారు. ఆయన ఉన్నంతకాలం అనుభవించారు. మనం కూడా కొంతకాలం యిందులో జీవించాం. అంతే! దీనికీ, మనకూ రేపటితో ఋణానుబంధం తీరిపోతుంది. ఇప్పుడు మాత్రం ఏం పోదూ. సరోజిని యిల్లు మనకు పరాయిదా. ఇదివరకే అది దాని యింటికివచ్చి ఉండమంది. దానికి మాత్రం ఎవరున్నారు చెప్పండి. ఈ మూడేళ్ళ నుంచీ దాని చెల్లెలు మొగుడుకి ఇక్కడ ఉద్యోగం కనుక వాళ్ళిద్దరూ ఉన్నారు. నిన్ననే వాళ్ళు వెళ్ళిపోయారట మనం దానికి సాయంగా ఉంటే, అది మనకు పెద్ద దిక్కుగా ఉంటుంది" అంది, మంచంమీద బొట్ట సాఫుగా కూర్చుంటూ.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ యింటిమీద నాకేం మమకారం లేదు. కాని, ఈ మల్లి..."

అంటూన్నప్పు డతని గొంతు బొంగురు పోయింది.

"మీరు మరీ అయోమయమైపోతున్నారు. ఏమిటో! అనుదినం దాని రక్షణ చేసిన నేనే నిర్విచారంగా ఉంటే, ఇంక మీరు ఇదేమిటి చెప్పండి. అసలు పువ్వులన్నా, నగలన్నా ఆడదానికున్న మమత

"మీ అమ్మాయిని నేను పదిహేను ఏళ్లుగా ప్రేమిస్తున్నానండీ?"
"అయితే ఏమంటావు?"
"పెళ్ళి చేసుకొంటాను."
"ఓస్! ఇంతేనా! ఇంకా పెన్షన్ అడుగుతావేమో నని హడిలి పోయాను!"

మగవాళ్ళకుండనే ఉండదు. అయినా పరిస్థితులు ప్రతికూలించినప్పుడేం చేస్తాం. ఒక్క విషయం ఆలోచించండి. ఆరు కాసుల చంద్రహారం, రెండు కాసుల పతకం గొలుసు, ఆఖరుకు మంగళసూత్రాలత్రాడు, అదే అన్నమాటేమిటి? బాబి మొలకు రెండేళ్ళక్రితం ఎంతో కుతూహలంతో మీరు చేయిద్దామనుకుంటుంటే మా నాన్న తెచ్చిన మామిడిపిందెల బంగారు మొలత్రాడు, ఇవన్నీ మనకు అక్కర్లేనివేనా! కాని ఒక్కగుక్క దిగమ్రింగి జేబురుమాల్లో చుట్టబెట్టుకొని వెళ్ళి మనకు లేకుండా చేసికోలేదూ. ఇంక ఈ మల్లి... అదీకాక సరోజిని యింట్లో దీని తలదన్నే మల్లిపందిరిఉంది. అది దొంతరమల్లికూడా" అని అతనివైపు చూచింది.

"హూ! ప్రమీలా, ఏదో జరుగుతు నువ్వు నన్ను కట్టుకున్నావ్. నిజంగా వెంకటేశ్వరరావుని చేసికొనుంటే అతను కూడా మీ నాన్నలా తాసిల్దారు హోదాలో ఉండి మీ అమ్మకు జరిగే సౌఖ్యాలు నీకు జరిపేవాడు "అన్నాడు, చాలా దీనంగా.

"మీకు నన్ను కూడా ఏడిపించాలని ఉందా? ఇప్పుడేదో-తెలీక నగల విషయం ఎత్తానుగాని ఎప్పుడన్నా నేను వాటిని స్మరించానా? అదీకాక అవసరానికి ఉపయోగపడని బంగారం శరీరానికి బరువేకాని అలంకారమవుతుందా?"

అంటూ అతని నుదురుమీద చెయ్యివేసి, ముంగురులు నిమరసాగింది. పైట చెంగులో దూరి పాలుత్రాగే 'బాబి' గుర్రుకొట్టటం చూచి, మంచందిగి ప్రక్క మంచంమీద పండబెట్టి తిరిగి అతని వద్దకు వచ్చి:

"ఒక్కసారి దిగండి. ఈ రాత్రితో మనం ఈ మల్లిని మరిచిపోవాలి. రండి. మొత్తం పువ్వులన్నీ కోసిపారేసి ప్రక్కమీద జల్లుకుందాం. రేపట్నుంచి సరోజిని యింట్లో దొంతరమల్లి పాన్పు..." అని నవ్వింది. అతను లేస్తూ: "దొంతరమల్లి మల్లిని మరపిస్తుందా?" అనుకున్నాడు. ★

అలవాటు పోగొట్టిన ఉపాయం

శ్రీ ఓగేటి శివరామ కృష్ణ

శారదకు అంత సినీమా పిచ్చివున్నట్లుగా, నరసింహారావుకు ఆమె కాపురానికొచ్చేదాకా తెలియదు; ఉద్యోగంలో ప్రవేశించి కొత్త కాపురం, యేర్పాటుచేసుకొన్న తర్వాత తన వుద్దేశాన్ని ఆమె వేడలగ్రక్కడమే కాకుండా, విజృంభించింది కూడాను.

తాను పుట్టింటవున్నప్పుడు, ప్రతి సినీమా జూసేదాననంది. అదొక పెద్ద పట్టణం కాబట్టి, శారదా వాళ్ళ నాన్న చిన్న జమీందారంతటివాడవటంవల్లా, యితరత్రా యింటి పనులు వగైరా ఆమె జూసుకోవలసిన అవసరం లేకపోవటంవల్ల, కేవలం కాలక్షేపంకోసం — సినీమాకు — వచ్చే ప్రతీదానికీ వెళ్ళడంలో సబబున్నదనుకొన్నాడు నరసింహారావు.

కాని, కాపురానికి రావటంతోటే, శారద రెండు మాసాలకాలం తన మామగారి యింటనే వుంది. ఆరెండు మాసాలూ యేలా వుండకలిగిందో యేమోగాని, నరసింహారావు వుద్యోగమవటం, జాయినయి కాపరం పెట్టడం — ఇంతటితో అభివృద్ధి పొందింది.

మొదటి రోజుల్లో : ఏమండీ సినీమాకు తీసుకువెళ్ళరూ—నరసింహారావు యేమంటాడోననే భయంతో బెదురుజూపుల్తో అడిగింది.

కొండమీద కోతిని దించటంకాదు గదా అని తాను 'సరే' నన్నాడు. 'ఆ సరే' ఒకటి రెండు మార్లతో వదల్లేదు. కాపురానికొచ్చిన రెండు మాసాల్లోనూ పద్దెనిమిది మార్లకు తక్కువకాకుండా జరిగింది.

గుమస్తా వుద్యోగంలో ప్రవేశించి నెలకు అరవైయేడు రూపాయలజీతంతో అఘోరించే నరసింహారావుకు సినీమాకు దంపతీయుక్తంగా వెళ్ళటం, వెళ్ళినప్పుడల్లా రెండు రూపాయలు 'స్వాహా' అవడం బాధగానేవుంది. అయితే యింటివద్దనుంచి కొత్తదంపతులేలా అఘోరిస్తున్నారో అనే వుద్దేశంతో ఏభైరూపాయలు ప్రతీ నెలా వస్తూండటంవల్ల, అదో పెద్ద యిబ్బందిగా కన్పించలేదు.

శారదకు మాత్రం, రోజుమీద రోజు వస్తున్న కొద్దీ పిచ్చి యెక్కువయింది. అది యేవిధమైన పరిస్థితికి దారితీస్తుందోనన్న భయం నరసింహారావుకు కల్గింది.

అందుకని, ఆమె వొకప్పుడు—కోరటంతోటే సుముఖత్వం, యెప్పటి విధంగా ప్రదర్శించకుండా—నరసింహారావు అడ్డుపలికాడు.

ఆలా ప్రతీ సినీమాకు వెళ్ళడం—గౌరవ కుటుంబాల్లో బ్రతికే మనబోటి వాళ్లకు మంచిది కాదన్నాడు.

అంతే—బొటబొట కన్నీళ్లు కారి నేల పడ్డాయి. నరసింహారావుకు సహితం కళ్ళ నీళ్ళు వచ్చాయి. అతడి హృదయం, ప్రేమతోను, అభిమానంతోను, జాలితోనూ నిండిపోయింది :

'పిచ్చిదానా! నీ యిష్టప్రకారమే వెడదామే!'—అని తగ్గిపోయాడు...

శారద...కోరికకు మరి ఆటంకంలేకపోయింది! ఎటువంటి లోటుపాట్లూ గృహకృత్యాల్లో జూపకుండా నరసింహారావుకానందం కల్గించేది; సాయంకాలం అయిదు గంటలవటం, తర్వాయిగా, చక్కగా అలంకరించుకొని తెల్లచీరతో, తల్లోపువ్వులతో, గుమ్మంలో నిలబడి, నరసింహారావుకోసం యెదురుజూసేది...ఆ వేళ గనక, తెరమీద బొమ్మ మారినట్లయితే, నరసింహారావు ఖర్మకాలి, పెందరాళే యింటికి వచ్చినట్లయితే:—'ఏమండీ ఈవేళ సినీమా మారింది! చాలా బాగుంటుంది' అని యెదురు సన్నాహం చేసేది.

ఉస్సురనుకొంటూ 'సరే'—అనే వాడు నరసింహారావు...ఒకవేళ అనుకొన్నట్లుగా భర్త వేళకు రానట్లయితే—చాలా దూరం వూహించేది:—'నన్ను సినీమాకు తీసుకెళ్ళటం యిష్టంలేక ఈ విధంగా ఆలస్యంగా వచ్చారు'—అని కళ్ళనీళ్ళు పెట్టుకొనేది!

ఆమె అన్న మాటలో సత్యం వుండటంవల్ల నరసింహారావు యెదురు జవాబు చెప్పలేకపోయేవాడు; కాని 'పోనీ రేపు వెడదాం!'—అని వూరడింపచేసేవాడు!

నరసింహారావు కిష్టంలేకపోయినా, ఆరేపు వెళ్ళటం తప్పని సరి అయ్యేది!

నరసింహారావుకు భార్యమీద సంపూర్ణమైన జాలి యెప్పుడూవుండేది; అందరి భార్యల్లాగ, తన భార్య వేషభాషలకు సరుకులు కావాలనిగాని, చిరుతిండి సామాను తెచ్చిపెట్టమని, నగలు చేయించి పెట్టమని కోరదు! పాపం అదెప్పుడూ కోరేది—సినీమాలు...నరసింహారావుకు సినీమాలకు వెళ్ళటంవల్ల డబ్బు ఖర్చు అన్యధా అవుతున్నందుకు ప్రారంభంలో బాధపడినా, తర్వాత ఆబాధ నెమ్మదిగా తగ్గింది. దానికి బదులుగా ప్రవేశించిన బాధ—ఆరోగ్యభంగం దంపతులకు కలుగుతుందేమో నన్న భయం!

క్రమంగా నెలకు పదిహేను మార్లదాకా—సినీమాకు వెళ్ళటం జరుగుతోంది...నరసింహారావుకు విసుగు జనించింది...ఆరోగ్యం పాడవుతోందేమోనన్న భయంగూడా అతని కంకురించింది...అందువల్ల యెవరి కర్మకు వాళ్లే కర్తలనే

★ అలవాటుపోగొట్టిన మందు ★

తలంపుతో భార్య సినీమాలకు వెళ్ళినా, తాను స్వస్తివాచకం పలుకుదామనుకొన్నాడు.

ఆమె కోరటం తడవుగా! 'ఊఁ వెళ్లు'—అన్నాడొకమారు

'మరి మీరు'—

'నే రాను'—

'అయితే నే వెళ్ళటం మీకిష్టంలేదన్నమాట!'

'వెళ్ళమన్నానుగా!'

'నేవెళ్ళటం మానను; మీరు రాకపోతే నేవెళ్ళను'—

అమాయకంగా నరసింహారావు కళ్ళల్లోకి జూసింది శారద!

నరసింహారావుకి నవ్వువచ్చింది! నవ్వాడతను!

శారద కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి. 'పోనీలెండి!'

తిరిగి నరసింహారావు లొంగిపోయాడు; అతడి యీ ప్రయత్నంగూడా ఫేలయింది...

రోజులు గడుస్తున్నాయల్లాగే.

నరసింహారావు కిదొక పెద్ద సమస్యాయి కూర్చుంది. శారద మనస్సు బాధపడితే తన మనస్సు బాధపడుతుంది; ఆమె ఆనందంగా వుంటే తనకానందం కల్గుతుంది... ఆడదానికి లొంగిపోయిన మగవాడయ్యాడు తను; నయానగాని భయానగాని చెప్పి, శారద దృష్టిని, సినీమాలకు వెళ్ళటంనుంచి మళ్ళించటం దుర్లభం. మరి మార్గం...

కొత్తగా మాష్టరీ వుద్యోగంలో ప్రవేశించిన స్నేహితుడు, నరసింహారావుకు తారసిల్లి, సంగతులు తెలుసుకు సలహాయిచ్చాడు...అతిగా యేపనైనా చేస్తే... దానిమీద విసుగుదల తప్పక యేర్పడుతుందని—దాన్ని సైకాలజీ అంటారనీ.

'అంటే'—విడమర్చి అడిగాడు నరసింహారావు...

'అంటె—నీకు గారెలు తినాలనే కోర్కె వున్నదనుకో! ఒకటి, రెండు చూసి, జూసి తింటె నీకోర్కె యింకా పెరుగుతూనే వుంటుంది; గారెలమీద ఆపేక్ష హెచ్చుతూనే వుంటుంది. అలా కాకుండా... ఒక గార్లెపళ్లెం దగ్గరవుంచుక, డోకువచ్చే పర్యంతం తిన్నపక్షంలో, వాటిమీద ద్వేషం కల్గటమేకాకుండా...మరి బ్రతికి వుంటెగా వాటిమీద అభిరుచి జూపించవ్!'—అని విడమర్చి చెప్పాడు పంతులు స్నేహితుడు నిష్క్రమిస్తూ.

'భేష్'—అన్నాడు నరసింహారావు—

*　　　*　　　*

పంతులు స్నేహితుడిచ్చిన సలహాను ఆచరణలో పెట్టటంకోసం, నరసింహారావు భార్యకంటే తానే ముందుగా సినీమాకు బయలు దేరటం మొదలెట్టాడు.

శారద లోగుట్టు గ్రహించలేదు గాని—భర్త తనకంటె ముందు పరుగెడుతున్నందుకు యెంతో ఆనందించింది!

మొదటి ఆట సినీమాకంటె, రెండో ఆట సినీమాకు వెళ్ళటం మూలకంగా ఫలితం, త్వరగా కన్పిస్తుందనుకొన్నాడు పిచ్చి నరసింహారావు...

అలా ఒక వారంరోజులు క్రమం తప్పకుండా వెళ్లేసరికి, నరసింహారావు ఆరోగ్యపరిస్థితులు తారుమారయ్యాయి...రాత్రి రెండో ఆట సినీమా మూలకంగా, బద్ధకంవల్ల ఆఫీసు వ్యవహారాలో ఆలస్యం జరుగుతూండటం,అధికార్ల ఆగ్రహానికి గురవటంగూడా జరిగింది...

పాపం నరసింహారావు పరిస్థితి అలా తయారైంది! శారదకేం—మహారాణీలాగ—నరసింహారావు ఆఫీసుకు బయలుదేరటం తర్వాయిగా, యిదివరకుచేసే పెత్తనాలు తగ్గించుకొని, గుట్టుపెట్టి, నాలుగున్నర, సాయంకాలం అయేదాకా నిద్రపోతూంది; బద్ధకంగూడా అందువల్ల ఆమెలో కన్పించటంలేదు; సొమ్ముపోవటం,ఆరోగ్యంపాడవటం పైగాపై ఆఫీసర్ల చివాట్లు తినటం,భార్యకు లొంగిపోవటంవల్ల నరసింహారావు వంతయ్యాయి!

మాష్టరు స్నేహితుడి సలహాగూడా ఫేలవటంతో, నరసింహారావుబుర్ర దిమ్మెక్కింది; ఆఫీసరు ఆగ్రహానికి, అనుగ్రహం సంపాదించిన తోటి గుమస్తా విశ్వనాథం, నరసింహారావు కథంతా విని నవ్వుతూ: 'మరి సినీమాకు బయల్దేరటానికి వీల్లేదని కూక లెయ్యలేవూ?'—అడిగాడు!

'నీకేం తెలుస్తుంది మిత్రమా! అది కళ్ళనీళ్ళు పెట్టుకొంటూంటే అంతకు ముందెంత కర్కశంగావున్నా నా హృదయం, కరిగిపోతుంది... ఇంకేంచేసేది...' అన్నాడు నరసింహారావు 'సరే—అయితే నే చెప్పినట్లు చెయ్యి—నేనెరిగిన డాక్టరొకాయన వున్నాడు; రెండు రోజులు ఆఫీసుకుగూడా...సెలవుపడెయ్యి'—అని చెవిలో యేమో చెప్పాడు మిత్రుడు విశ్వనాథం...

'సరే అలాగే!'—అన్నాడు నరసింహారావు...

*   *   *

ఆ సాయంకాలం, కళ్ళు మంటలంటూ యింటికి వచ్చాడు నరసింహారావు; శారద తెల్లబోయింది; ప్రక్కింటినుంచి, చనుబాలు తెచ్చి... యేమేమో పాపం అమాయకంగా... చికిత్సలు చేసింది.

కాని మర్నాటి ప్రొద్దుట, నరసింహారావు ఆఫీసుకు సెలవుచీటి రెండు రోజులకు పంపటంతో ఖంగారు పడిపోయింది... శారద!

'ఏమండీ ఏమిటండీ ...' — అమాయకంగా అడిగింది శారద!

'కళ్ళు మంటలు!—సరిగా యేమీ కన్పట్టంలేదు...'

'మనవాళ్ళకు కబురుచేద్దాం—నాకేదో భయంగావుంది!'—అంది శారద!

'ఏం భయంలేదు. అదే తగ్గుతుంది! వేడివల్ల'—నన్నాడు...నరసింహారావు...

'ఇంతలో విశ్వనాథం వస్తూ:' ఏమోయ్! ఏమిటని' అడిగాడు — శారద, గుమ్మం పక్కగా వెళ్ళి నిల్చుంది.

'కళ్ళు మంటలు ... ఏమీ కన్పట్టం లేదు!'

'అయిందీ! నే అనుకొంటూనే వున్నా! గుమస్తావుద్యోగం చేస్తూ, ఒకమూల చస్తూంటే, ప్రతీ నిత్యం సినిమాలేమిటి? ఈలా సినీమాలు చూస్తే కళ్ళుగూడా పోవచ్చు...' అంటూ గుమ్మంవయిపు చూశాడు విశ్వనాథం!

'అమ్మో కళ్ళే!'—శారద హటాత్తుగా అంది!

'భయంలేదు ... డాక్టర్ని తీసుకువస్తానంటూ ...' విశ్వనాథం బయటకు వెళ్ళాడు!

'మాయదారి సినీమా లింతపని చేస్తాయనుకోలేదు!'—అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది శారద!

'ఏడవకు! ఏం భయంలేదులే!'—అన్నాడు నవ్వు నాపుకొంటూ నరసింహారావు...

డాక్టరు వచ్చాడు...ఏమిటో పరీక్ష చేసి 'ఇంక యీలా సినీమాలకు వెళ్ళేపక్షంలో కళ్ళుపోవటం ఖాయం ... దానికి, నెలకొకటి రెండుమార్లని హద్దుండాలి! ఆయనకంత సినీమా పిచ్చివున్నా, మీ రాయన్ని వెళ్ళనివ్వకుండా చెయ్యాలి తెలిసిందా!' —అన్నాడు శారదవైపు చూసి డాక్టరు!

'అలాగేనండి! మరి సినీమాకు వెళ్ళనివ్వను!'—అంది బిక్కమొఖం పెట్టి శారద!

'పదిహేను రోజుల కొకమారు వెళ్ళినా తంటాలేదు...' కాని యీలా వెళ్ళటంవల్ల ...ప్రమాదంతప్పదు... మరేం భయంలేదులెండి!'—అన్నాడు డాక్టరు, నరసింహారావు కంట్లో యేదో మందు వేస్తూ...

'మందు... వ ...' — నరసింహారావు యేమో అనబోతూంటే, విశ్వనాథం ... 'భయంలేదు ... నీళ్ళు లాగ చల్లగా వుంటుంది!'— కన్ను మూసుకు పోయించుకు పక్కకు వత్తిగిలు చల్లాగావుంటుంది ...అన్నాడు...

నరసింహారావు అలా చేశాడు...

'చల్లగా వుందికాదూ?' విశ్వనాథం ప్రశ్నించాడు.

'ఊ...'—అన్నాడు నరసింహారావు.

'ఈమందు చాలుగా డాక్టరుగారూ'

'ఊ ...ప్రస్తుతానికేం భయంలేదు... మరి సినిమాల కాలా వెళ్ళేమాత్రం, కళ్ళుపోవటం ఖాయం. పోయిన కళ్ళు మళ్ళీరావు' — అన్నాడు డాక్టరు నవ్వుతూ!

శారద గుమ్మందగ్గర నిల్చుండి, చేతులు నలుపుకొంది...

నవ్వుతూ వస్తానంటూ, డాక్టరు వెళ్ళిపోయాడు...

'మళ్ళీ సినీమాకు బయలుదేరు'—అంటూ నీళ్ళమల్లేవుండే మందుసీసా అక్కడుంచి, ఆఫీసుకెళ్ళాడు విశ్వనాథం...

'ఇప్పుడు కళ్ళుచల్లగా వున్నాయి!'—అంటూ శారదవైపు చూశాడు నరసింహారావు.

'పోనీ లెండి బాబూ!'—అంది యేదో బరువుతగ్గినట్లుగా శారద!...వీధిలో డప్పుల శబ్దం వినిపించింది!

'ఈవేళ కొత్త సినీమా అనుకొంటాను!' —అన్నాడు నరసింహారావు...

'మరి సినీమా పేరు యెత్తితే దవడవాయిస్తాను!'—అంది మృదువుగా శారద!

'మరి నువ్వు యెత్తితేనో?'—అన్నాడు నరసింహారావు...

'బుగ్గ కరిచేద్దురుగాని'—అంది శారద!

రోజులు గడుస్తున్నాయ్. నరసింహారావు హాయిగా, మర్నాటినుంచి ఆఫీసు కెళ్ళటం సాగించాడు.

అయితే యింతవరకూ, నరసింహారావు దవడను శారద వాయించటంగాని, శారద బుగ్గ నరసింహారావు కరవటంగాని జరగలేదు.

★



విజ్ఞాన వీధులు

"డాక్టర్"



115. వస్తువులు రంగులతో ఎందుకు కనిపిస్తాయి?

ఒక వస్తువునుంచి కాంతికిరణాలువచ్చి మన కంటిని చేరినప్పుడే మనమా వస్తువును చూడగలుగుతున్నాం. వేర్వేరు వస్తువుల నుంచివచ్చి కంటిని చేరుకొనే కాంతి కిరణాలు అన్నీ సమానమైన అలపొడవును కలిగియుండవు. ఆకాంతి కిరణాల అలపొడవు బట్టి ఆ వస్తువు రంగు ఉంటుంది. ఒక వస్తువునుండివచ్చిన కాంతి కిరణాలఅల పొడవు 0.00033 సెం. మీ. లకును, 0.00045 సెం, మీ. మధ్యనుండే ఆ వస్తువు ఊదాగాను, 0.00045 సెం. మీ. లకును 0.00049 సెం. మీ మధ్య నుంటే అది నీలిగానూ, 0.00049 సెం. మీ. లకును 0.00055 సెం. మీ. మధ్య నుంటే ఆకుపచ్చగానూ, 0.00055 సెం. మీ. లకును 0.00059 సెం. మీ. లకును మధ్యనుంటే పసుపుపచ్చగానూ, 0.00059 సెం. మీ. లకును 0.00063 సె. మీ. లకును మధ్యనుంటే నారింజవర్ణంలోనూ, 0.00063 సెం. మీ లకును 0.00081 సెం. మీ లకును మధ్యనుండే ఎరుపురంగుగానూ ఆనుతుంది. ఆ వస్తువులనుంచి వచ్చే కాంతి కిరణాల అలపొడవులను బట్టి ఈ ఆరు రంగులలోను ఛాయలు కూడాకనపడతాయి.

అయితే ఒక్కొక్కప్పుడు వస్తువు వాస్తవంగా ఉన్న రంగు వేరూ, అది కనిపించే రంగు వేరూ ఉండవచ్చు.

స్వయం ప్రకాశిత వస్తువులన్నీ అవి ప్రత్యక్షంగా ప్రసరించే కాంతి కిరణాల రంగులోనే మంచి దృష్టిగలవారికి కనిపిస్తాయి; కానీ వర్ణాంధులకు (*Colour-blindness* గలవారు) కళ్లకు రంగు అద్దాలు ధరించిన వారికి అవి కనిపించేతీరు వేరుగా ఉంటుంది. మాటవరుసకు ఒక వ్యక్తికి ఎర్రరంగు కనిపించని అంధత్వం ఉందనుకొందాం. ఎర్రరంగు తప్ప మరే రంగువస్తువైనా దాని సహజవర్ణంలో అతనికి ఆనుతుంది. కాని ఎర్రరంగు వస్తువులు మాత్రం నల్లగా కనిపిస్తాయి. ఇక రంగు అద్దాలు ధరించిన వారి విషయం మరీ తమాషాగా ఉంటుంది. ఒక వ్యక్తి ఆకుపచ్చరంగు కంటి అద్దాలు ధరించే డనుకొందాం. ఆతనికి ప్రకృతిలోనున్న ఆకుపచ్చరంగు వస్తువులు, తెల్లరంగు వస్తువులు కూడా ఆకుపచ్చగానే ఆనతాయి, కాని మిగిలిన రంగు వస్తువులు మాత్రం నల్లగా ఆనతాయి. దీనికి కారణం ఆకుపచ్చరంగు కాంతికిరణాలను తప్ప మిగిలిన అన్నిరంగుల కాంతికిరణాలను ఆ ఆకుపచ్చకంటి అద్దాలు శోషించి, ఆకుపచ్చరంగు కాంతి కిరణాలను మాత్రమే కంటిని చేరనీయడమే.

స్వయం ప్రకాసవులు కాని వస్తువులలో ప్రకాశ పారదర్శకములు (*Trans-parent*) ప్రకాశ నిరోధములు (*Opaque*) అని రెండు రకాలున్నాయి. ప్రకాశ పారదర్శక వస్తువులు తమ గుండా చొరనిచ్చే కాంతికిరణాలవల్ల ఆనుతున్నాయి. అందుచేత అవి ఏ రంగు కాంతికిరణాలనైతే తమగుండా చొరనిస్తాయో ఆ రంగులోనే ఆనతాయి. తెల్లని స్వచ్ఛమైన గాజు సంపూర్ణ పారదర్శకం. తనపై పడిన ఏ రంగు కాంతికిరణాన్నైనా సరే, ఎట్టి వివక్షతా లేకుండా, అది తనగుండా ప్రసరించనిస్తుంది. అందుచేతనే సూర్యకాంతి వంటి తెల్లని కాంతిలో అది తెల్లగా కనిపిస్తుంది. కాని రంగుకాంతిలో దానిని చూచినపుడు అది ఆ రంగులోనే కనిపిస్తుంది. రంగు గాజువంటి అర్ధ పారదర్శక వస్తువులు (*Partially transparent bodies*)తమపైపడిన కాంతికిరణాలలోఏదో ఒకరంగు కాంతి కిరణాలను మాత్రమే ప్రసరించి,మిగతారంగులకాంతికిరణాలనన్నిటిని శోషిస్తాయి కాబట్టి అవి ప్రసరించే కాంతి కిరణాల రంగునే అవి కలిగియుంటాయి. మాటవరుసకు తెల్లని కాంతిలోను, ఎర్రని కాంతిలోను ఎర్రగాజు ఎర్రగా కనిపిస్తుంది. మిగతా రంగుల కాంతులలో అది నల్లగా ఆనుతుంది. నల్లని గాజు నల్లగా కనిపించుటకు కారణం అది అన్ని రంగుల కాంతి కిరణాలను శోషించి, ఏ రంగు కాంతికిరణాన్నికూడా ప్రసరింపక పోవుటయే.

ప్రకాశ నిరోధక పదార్థాలకు రంగు అవి పరావర్తన మొనర్చే కాంతి కిరణాలచే చేకూరుతున్నది. తెల్లని గోడ దానిపై పడిన అన్నిరంగుల కాంతి కిరణాలను సమానంగానే పరావర్తన మొనరుస్తుంది. అందుచేత అది తెల్లగా కనపడుతుంది. కాని మసిబొగ్గు దానిపై పడిన కాంతికిరణాలలో అన్నిరంగుల కిరణాలను పూర్తిగా శోషిస్తుంది. కాబట్టి అది నల్లగా గోచరమౌతుంది. కొన్ని ప్రకాశ నిరోధక పదార్థాలు తమపైపడిన కాంతికిరణాలలో ఏదో ఒక రంగు కాంతికిరణాన్ని మాత్రమే పరావర్తన మొనర్చి, మిగిలిన అన్ని కాంతి కిరణాలను శోషిస్తాయి. ఈవిధంగా అవి ఏ రంగు కాంతికిరణాలను పరావర్తన మొనరుస్తాయో, ఆ రంగుగానే కనపడతాయి.

సంపూర్ణప్రకాశ పారదర్శక పదార్థాలు

తమ వక్రీభవన సూచిక (*Respective Index*) యంతే వక్రీభవన సూచికగల యానకంలో ఉన్నపుడు, కంటికి అసలు అనలే ఆనవు. 'కార్బన్ డై సల్ఫైడ్' అనే ద్రవంలోనున్న 'ప్లింట్ గ్లాస్' ముక్క ఇందుకు మంచి నిదర్శనం.

—అనంత్.

చిట్టిప్రశ్నలు - జవాబులు

—చచ్చిపోతూన్నవారు 'నన్ను కేక వేస్తున్నారు నేను వెళుతున్నా'నని అనడము యమభటులంటూ వున్నారనీ వారు పిలుస్తారనీ నమ్మకమున్నవాళ్లు ఊహించే దృశ్యాలు మాత్రమేనో, లేక నిజమో ఎలాగ తెలుసుకోడమూ? వెళ్ళివచ్చినవారి సాక్ష్యము లేనంతకాలము ఇది అజ్ఞాతంగానే వుండిపోతుంది.

—ప్రాణము వున్న మనిషిని చచ్చిపోతూన్నప్పుడు తూనిక మీద ఉంచి, చచ్చిన తర్వాత బరువెక్కుతాడో లేదో ఎవరూ సోదా చూసినట్టు కనబడదు. చేపలూ, ఎలకలూ చూశారు. తేడా లేదు.

—చావు అంటే శరీరంలోని జీవశక్తులు నశించిపోవడము అనేగాని అంతకుమించి తెలియదు. ఆఖర్ని ఆగిపోయే అంగము గుండెకాయ అన్నారు. గుండె ఆగిన కొంతసేపటికి గాని శరీరము బిర్రబిగుసుకోదు. తరవాత కొంతసేపటికి గాని శరీరము కుళ్ళి వాసన రాదు. ఇలాగ పరిశీలన చేస్తూ పోతే ఆఖరెప్పటికి? గుండెకాయ కొట్టుకోడము ఆగిపోడమే చావు అనుకోవాలి.

—సముద్రపుటడుగుకి మనుష్యులు దిగాలంటే, గాలిఒకవేపునించి వస్తూ ఇంకోవేపు నించి పోతూవుండే ఇనపటోపీ, దిగే మనుష్యుణ్ణి దింపడానికీ, పైకి లాగేయడానికీ వీలయిన ఇనపతాడూ, ఆ త్రాటిచివర ఆయనగారు కూర్చోడానికి వీలుగా చిన్న అడ్డకర్రా అవసరము. వీటన్నికీ మించి లోతుకుదిగే మనిషికి ఆ లోతునఉండే నీటి ఒత్తిడికి తట్టుకోగలశక్తివుండాలి. లేకపోతే ముక్కువెంట నెత్తురురావడమూ, స్మృతి తప్పిపోవడమూ జరుగుతాయి.

—సముద్రపు కెరటాలు అడపాదడపా ఒడ్డుకి కొట్టుకుంటూ ఒడ్డునవున్న రాళ్ళని కూడా కదుపుతాయి. ఈ రాళ్లు అరిగి అరిగి ఇసుక అవుతాయి. ఈ ఇసుకమట్టి కంటె బరువుకనక నీటిఅంచుదగ్గర నిలుస్తుంది. పోటులో సముద్రపునీరు పొంగి రావడమువల్ల ఇసుక ఇంకా ఒడ్డుకెక్కుతుంది. తరవాత గాలివల్ల కెరటాలు కెరటాలుగా ఏర్పడుతుంది కూడాను.

—తీతువు పిట్ట సామాన్యముగా ఎండిన చెట్లమీదఉంటుంది. ఆ పిట్ట అరవడము వల్లనే ఆ చెట్టు ఎండిపోయిందనుకున్నవారు తీతువు కూతకి అమంగళం ఆరోపించారేమో. తీతువు అరవడము ఎంతమంది వినడములేదూ? వారందరికీ ప్రాణభంగము కలుగుతోందా?

—చలికాలంలో చెమట ఎక్కువగా పట్టదు. వేసవిలో పట్టుతుంది. కనక శరీరములో అక్కరలేని నీరు చలికాలంలో మూత్రరూపంలో ఎక్కువగా బయటికి పోతుందీ, వేసంగిలో చెమటరూపాపంగా పోతుంది.

—దయ్యాలంటే శరీరములేని జీవాత్మ అని చెప్పాలేమో. జీవాత్మ ఉన్నదనుకో వలిసిందేకాని నిరూపించ వీలుకాలేదు. 'దయ్యాలున్నాయా?' అన్న ప్రశ్నకన్న 'దయ్యాలేమి చేయగలవూ?' అన్న ప్రశ్న సమంజసము. దీనికి జవాబు నాకు తెలియదు.

—జడలు చిన్నపిల్లలకు మాత్రమేకాదు. చమురురాసి దువ్వకపోతే బైరాగులకీ వస్తాయి. చిన్న పిల్లలకి సున్నిపిండిరాసి నీళ్లుపోస్తారు. ఆ సున్నింపిండి అంటుకుని కొంచెము అట్టకట్టినట్టు అయితే ఆ వెంట్రుకల్ని పదిలంగా వదిలేస్తారు. లేకుంటే అవి హిందులకే రావడమేమీ?

—సూర్యరశ్మిలోని శక్తిని పీల్చుకుని చెట్ల ఆకులలోని ఆకుపచ్చపదార్థము, గాలిలోని అంగారామ్లవాయువుని తీసుకుని, పిండిపదార్థము తయారు చేసుకుని, ఆమ్లజనిని వదిలేస్తాయి. సూర్యరశ్మిలేని రాత్రిపూట ఈ పనిజరగక మామూలు శ్వాస-ప్రాణవాయువుని పీల్చుకుని అంగారామ్లవాయువుని-వదలడము జరుగుతుంది.

—చేతిలోని రేఖలకీ మానవుని జీవితానికీసంబంధమున్నదని అన్ని జాతుల వారూ నమ్ముతూన్నట్టే కనబడుతోంది. ఈ సాముద్రికాన్ని శాస్త్రమనడానికి ఆధారాలు ఇంకా సమకూడలేదు.


—బిడ్డ నెత్తురుపరీక్ష చేసి, ఒక జంటకి ఆ బిడ్డపుట్టినదో లేదో తెలుసుకోవచ్చును.

—వర్షబిందువులు చిన్ని మంచుకణముల చుట్టూఏర్పడతాయని నేటి వాతావరణ శాస్త్రజ్ఞుల నమ్మిక. అందుకనే మేఘాలపైకి ఎరోప్లేనులోవెళ్ళి ఘనీభవించిన అంగారామ్లవాయువును విరజిమ్మితే అవి రూపములోనూ, చల్లదనములోనూ మంచు కణాల్లాగే వుంటాయి కనక మేఘాల్లోని నీరు వీటిచుట్టూ బిందువులుగా ఏర్పడి, బరువువల్ల వానగా పడతాయి.

—తెలివితేటలు ఏ విటమినువల్ల ఎక్కువౌతాయేమో ఇంకా ఎవరూ కనిపెట్టలేదు.

—సముద్రములోనికి నీరు ప్రవహిస్తే దానిమట్టము పెరగనట్టే, భూమిలోకి ఎంత విద్యుత్తుప్రవహించినా, భూమి విద్యుత్ స్థితిమారదు.

★



నెమరువేత

చిత్రకారుడు—శ్రీ అంకాల వెంకటసుబ్బారావు.

పుష్పవాటిక

చిత్రకారుడు—శ్రీ సూర్యప్రకాశ్ నామ్‌శేన్.







సూర్యమండలం

చిత్రకారుడు—శ్రీ అంకాల వెంకటసుబ్బారావు


పిచ్చిక పాట

శ్రీ శ॥ కోటి

★

పిల్ల లందరము
ఆడే వేళ
బొమ్మల పెళ్లి
చేసే వేళ
పెళ్లికి చేరువ
పిచుకొకటి
కిచకిచ మంటూ
వాలింది.
"బాగున్నావా?
పిచుకమ్మా?
బొమ్మల పెళ్లికి
రావమ్మా!
పెళ్లికి పెద్దవు
నీవమ్మా!
వియ్యపురాలివి
నీవమ్మా!"
"పెళ్లికి పెద్దను
నేనయితే
చేసే మర్యా
దింతేనా?
వియ్యపురాలిని
నేనయితే
కానుక లనలే
లేవేమి?"
చిరచిర లాడుతు
పిచుకమ్మా
తురుతురుమంటూ
ఎగిరింది.

జంతుకోటిలో మానవలక్షణాలు



(గత సంచిక తరువాయి)

కడుపున పుట్టిన బిడ్డపైకన్న తల్లికి మమకారం వుండటం జీవకోటి కంతటికీ సామాన్య లక్షణమే. కన్నతల్లిపై బిడ్డలకు వుండే మమకారం విషయంలోనే వ్యత్యాసాలు వస్తాయి. ఏకోదరులైన మానవుల్లోనే తల్లిపట్ల ప్రేమభిమానాలు అందరికీ ఒక్కలా వుండవు. మరీ పసితనంలో మాత్రం ప్రతి శిశువూ తల్లినే అంటిపెట్టుకు వుంటుంది. ఏ కారణంచేతనైనా తల్లి దగ్గిర లేకపోతే, తన కెవరైతే తిండి పెట్టుతారో వారినే చంటిబిడ్డలు అంటిపెట్టుకు తిరుగుతూ వుండటం మనము చూస్తున్నదే. కాబట్టి దీనినిబట్టి తేలే విషయమేమంటే— బిడ్డకి పుట్టినరోజు మొదలుకొనీ తల్లిమీదనే మమకారం వుండక పోవటం అసహజంకాదు. ఎవరైతే తన విషయం పట్టించుకొని తనకవసరమైనవన్నీ సమకూరుస్తుంటారో వారినే, బిడ్డలు అంటిపెట్టుకు వుండటం ప్రకృతి ధర్మం. తల్లిని విడవకుండా తిరిగే ప్రాణి ఏదైనా, అలా ఎందుకు వుంటోందీ అంటే—కేవలమూ తల్లిమీది ప్రేమ కాదనీ తన ఆహారాదులకోసం ఎవరిమీదనో ఒకరిమీద ఆధారపడటం దానికి అప్పుడు తప్పనిసరి కనుక, బిడ్డ తల్లిని అంటిపెట్టుకు వుంటుందనీ తెలుసుకోవలసివుంది.

జంతుకోటిలోని ఈ తత్వాన్నే రాబర్టు బ్రిఫాల్ట్ అనే ఆయన యిలా వివరించాడు:—

"పసితనంలో ఏ జంతువైనా సరే, తన కాహారాదులు తెచ్చి పెట్టే ఏ జంతువునైనా, [ఏ మనిషినైనా] అంటిపెట్టుకు వుంటుంది గ్రుడ్లలో నుంచీ బయటికి వచ్చీ రాగానే, కోడిపిల్లల కంటికి, కదిలే ప్రాణి ఏది కనపడుతుందో, దాన్నే అవి అంటిపెట్టుకు తిరుగుతాయి."

ఆయనే మరొక సందర్భంలో వ్రాస్తూ, ఒక విషయం చెప్పాడు. గేదెల్ని మాంసంకోసం చంపుతూ వుండటం పరిపాటిగా జరిగేదే. తల్లి గేదెను చంపిన కసాయివాడి వేళ్లను, ఆ గేదె దూడలే నాకుతూ వుండటం కద్దని ఆయన అన్నాడు. అలాగే తల్లి ఖడ్గమృగాన్ని వేటాడి చంపిన మనుష్యుల వెనకాల, గొఱ్ఱెపిల్లలా నడిచిపోయే పిల్ల ఖడ్గమృగాలు కూడా వుంటాయి. తల్లిని చంపిన ఆ హంతకులను పూసుకు తిరగటం మనకేమిటో చాలా ఘోరమైన విషయంగా తోస్తుంది. కానీ జంతుకోటిలో పిల్లలకి తల్లులపై ప్రేమ చాలా తక్కువ.

తల్లిని మరచిపోయి, తిండి పెట్టే వారి వెనకపడే తత్వం, జంతువులు పెరిగి పెద్దవైనాక కూడా ఒకపట్టాన పోదు. అడవుల్లో తిరుగుతూ యితర జంతువులకి హాని కల్గించే తత్వంకల జంతువులు కూడా, మనుష్యుల చేతుల్లోపడి, మచ్చిక అవుతున్న కొద్దీ, వాటి వాటి తల్లులపై యింకా ఏకొద్దిగానైనా ప్రేమాభిమానాలు అట్టే పెట్టుకొనే అవకాశం వుంటే, దాని మాటే మరచిపోయి, తమని మచ్చిక చేస్తున్న మానవులకే మాతృస్థానాలు యిస్తున్నాయి. తల్లి పోషణ కావలసిన ప్రతిజంతువూ, తన పోషణ భారం ఎవరు వహిస్తే

(43-వ పేజీ చూడండి)

శిక్ష పడని హంతకులు

"కూ" అని కూత పెట్టిన రయిల్ బండి మెల్లగా కదలనారంభించింది. నాగేష్ [అసలు పేరు నాగేశ్వరరావు లెండి!] రైలు పెట్టెలో ఒకమూలగా కూర్చొని కిటికీలోనుంచీ పరుగెత్తే చెట్లనీ, టెలిగ్రాఫ్ స్తంభాలనీ తిలకిస్తున్నాడు. ఆపెట్టెలోనే మరో మూలగా ఎవరో యిద్దరు కూర్చొని ఏదో మాట్లాడుకొంటున్నారు. ఆపెట్టెలో వీరు ముగ్గురూ తప్ప మరెవ్వరూ లేరు.

నాగేష్ వాళ్ల ఊరిలో హైస్కూలు లేకపోవడంవల్ల వాళ్ల మామయ్యగారింటికొచ్చి ఆవూరి హైస్కూల్లో చదువుకుంటున్నాడు. పరీక్షలు పూర్తైనాయి. ఒకవారం రోజులు స్నేహితులతో తిరిగి, ఒక్కొక్కరే వాళ్ల వాళ్ల వూళ్లకి వెళ్లిపోతున్నందువల్ల తను కూడా వారి చిరునామాలు, నంబర్లు నోట్ బుక్‌లో ఎక్కించుకొని, ఫలాని రోజున వస్తున్నానని తలిదండ్రులకి వుత్తరం వ్రాసి, "అపుడే తొందరేమిటిరా?" అంటున్న మామయ్య మాటలను కూడ లెక్కచెయ్యకుండా రైలు పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు.

చెట్లూ-పుట్టలూ, పొలాలు-కాలువలు వెనక్కు పరుగెడుతున్నాయ్. రైలు చేసే చప్పుడుతో పాటు ఆమూల నున్న వ్యక్తుల సంభాషణా వేగం కూడ ఎక్కువౌతూన్నట్లుంది. వారి సంభాషణల్లో దిగువ వాక్యాలు నాగేష్ చెవిలో పడ్డాయి.

"సరే, ఇక నీవు చేయగలిగిందొకటే ఒకపని; అది వాడిని చంపేయటమే!"

"అబ్బే, అలాకాదు. అలాచేస్తే పరిస్థితి మరీ విషమిస్తుంది."

శ్రీ దొంతంశెట్టి వీరభద్రరావు

"నాన్సెన్సు. నేను చెప్పేది విను. అంతకంటె సులభమైన పని మరొకటి కనిపించదు. వాడి చావు మూలంగా నీకు అన్ని ఆటంకాలూ తొలగిపోతాయి!"

"అవును...నిజమే... నీవు చెప్పిందే బాగున్నట్లుంది. సరే, అలాగే చేస్తా..." అని ఆఖరుకు ఒప్పుకున్నాడు రెండవవాడు.

నాగేష్ పై ప్రాణం పైనే పోయింది. వొళ్లు చల్లబడింది. ఇక సందేహమేమీ లేదు. వారిద్దరూ కలిసి ఎవరినో హత్యచేయడానికి కుట్ర పన్నుతున్నారు. ఆయిద్దరి వంకా నిదానంగా చూశాడు. మంచి బలంగా వున్నారు. తను అక్కడ వున్నాననే విషయం మరచి పోయారేమో! అందుకే అంత నిర్భయంగా మాట్లాడుకుంటున్నారు.

రైలువేగం తగ్గిపోతూంది. ఏదో స్టేషన్ దగ్గరకు వస్తున్నట్లుంది. దాంతో నాగేష్ ప్రాణం కొంచెం కుదుటబడింది; బండి ఆగగానే దిగిపోయి ప్రక్కపెట్టెలో యెక్కుదామనుకున్నాడు. కిటికీలోనుండి తల బయటకుపెట్టి ఏస్టేషనో చూచేసరికి, నిజంగా అతనికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లైంది. ఎందుచేతనంటే అదే స్టేషన్లో వాళ్ల బాబాయ్ [చిన్నాన్న] స్టేషన్ మాష్టరుగా పని చేస్తున్నాడు. ఇటు తిరిగి చూచేసరికి ఆ ప్రయాణీకు లిద్దరు లేచి బండి దిగటానికి సిద్ధమౌతున్నారు.

అంతవరకు భయంతో వణకిన నాగేష్‌కి పైసంఘటనలతో భయం పోవడమే కాక, ఏదో లేనిధైర్యం కూడా ఆవహించినట్లైంది. ఎలాగూ తనింటికిపోయి చేయవలసిన ముఖ్యమైన పనేమీ లేదు. హంతకులిద్దరూ యిక్కడే దిగిపోతున్నారు. అంటే వారు హత్యచేయ దలచిన వ్యక్తి యిక్కడనే వున్నాడన్న మాట. కాబట్టి తనుకూడా యిక్కడే దిగిపోయి బాబాయితో సంగతంతా చెప్పి, పోలీసువారి సహాయంతో పట్టించేయాలనుకున్నాడు నాగేష్. త్వరగా బండి దిగి తిన్నగా స్టేషన్ మాష్టరు

వద్దకువచ్చి తను విన్న సంగతంతా అతిరహస్యంగా చెప్పేశాడు.

"ఆ! వాళ్లెక్కడ?" అంటూ స్టేషన్ మాష్టరు కూర్చున్న కుర్చీలోంచి ఎగిరిపడ్డాడు. ఆయనతో పాటు అక్కడ పనిచేస్తున్న మరి కొందరు ఆశ్చర్యపోతూ, "నిజమేనా అబ్బాయి?" అనడిగారు.

"అవును, నిజమే! ఇపుడే బయటికి పోతున్నా"రన్నాడు నాగేష్.

అందరూ బయటకు వచ్చి చూచారు. హంతకులిద్దరూ ఊరి వైపు నడుస్తున్నారు. అంతలోనే ఒక కానిస్టేబుల్ వచ్చి, "ఏమిటి? వింతంగా చూస్తున్నా"రని అడిగాడు.

"ఆ పోయే వాళ్లిద్దరూ నీకు తెలుసా?" అనడిగా డొకడు.

"ఆఁ, ఈ మధ్యనే వచ్చారీ ఊరు.. వారితో మీకేం పని?" అనడిగి, వారు ఫలాని వారింటిలో ఉంటున్నారని అతడు చెప్పాడు.

అతనికూడ ఈ సంగతంతా చెప్పేసరికి, "అవును, నిజమే, వీరి ప్రవర్తన నాకూడ అనుమానంగానే ఉంది" అన్నాడు కానిస్టేబుల్.

"అయితే యిక ఆలస్యం దేనికీ? ఆయిద్దరూ తప్పక ఆయింటికే వెళ్లుతారు. మనం కూడా వెళ్ళి అరెస్టు చేసేద్దాం." అన్నాడు నాగేష్‌వాళ్ల బాబాయ్. నాగేష్ మాత్రం వూపిరి బిగపట్టి వారి సంభాషణ వింటూ నిశ్శబ్దంగా ఉన్నాడు. అంతలో కానిస్టేబిల్, "కాదండీ, ముందు ఇన్స్పెక్టరు గారికి టెలిఫోన్ చేస్తే మంచిదనుకుంటాను" అన్నాడు.



"ఎందుకయ్యా! ఆ ఆలస్యం కూడాను? అవతల హత్యజరిగిపోతుంటేను" అని స్టేషన్ మాష్టరనగా "అయినా, అది కూడా ఆలోచించాలి చూడండి: వాళ్లు ఇద్దరూ కూడ మాంచి బలమైన వాళ్లు" అన్నాడు మరొకడు.

"అయితే అవనీయండి. నేను కూడ వస్తానుగా. మరో నలుగురు *Railway Police* లను తీసుకు వెళదాం." అన్నాడు స్టేషన్ మాష్టరు. మిగతా వారంతా 'సరే' అంటే 'సరే' అన్నారు.

"ఏమిటయ్యా ఈ లేటు?" అంటూ గార్డు కూడ బయటకువచ్చి స్టేషన్ మాష్టరి నడిగేసరికి ఆయన బిస్తర

★ శిక్షపడని హంతకుడు ★

పోయి "*I am sorry*—" అంటూ అంతా చెప్పకువచ్చి, రైలు, స్టేషన్ వదలడానికనుజ్ఞయిచ్చాడు. నాగేష్ మాత్రంఏంజరుగుతుందోచూడాలని బాబాయితోనే ఉండిపోయాడు.

అందరూ కలిసి కానిస్టేబిల్ సూచనల ప్రకారం హంతకులుంటున్న యింటివద్దకు చేరారు. తలుపులు మూసిఉన్నాయి. ఎదురింటి వారి నడిగితే అంతకుముందే ఎవరో యిద్దరు లోనికి వెళ్ళారని జవాబు వచ్చింది. తప్పక వారిద్దరే అయివుంటారని వీళ్లంతా అనుకొన్నారు.

స్టేషన్ మాష్టరు, తనూ, మరిద్దరూ కలిసి లోనికి ప్రవేశిస్తామనీ, ఏదైనా పోరాటం జరిగితే తక్షణం బయటనున్నవారు అందరు సహాయానికి రావాలనీ తీర్మానించాడు.

"వెనుకవైపు నుండి పారిపోతారేమో!" అనుమానం వెలిబుచ్చాడొకడు.

"నిజమే... కాబట్టి కొందరు ఇంటికి వెనుకవైపు కూడా కావలి వుండాల"ని పురమాయించాడు స్టేషన్ మాష్టరు.

స్టేషన్ మాష్టరు తలుపుతట్టాడు. నాగేష్ ప్రక్కనేకూడా వున్నాడు. కొంతసేపటికి తలుపులు తెరుచుకున్నాయి. తలుపు తెరచినవ్యక్తి చేతిలో రైఫిల్ పట్టుకొని వున్నాడు. వాళ్లు హంతకులే అనటానికి అంతకంటే యింకా ఏం నిదర్శనం కావాలి? పోలీసులు భయంతో ఒక్కడుగు వెనక్కు వేశారు.

"వారిద్దరిలో యితడొకడు" అన్నాడు నాగేష్.

రైఫిల్ పట్టుకొని వున్న మనిషి కూడా వీళ్లనందరినీ చూడగానే అతనూ భయపడి పోయాడు. పోలీసుతుపాకుల నతనిపైకి గురిపెట్టి పేల్చటానికి సిద్ధంగా నిలబడ్డారు.

"ఆగండి. ఏమాత్రం కాలుస్తాషో కాల్చ నివ్వండి!" స్టేషన్ మాష్టరు గర్జించాడు.

"నేనా? మిమ్మల్ని కాల్చటమా?" అన్నాడు లోనుండి వచ్చినవ్యక్తి. "నేనెందుకు కాలుస్తాను? సాయంత్రం వేటకు వెళ్దామని తుపాకీ - తుడుస్తున్నాను. అంతే. ఇంతకీ తామందరూ ఏమీ కారణం లేందే, యింత సరంజామాతో ఈయింటిని చుట్టుముట్టడం చూస్తే నాకు మతిపోతోంది. మీరు వచ్చిన పనేమిటో త్వరగా శెలవివ్వండి!"

స్టేషన్ మాష్టరు గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. నాగేష్‌కోసం ప్రక్కన చూచాడు. పోలీసుల వెనగ్గా ఎప్పుడో ఉడాయించాడు, నాగేష్. తను ఎలాగో గుండె చిక్కబట్టుకొని జరిగిందంతా చెప్పటం మొదలెట్టాడు స్టేషన్ మాష్టరు. ఎప్పుడో రెండవవ్యక్తి కూడా వచ్చి వింటున్నాడు. చెప్పడం పూర్తికావడంతోనే ఆయిద్దరూ కలిసి పెద్దపెట్టున నవ్వ నారంభించారు. సంగతేమో తెలియక బొమ్మల్లా నిలబడ్డారు మిగిలిన వారంతా.

చేతిలో తుపాకితోనున్న వ్యక్తి ఎలానో నవ్వ నాపుచేసికొని యిలా చెప్ప నారంభించాడు. "అబ్బ! ఇటువంటి హాస్యాన్ని యింతవరకూ ఎప్పుడూ విన లేదంటే నమ్మండి. అసలు సంగతిది. నాస్నేహితుడు ఒక రచయిత. ఈమధ్య కొద్దిరోజులనుండి వాడు ఒక నవల వ్రాయడంలో మునిగి తేలుతున్నాడు. అందులోని ఒక పాత్రతో అవసరం తీరిపోయింది. మాటి మాటికి కథలో అడ్డొస్తున్నాడట. ఏమి చేయమంటావని నన్ను సలహా అడిగితే, చంపేసి వాడిపీడ వదిలించుకోమని చెప్పాను. అంతేకాని అంతకన్న మరేమీ లేదు. దీన్ని గురించి-యిందాక మేంవచ్చిన రైలుబండి లోనే ననుకుంటాను - మాట్లాడుకొన్నాం!"

అంతా విన్న తరువాత స్టేషన్ మాష్టరుకి నవ్వాలో, ఏడ్వాలో తెలియలేదు. పైకి మాత్రం చిరునవ్వు నవ్వుతూ "క్షమించండి, మిమ్మల నవమానపరచాలనే ఉద్దేశంతో మేము యీపని చేయలేదు. ఆకుఱ్ఱాడలా ఆర్భాటంగా రిపోర్టు చేయడం మూలంగా యింత పని జరిగింది" అన్నాడు.

"ఎవరండీ ఆకుఱ్ఱాడు?" అనడిగే సరికి కత్తివాటుకు కూడ నెత్తురు లేని ముఖంతోనున్న నాగేష్ కానిస్టేబుల్స్ కళ్ల సందున కనిపించాడు.

"ఏమోయ్, నీవా? అవును లే. నీవనుకున్నది కూడ నిజమే. నిజానికి కవులు హంతకులే; తమకిష్టం లేనివారిని హత్యలే కాదు - చిత్రవధలుకూడా చేస్తారు. అవమానపరుస్తారు. ఇష్టమున్న వారిని అష్టైశ్వర్యాలతో ముంచెత్తుతారు. అంతకంటే దుర్మార్గులు వేరొకరు లేరన్నా అతిశయోక్తి కాదులే. అయినా అటువంటివారిని శిక్షించక పోగా అందరూ కలిసి వారిని అందలమెక్కిస్తారు" అన్నాడు తుపాకి పట్టుకొన్న పెద్దమనిషి. ★

మంచికి పోతే....

శ్రీ ముదిగొండ
వీరభద్రసేనాధిపతి

ఇంకా రైలు రావటానికి గంట అలస్యముంది. నేను స్టేషనులో ఏమీతోచక అటూ యిటూ పచారు చేస్తున్నాను. ఇంతలో బుకింగ్ విండో తెరిచారు. జనం కిటకిట లాడుతున్నారు. నేను గూడా టిక్కెట్టు తీసుకుందామని కిటికీ దగ్గరకు వెళ్ళాను. చొక్కా పొంతం చిఱగకుండానే బైట పడ్డందుకు సంతోషిస్తూ, టిక్కెట్టు తీసుకొని జనసముద్రంలో ఈదుకుంటూ బైటికి వస్తున్నాను.


పాపం!-ఎవరో ఒక ముసలమ్మ టిక్కెట్టుకోసం తొందర పడ్తున్నట్టు కన్పించింది. రైలుగూడా ప్లాట్ పారంమీదికి వచ్చేసింది. ఆ ముసలమ్మని చూస్తుంటే నాకు కిందటి ఏడు క్లాసు పాఠాలలో చదివిన "మంచి పిల్ల వాడు"(*The Noble Boy*) పాఠం గుర్తు కొచ్చింది. ఆపాఠంలో ఏం జరుగుతుందంటే-ఒక మంచిపిల్లవాడు రోడ్డుమీద పోతూ, బండ్లను తప్పించుకోలేక తంటాలు పడుతున్న పండుముసలి అవ్వ కనిపిస్తే, ఆవిడను చెయ్యి పట్టుకు రోడ్డు దాటించి యింటికి చేరుస్తాడు. ఆఅవ్వ అతణ్ని ఆశీర్వదించి పంపుతుంది. ఇదంతా జ్ఞప్తి కొచ్చేసరికి, నేను గూడా అట్లాగే ఎందుకు చెయ్యకూడదూ అని పించింది.

వెంటనే వెళ్ళి ఆమెను "ఏం అవ్వా? ఏ వూరికి కావాలి టిక్కెట్టు?" అని అడిగాను. ఆమె శిరిపురానికి కావాలని తొమ్మిది అణాలు యిచ్చి, "కాస్త 'తికట్టు' తెచ్చిపెట్టు నాయనా" అంది.

'సరే' నని డబ్బులు తీసుకొని, మళ్ళీ జనాన్ని చీల్చుకొని కిటికీ దగ్గరకు వెళ్ళి, టిక్కెట్లు అడిగేసరికి, శిరిపురానికి టిక్కెట్టు పదణాల న్నాడు.—అక్కడ వుండే బుకింగ్ క్లార్కు. మళ్ళా బయటికివచ్చి ఆమెతో చెప్పి, అణా తీసుకొ

(56-వ పేజీ చూడండి)





(గతసంచిక తరువాయి)

బ్రహ్మరాక్షసు డక్కడినించి వెళ్ళిపోయేదాకా తండ్రీ కూతురు ఇద్దరు అల్లాగే ప్రాణా లరచేతుల్లో పెట్టుకుని నిలబడ్డారు. తరవాత ధనగుప్తు డొక్క నిట్టూర్పు విడిచి సుందరితో ఇల్లాగన్నాడు.

"అమ్మాయీ! వీడు ఇక్కడ ఉన్నంతసేపు నా పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి! నిన్నిక్కడ విడిచిపెట్టి వెళ్ళడానికి నా కెంత మాత్రము మనస్కరించడం లేదు! నా మాట విని నువ్వింటికి వెళ్లిపో! నే నిక్కడే ఉండిపోతాను!... నేను చెప్పే మాట ఒక్కటీ వినమ్మా! ఎల్లాగో అల్లాగ వీడి కన్ను గప్పి ఇంటికి వస్తానులే!"

సుందరి ఎంతగా బతిమాలినా ధనగుప్తుడి మాట వినక—"నాన్నగారూ! ఈ విషయంలో ఎంత చెప్పినా మీ మాట వినదలుచుకో లేదు. మీ రింక మాట్లాడక పొద్దున్నే లేచి ఇంటికి వెళ్ళిపొండి!" అని ఖరారుగా సమాధానం చెప్పింది.

ధనగుప్తు డింక చేసేదేమీ లేక ఆపక్క గదిలో పరచివున్న పరుపు మీద పడుకున్నాడు. సుందరి కూడా తన కోసం ప్రత్యేకంగా వేసిన మెత్తని పక్కమీద మేను వాల్చింది. ముందేమి జరుగుతుందో అనే భయంవల్ల ధనగుప్తుడికి చాలా సేపటిదాకా నిద్రపట్ట లేదు గాని తెల్లవారగట్లవేళ ఒక చిన్న కునుకు పట్టింది. అయితే సుందరికి మాత్రం

శ్రీ ప. గణపతిశాస్త్రి

పడుకున్న కొంతసేపటికే గాఢంగా నిద్ర పట్టి ఒక చిత్రమైన కల వచ్చింది.

ఆ కలలో ఆమె కొక దేవతా స్త్రీ ప్రత్యక్షమై "అమ్మాయీ! నీవు నిర్భయంగా బ్రహ్మరాక్షసుడికి బలి అయిపోవడానికి ఒప్పుకుని నీ తండ్రి ప్రాణాలు కాపాడాలని ప్రయత్నించావు. తండ్రిమీద నీకుగల భక్తి, నీ గుండె ధైర్యము చూస్తే నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంక నీవేమీ భయపడ నక్కర లేదు. నిన్నెప్పుడూ నే నొక కంటితో కనిపెట్టి చూస్తూంటానులే!" అని చెప్పి భరవసా ఇచ్చి మాయమైపోయింది.

సుందరి పొద్దున్నే లేవగానే తండ్రితో తన కల సంగతి చెప్పి, ధైర్యం కలిగించి మెల్లిగా అతన్ని ఇంటికి పంపించివేసింది.

తండ్రి వెళ్ళిపోగానే ఆ భవనం అంతా పరకాయించి చూసేసరికి సుందరికి గుండెలో ఏదో దిగులు పట్టుకుని దిగలాగుతున్నట్లయింది. ఇకమరి ధైర్యం చిక్కబట్టలేక ఒక మూల కూర్చుని బావురుమని ఏడ్చింది.

కాని మళ్ళీ అంతలోనే గుండె రాయి చేసికొని లేచి నుంచుని ఆ భవనం నాలుగు మూలలా ఏమేమి చిత్రమైన వస్తువులున్నాయో అని పరిశీలించడానికి బయలుదేరింది.

అలాగ తిరుగుతూంటే ఎదురుగుండా ఒక తలుపుమీద "సుందరి గది" అనే అక్షరాలు తళతళా మెరిశాయి. 'ఇదేమిటా!' అని ఆ గది తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళింది. ఆ గది లోపలికి వెళ్ళి నాలుగుమూలలు చూసేసరికి ఆమె కళ్ళు చెదిరిపోయాయి!

ఒకమూలగా రత్నకంబళీమీద

ఒక బంగారువీణ కనిపించింది. చల్లని పిల్లగాలి విసిరినప్పుడల్లా ఆ వీణతీగలు కదిలి చక్కని సంగీతం బయలుదేరుతూంది. మరి ఒకపక్కగా ఒక పెద్ద బీరువాలో ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన పుస్తకాలు అందంగా అమర్చబడి ఉన్నాయి. మరి ఒకపక్క పాలరాతితో తయారుచేసిన ఒక బల్ల, దానిమీద ఎన్నెన్నో నగలు, రంగురంగుల అత్తరువుసీసాలు నిలువుటద్దము మొదలైనవన్నీ కనిపించాయి. ఆపక్కగా నాలుగైదు మొఖమలు సోఫాలు, దోమ తెరలో తళతళ మెరుస్తూన్న పందిరిపట్టె మంచము, బల్లమీద ఉంచిన ఫలహారాలు మొదలైనవన్నీ ఆప్యాయంగా దగ్గిరికి రమ్మని పిలుస్తూన్నట్లున్నాయి.

సుందరి మొదట ఇదంతా నిజమా? కలా? అని ఆశ్చర్యపడింది.

ఇంతలో ఆమెకు ఒక మూల బల్లమీద తెరిచివుంచిన గులాబీ రంగు పుస్తకం ఒకటి కనిపించింది. సుందరి ఆ తెరిచిన పుస్తకంలో ఏమి ఉన్నదో చూదామని అక్కడికి వెళ్ళింది. ఆ పుస్తకంలో ఆమెకీ పాట కనిపించింది.

"అందాలే రూపొందిన బాలా!
సుందరి! నీకీ శోక మ్మేలా!
అందర మిక నీకై దాసులమై,
అందలమున నిన్నలరించెదమే!
కుందరదన! నీకోరికలన్నీ
అందుకొందు వీ అద్దంలోనే!
మందారం! చేమంతీ! జాజీ!
సుందరి! నీకీ శోకమ్మేలే!'

ఈ పాట చదివి తలెత్తి చూసే



సరికి సుందరికి ఎదురుగా ఒక అద్దం ప్రత్యక్షమైంది. మొదట సుందరి 'నిజంగా ఇదీ ఇలాగ జరుగుతుందా?' అని ఆశ్చర్యపడింది. మళ్ళీ తనలో 'ఇప్పుడు పాపం! నాన్నగారింటిదగ్గిర ఎలాగ ఉన్నారో! ఒకసారి ఈ అద్దంలో కనిపిస్తే బావుండును!' అని అనుకుంది.

వెంటనే ఆ అద్దంలో ఆమెకు గుర్రంమీద అప్పుడే ఇంటికి చేరుకున్న ధనగుప్తుడు కనిపించాడు.

అత డింటికి చేరుకోగానే అన్నలు అక్కలు అతనికి ఎదురుగావచ్చారు. ధనగుప్తుడు ఉసూరుమంటూ గుర్రంమీదనించి దిగి కొడుకులతోను, కూతుళ్ళతోను బ్రహ్మరాక్షసుడి సంగతులన్నీ పూసగుచ్చినట్లు చెబుతున్నాడు. సుందరి తండ్రిని చూచి 'అమ్మయ్యా!' అనుకుంది. అంతలోనే ఆ అద్దంలో ఆ కనబడేదంతా మాయమైపోయింది!

ఇదంతా చూసి సుందరి బ్రహ్మ



'భారతమాత'

శ్రీ వి. శేషసౌందరరాజ్ గారు (మద్రాసు) గీసిన ఒంటిగీతబొమ్మ

★ సుందరి ★

రాక్షసుడు తలుచుకుంటే చెయ్యలేని పని ఏమీ లేదనీ, పైకి భయంకరంగా కనిపించినా అతనిది చాలా జాలిగుండె అనీ అనుకుంది.

మధ్యాహ్నం అయ్యేసరికి ఆమె గదిలో రత్నకంబళీమీద బంగారు పళ్ళెము దానిలో అమర్చిన భోజన పదార్థాలు కనిపించాయి. అవి కనబడగానే సుందరికి మరింత సంతోషం కలిగింది. ఆమెఅక్కడ కూర్చుని భోజనం చేస్తూంటే ఆ పక్కగానున్న వీణ కమ్మగా పాట పాడింది. ఆమె హాయిగా ఆ పాట వింటూ విందారగిస్తూంది. ఇంతలో అడుగుల చప్పుడు వినిపించింది. వెంటనే వెనక్కి తిరిగి చూసింది. ఎదురుగా బ్రహ్మరాక్షసుడు ప్రత్యక్షమయ్యాడు!

రాక్షసుడు నెమ్మదిగా లోపలికి వచ్చి సుందరికి ఎదురుగా ఒక సోఫామీద కూర్చుని నెమ్మదిగా ఇలా గన్నాడు!

"సుందరీ! నేనుకూడా నీపక్కని కూర్చుని ఫలహారం చెయ్యనా?"

"నీ యిష్టం!" అంది సుందరి భయపడుతూ.

ఆపైన రాక్షసుడు "సుందరీ ఇక్కడ నాయిష్టం ఏమీలేదు! ఈ భవంతి కంతటికీ నువ్వే రాణివి! నువ్విక్కడ ఉండమంటే ఉంటాను. లేకపోతే లేచిపోతాను!...చెప్పు మరి! నీపక్కని కూర్చోమన్నావా? వెళ్ళిపొమ్మన్నావా?" అన్నాడు.

సుందరికి కొంచెం భయం తగ్గింది. అందుచేత రెప్ప వాల్చకుండా రాక్షసుడికేసి చూస్తూ "కూర్చో" అంది. రాక్షసుడు సోఫా ఆమె పక్కకి లాక్కుని కూర్చున్నాడు.

ఈలోగా సుందరి భోజనం అయిపోయింది.

రాక్షసుడు సుందరితో మెల్లిగా "నన్ను చూస్తే నీకు భయం వేస్తూందా?" అన్నాడు.

"మొట్టమొదట నిన్ను చూసి జడుసుకున్నాను.........అప్పుడు నువ్వింత మంచివాడ వనుకోలేదు"

ఈమాటలకు రాక్షసుడు చాలా సంతోషించాడు. తరవాత పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టి "ఎంత మంచి వాణ్ణయితేనేం! నన్నంతా చూసి జడుసుకుంటారు!" అన్నాడు.

సుందరి "ఇంక నేను నిన్ను చూసి జడుసుకోనులే!" అంది.

"నిజంగా!"

"నిజంగానే!"

"అయితే నిన్నొకటి అడగనా?"

"ఏమిటది!"

"ఒప్పుకుంటానంటే చెబుతాను మరి!"

"ఏమో! బాబూ! ముందు చెబితేనే గాని నే నొప్పుకోను!"

"అయితే అల్లాగే చెబుతాను! విను మరి!"

తరవాత బ్రహ్మరాక్షసుడు కొంచెంసేపు రెప్ప వాల్చకుండా సుందరికేసి చూసి "సుందరీ నే నీ ఇంటిలో ఒక్కణ్ణే ఉండలేకపోతున్నాను! నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవూ? పెళ్ళి చేసుకుని మనం ఇద్దరం హాయిగా ఈ ఇంట్లో ఉందాం!" అన్నాడు.

ఆ మాటలనేసరికి సుందరి అదిరిపడి లేచినుంచుని, తల వంచుకుని బొటనవేలితో నేలమీద రాస్తూ అతనికేసి బెదురుచూపులు చూసింది.

బ్రహ్మరాక్షసుడు సుందరి చెవిలో మెల్లిగా "ఏం సుందరీ! నన్ను పెళ్లి చేసుకోవూ?" అంటూ బతిమాలుకున్నాడు.

సుందరి అల్లాగే కొంతసేపు నిలబడి "నిన్ను చూస్తే నాకు భయం వేస్తూంది! బాబూ!" అంది.

ఆ మాటనగానే రాక్షసుడు ఉసూరుమని కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

ఇంచుమించుగా ప్రతీరోజూ ఇలాగే జరుగుతూండేది. సరిగా సుందరి భోజనం పూర్తి చేసేవేళకి ఆ రాక్షసుడక్కడికివచ్చి ఎంతో దీనంగా సుందరిముందు మోకరించి పెళ్ళి చేసుకోమని బతిమాలుతూండేవాడు. అలాగ ఆరు నెలలు గడిచిపోయాయి. మళ్ళీ ఒకనాడు రాక్షసుడామెముందు మోకరించి పెళ్ళి చేసుకోవలిసిందని బతిమాలుకున్నాడు.

ఈసారి సుందరి వలవల ఏడవడం మొదలుపెట్టింది. బ్రహ్మరాక్షసుడు లోలోపల ఎంతో నొచ్చుకుని "ఎందుకు సుందరీ అలాగ ఏడుస్తున్నావు!" అన్నాడు.

"ఏమీ లేదు!"

"భయం లేదులే! నిజంచెప్పు!"

"ఏమీ లేదు! నీ అంత మంచివాణ్ణి నే నెక్కడా చూడలేదు... నిన్ను పెళ్లాడాలనే ఉంది... కాని నీ కోరలు చూస్తే నాకు భయం వేస్తోంది...మరి!"

ఈ మాటలు విని బ్రహ్మరాక్షసుడు ఎగిరి గంతేసి "నీ కంత భయంగా ఉంటే పోనీలే! సుందరీ! నువ్విక్కడే ఉండి నా కళ్లకి కనిపిస్తూంటే అదే నాకు పదివేలు!" అన్నాడు.

ఆమర్నాడు సుందరి, తండ్రి ఎలాగున్నాడో అని ఎదురుగా ఉన్న అద్దంలో చూసింది. ధనగుప్తుడు చాలా జబ్బుపడి చిక్కి శల్యమై చావుబతుకులమీద ఉన్నాడు. పాపం! అతని అవస్థ చూసి సుందరి చాలా బాధ పడింది.

ఇంతలో సాయంత్రం భోజనాల వేళ యేసరికి బ్రహ్మరాక్షసుడక్కడికి వచ్చాడు. సుందరి అతనితో ఇలా గంది:

"మా నాన్నకి చాలా జబ్బు చేసింది. నా కక్కడికి వెళ్లి ఒకసారి చూసిరావాలని వుంది. మరి నన్ను పంపించకపోతే నీ ఎదురుగానే ఉరిపోసుకుని చచ్చిపోతాను! అంతే...నన్నొకసారి అక్కడికి పంపించవూ?"

దానిమీద రాక్షసుడు "నువ్వెంక ఉరిపోసుకుని చచ్చిపోవడం ఎందుకు లే! నీ కంతగా వెళ్లాలని ఉంటే ఇప్పుడే వెళ్ళిపో! నీకోసం బెంగబెట్టుకుని నీ బదులు నేనే చచ్చిపోతానులే!" అన్నాడు.

ఆ మాటమీద సుందరి ఇలాగంది: "అలాగనవద్దు! నువ్వు చాలా మంచివాడవు! నువ్వే చచ్చిపోతే నాకీ ప్రపంచకంలో మరింక ఎవరున్నారు? నేను మాత్రం బతుగుతానా? దానికేంగాని శుభమల్లే ఇవేం మాటలు! నేను ఇంటికి వెళ్లాక ఒక వారంపది రోజులుండి మళ్లీ వెంటనే ఇక్కడికి వచ్చేస్తానులే! అక్కలిద్దరు పెళ్లిళ్లు చేసుకుని అత్తవారిళ్లకు వెళ్ళిపోయారుగదా! అన్నయ్యలందరు సిపాయీలై యుద్ధానికి వెళ్ళిన సంగతి నాకీ అద్దం మూలంగానే తెలిసింది. పాపం! మా నాన్నదగ్గర ఎవ్వరూ లేరు. అందుచేత ఒక్క వారంరోజులుండి మళ్ళీ తిరిగి వచ్చేస్తాను. నీ కింతైనా పుణ్యం ఉంటుంది. నన్ను వెళ్లనీ!"

ఇలాగ సుందరి బతిమాలిన తర్వాత బ్రహ్మరాక్షసుడి మనస్సు కరిగింది. కొంతసేపటివరకు అతడు ఏమీ అనలేక మాట్లాడకూరుకుని ఒక్క పెద్ద నిట్టూర్పువిడిచి ఇలాగన్నాడు.

"సరే! సుందరీ! నువ్వు అంతగా బెంగపెట్టుకున్నావు కాబట్టి వెళ్లిరా! అయితే వారం పది రోజులకంటె ఎక్కువ ఉన్నావంటే—నీ కోసం

★ సుందరి ★

బెంగ పెట్టుకుని నే నిక్కడ ఇలాగే కుమిలి కుమిలి చచ్చిపోతాను! ఇది ముమ్మాటికీ నిజం!

నువ్వు ఇంటికి వెళ్లాలంటే ఏమీ కష్టపడక్కరలేదు. నీ కుడి చేతనున్న ఉంగరం తీసి ఎడమచేతికి పెట్టుకున్నావంటే—కళ్లు మూసి తెరిచే లోగా మీ యింటిదగ్గర ఉంటావు! మళ్ళీ ఇక్కడికి రావాలంటే—ఎడమచేతనున్న ఉంగరం కుడిచేతికి పెట్టుకో! వెంటనే ఇక్కడ వాలతావు! ఇది మాత్రం మరిచిపోకు! నువ్వు వారం పది రోజులకంటే ఎక్కువ రోజులు మీయింటిదగ్గిర ఉన్నావంటే మరి నేను బతగను సుమా!—ఆపైన నీయిష్టం!"

ఇలాగ వెళ్లనిస్తాన్నందుకు సుందరి లోలోపల చాలా సంతోషించింది. కాని బ్రహ్మరాక్షసుణ్ణి విడిచిపెట్టి వెళ్లిపోతే అతడు తన కోసం ఎంత బెంగ పెట్టుకుంటాడోనని లోలోపల చాలా బాధపడింది. అయినా ఒకవారం పదిరోజులలో తండ్రిని చూచి రావచ్చుననే ఉద్దేశంతో ఉదయమే ఉంగరం మార్చి ఇంటికి వెళ్లి పోయింది.

ఇంటికి వెళ్లగానే ధనగుప్తుడు సుందరిని చూసి చాలా సంతోషించాడు. ఆమెను చూడగానే అతని జబ్బంతా ఒక్కసారిగా నయమయి పోయినట్లయింది. తరవాత నాలుగైదు రోజులు గడిచాయి. సుందరి అక్కలిద్దరూ కూడా తండ్రిని చూడడానికి వచ్చారు. సుందరిని చూడగానే వాళ్లిద్దరు మూతి ముడుచుకుని చేతులు తిప్పుకుంటూ "వచ్చిందమ్మా! సంగనాచి!" అని ఈపడింపు మాటలాడారు.

పాపం! సుందరి ఇంటికి వచ్చేటప్పుడు ఆట్టే చీరలు అవీ తెచ్చుకోలేదు. వట్టి కట్టు బట్టలతో తొందర తొందరగా వచ్చేసింది. ఇక్కడ ఉన్నన్నాళ్లు చీరలు లేవే అనుకుంటూంటే-ఆమె కెదురుగుండా ఒక పెట్టె కనబడింది. ఆ పెట్టె తెరిచేసరికి అందులో అన్నీ సిలుకు చీరలే! వాటిలో ఒక మంచి చీర తీసి కట్టుకుంది. మిగిలినవి అక్కలిద్దరికీ ఇద్దామనుకుంది. తీరా అవి పైకి తీసేసరికి చేతిలో చీరలు చేతిలోనే మాయమై పోయాయి! ధనగుప్తుడది చూసి "బ్రహ్మరాక్షసుడికి ఆ చీరలు నువ్వు తప్ప ఇంకెవ్వరు కట్టుకోకూడదని అనుకున్నాడేమో!" అన్నాడు.

ధనగుప్తుడి పెద్ద కుమార్తెలిద్దరికీ పెద్ద సంబంధాలు వచ్చాయన్నమాటే గాని పెళ్లయిన తరవాత నిజంగా వాళ్లు ఒక్కరోజు సుఖపడలేదు.

పెద్దమ్మాయి భర్త చాలా అందంగా ఉంటాడు. అతగాడు పొద్దస్తమానం తనందం చూసుకుని కన్నుమిన్ను కానకుండా తిరుగుతూ తన అందానికి భార్య తగదని అస్తమానము ఆమెను దగ్గిరికి రాకుండా దూరంగా కొట్టేసేవాడు.

రెండో అమ్మాయి భర్త అందమైనవాడే. పైగా బాగా చదువుకున్నాడు కూడాను. ఆగర్వం కొద్దీ అందరినీ తెలివితక్కువ దద్దమ్మలని అంటూడే వాడు. భార్యను చదువురాని మొద్దని తిట్టిపోసేవాడు.

ఈ అక్కలిద్దరు సుందరి బ్రహ్మరాక్షసుడి ఇంట్లో అంత సుఖంగా ఉన్నదని తెలుసుకుని లోలోపల చాలా అసూయపడ్డారు. ఆమె వాళ్లని ఆప్యాయంగా చూసినకొద్దీ వాళ్లకి ఆమెమీద అక్కసు పెరిగి పోతూండేది. అయినా వాళ్లేమీ అనకుండా ఆమె వాళ్లంటే ఎంతో ఇష్టంగానే ఉండేది.

ఇలాగ ఉండగా ఆ అక్కలిద్దరు సుందరి నెలాగయినా ఏడిపించి బాధ పెట్టాలని ఏవో పన్నాగాలు పన్నుతూండే వారు.

ఒకనాడు పెద్దమ్మాయి రెండో అమ్మాయిని దగ్గిరికి పిలిచి ఇలాగ చెప్పింది. "సుందరిని బాధ పెట్టడానికి నాకో ఉపాయం తోచిందే! వారం పది రోజుల్లో తప్పకుండా తిరిగి రమ్మని బ్రహ్మరాక్షసుడు దీనితో చెప్పాడు గదా! ఇది పదిరోజుల్లో తిరిగి వెళ్లకుండా మనమొక ఉపాయం పన్నుదాము. సుందరి అన్నరోజుకు తిరిగి రాక పోయేసరికి ఆ బ్రహ్మరాక్షసుడు మండిపడి దీని నింట్లోనించి వెళ్లగొట్టేస్తాడు! దానితో దీనిరోగం చప్పగా కుదిరిపోతుందిలే!"

రెండో అమ్మాయి "అవునేవ్! ఇది మహామంచి ఉపాయం! అయితే మనం ఇంక సుందరి మీద చాలా ఇష్టంగా ఉన్నట్లు నటించాలి సుమా!" అంది.

తరవాత అక్కలిద్దరు సుందరి మీద ఎంతో ప్రేమ ఉన్నట్టు

పటించడం మొదలుపెట్టారు. ప్రతీ పనిలోను ఆమెకు సహాయం చేస్తూ ఎంతో ఆప్యాయంగా పలకరించే వారు. పాపం! సుందరి ఇందంతా నిజమే అనుకుని "అక్కలిద్దరికీ తన మీద దయకలిగింది గదా!" అని ఎంతో సంతోషించింది.

ఇలాగ వారం పదిరోజులు గడిచిపోయాయి. సుందరి అక్కడ ఉన్నన్నాళ్లు బ్రహ్మరాక్షసుణ్ణి తలుచుకోని గడియ లేదు. అతని మంచితనము, తనమీద చూపించిన దయ తలుచుకుంటుంటే ఆమెకు కళ్లమ్మట నీళ్లు వచ్చేవి. అఖరికి పదోరోజు కూడా గడిచిపోయేసరికి ఇక బ్రహ్మరాక్షసుడి భవంతికి తిరిగి వెళ్లిపోవాలని మూటముల్లె సర్దుకోడడం మొదలు పెట్టింది.

ఇంతలో అక్కలిద్దరు సుందరిదగ్గిరికి వచ్చి ఎంతో ఆప్యాయంగా "అప్పుడే వెళ్లిపోతే ఎలాగ చెల్లాయీ! మనం అంతా కలుసుకుని ఎన్నాళ్లో అయిందయిరి! మళ్లీ ఎన్నాళ్లకు కలుసుకుంటామో! ఏమో! ఇంకొక్క వారంరోజుల పాటుండి వెళ్లమ్మా!" అని గడ్డం పట్టుకుని బతిమాలారు. సుందరి ఎన్ని విధాల చెప్పినా వాళ్లు వినిపించుకోలేదు. ఆమె ఇక చేసేదేమీలేక ఇంకొక వారంరోజుల పాటుండి వెళదామని నిశ్చయించుకుంది.

ఆవేళ రాత్రి పనీ పాటాముగించుకుని బ్రహ్మరాక్షసుణ్ణి తలుచుకొంటూ నిద్రపోయింది. ఆనిద్రలో ఆమెకొక కల వచ్చింది. ఆకలలో తాను మళ్లీ భవంతికి తిరిగి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఎక్కడా బ్రహ్మరాక్షసుడు కనబడలేదు. వెతకగా వెతకగా బ్రహ్మరాక్షసుడొకచోట ఉద్యానవనంలో కొలని గట్టున పచ్చికమీద చిక్కి శల్యమై పడి ఉన్నాడు!

కలలో అతడా విధంగా కనబడేసరికి సుందరికి వెంటనే మెలుకువ వచ్చింది. తొందరగా లేచికూర్చుని ఇలాగనుకుంది "పాపం! బ్రహ్మరాక్షసుడు నాకోసం ఎంతగా బాధపడుతున్నాడో! వస్తానన్న రోజుకి వెళ్లక నేనతనికి చాలా కష్టం కలిగించాను. ఎన్నాళ్లనించో నన్ను పెళ్లి చేసుకోమని బతిమాలుతున్నా నేను వట్టి కటికిదాన్నై పోయి పెళ్లాడనని చెప్పి అతని మన

★ సుందరి ★

స్సుకి నొప్పికలిగించాను నేనుభవంతికి తిరిగివెళ్లగానే తప్పకుండా అతన్ని పెళ్లి చేసుకుంటానని చెప్పివేస్తాను. అందం మనస్సుకి ఉండాలిగాని ఒంటికి లేకపోతేనేం? మనుష్యులు అందంగా ఉండి దుర్మార్గులయితే ఆ అందంవల్ల ఉపయోగమేమిటి? అక్కలిద్దరు అందంగాఉన్న బావలతో ఏమి సుఖపడుతున్నారు!"

ఈవిధంగా పరిపరి విధాల ఆలోచిస్తూ లోలోపల ఎంతో మథనపడింది. తెల్లవారేదాకా సుందరికి కంటి నిద్రే పట్టలేదు. అలాగే మేలుకుని తెల తెల్లవారే వేళ ఎడంచేతి వేలికి పెట్టకున్న ఉంగరం మళ్లీ కుడిచేతి వేలుకు మార్చుకుంది. వెంటనే కనురెప్ప పాటు కాలంలో భవంతి ఆవరణలో వాలింది!

బ్రహ్మరాక్షసుడి కింకతనెంతో అందంగా కనబడాలని సరికొత్త చీర కట్టకుని బాగా సొగసుగా ముస్తాబై అతడు ఉండే గది లోపలికి వెళ్లింది. అతనక్కడ కనబడలేదు. ఆ భవంతి నాలుగు మూలలా కలయజూసింది. ఎక్కడా అతనిజాడ కనబడలేదు. గట్టిగా గొంతెత్తి పిలిచింది. ఏమీ లాభం లేక పోయింది. చివరికి కలలో కనబడినట్టు కొలనిగట్టునే పడిఉన్నాడేమో నని గబగబా అక్కడికి పరిగెత్తింది అనుకున్నట్లుగా ఆ రాక్షసుడా కొలనిగట్టున పచ్చిక మీద పడుకుని అటూ ఇటూ దొర్లుతూ మూలుగుతున్నాడు.

అతడల్లాగ కనబడేసరికి సుందరికి పట్టరాని దుఃఖం వచ్చింది. వెంటనే కొలననీరు దోసిళ్లతో తీసుకువచ్చి అతని మొహం మీద చల్లింది. అతని శరీరం అప్పుడు అతి భయంకరంగా ఉన్నా లక్ష్యపెట్టక గుండెలమీద చెయ్యివేసి చూసింది. గుండెలింకా మెల్లి మెల్లిగా కొట్టుకుంటున్నాయి. సుందరి ధైర్యం తెచ్చుకుని అతని కనేక విధాలుగా ఉపచారాలు చేసింది.

కొంతసేపటికి బ్రహ్మరాక్షసుడు కళ్లు తెరిచి పక్కనుండి ఉపచారాలు చేస్తూన్న సుందరివైపు రెప్ప వాల్చకుండా చూసి ఇల్లాగన్నాడు.

"సుందరీ నీవు తిరిగి వస్తావేమోనని నీకోసం కళ్లు కాయలు కాచేటట్టు చూచాను. నువ్వు అన్న రోజుకి తిరిగిరాలేదు. అప్పటినించీ అన్నం, నీళ్లు ముట్టడం మానేసి ఇల్లాగే ఈ చెరువు గట్టనపడి దొర్లుతూ నీకోసం ఎదురుచూస్తున్నాను. పోనీ! కళ్లారా! నిన్నొకసారి చూసుకున్నానుగదా! నాకిది చాలు! ఇంక హాయిగా చచ్చిపోతానులే!"

ఈమాటలు విని సుందరి వలవల ఏడుస్తూ "ఇది ఎన్నటికీ జరగదు, నేను నిన్ను పెళ్లిచేసుకుంటాను! నీకు జబ్బు నయంఅయి మళ్ళీ ఆరోగ్యంగా ఉంటావు. మనం ఇద్దరం ఈభవంతిలో హాయిగా కాలక్షేపం చేస్తూ సుఖంగా బతుకుతాము!" అంది.

తరవాత ఎంతో ఆప్యాయంగా అతని నుదురు ముద్దుపెట్టుకుంది.

వెంటనే ఆఉద్యానవనం అంతా పచ్చని మామిడి తోరణాలతో కల కల్లాడింది. భవంతి హాలులో నించి ఒక్కసారిగా వెయ్యి వీణలు మోగుతూన్నట్లు తియ్యని సంగీతం వినిపించింది. సుందరి రాక్షసుడికేసి ఎంతో ఆప్యాయంగా చూస్తూ అల్లాగే కూచుండి పోయింది.

కాని అలా చూస్తూండగానే ఆమె కళ్ల ఎదటే ఆ బ్రహ్మరాక్షసుడు మాయమైపోయాడు! సుందరి ఇదేమిటని నిర్ఘాంతపడి నాలుగు వైపులా వెతకడం మొదలుపెట్టింది. ఇంతలో హఠాత్తుగా ఆమె కళ్లకెదురుగుండా ఒక చక్కని రాజకుమారుడు ప్రత్యక్షమైనాడు!

ఆరాజకుమారుడు వెంటనే ఆమెతో "సుందరీ! నన్ని భయంకరమైన శాపంలోనించి విడిచిపించి చక్కని రాజకుమారుణ్ణిగా మార్చివేశావు! నీ మేలెన్నటికీ మరవలేను!" అన్నాడు.

సుందరి కంగారుపడుతూ "మీ



రెవరు? మిమ్మల్ని నేను శాపంలో నించి విడిపించడ మేమిటి? నా బ్రహ్మరాక్షసు డేమైనాడు!" అని అడిగింది.

ఆ ప్రశ్నకా రాజకుమారుడిలాగ సమాధానం చెప్పాడు—

"ఆ బ్రహ్మరాక్షసుణ్ణి నేనే. ఒక దేవతకి నామీద ఒళ్లెరగని కోపం వచ్చి "నీవు బ్రహ్మరాక్షసుడవై పోతావు! అని శపించింది. అప్పుడు నే నామె కాళ్లమీదపడి బతిమాలుకున్నాను. ఆమె నామీద దయదలిచి ఒక గొప్ప అందగత్తె నిన్ను పెళ్లిచేసుకుంటానంటే నీకు శాప విమోచనం కలుగుతుంది" అని చెప్పింది. సుందరీ! నేనెంత అందవికారంగా ఉన్నా నీవు మనసారా నన్ను పెళ్లాడడానికి అంగీకరించావు. నీ ఉపకారం నేనెన్నటికీ మరవలేను! ఈ క్షణంనించి నాజీవితము నాభవంతి నాసంపత్తు-అన్నీ నీవే!"

ఆ రాజకుమారు డిలాగ తన వృత్తాంతం అంతా చెబుతూంటే సుందరి మరి తనకళ్లే నమ్మలేకపోయింది. అతడామె చెయ్యి పట్టుకుని మెల్లిగా నడిపించుకుంటూ ఆభవంతిలోకి తీసుకు వెళ్లాడు.

అక్కడికి వెళ్లేసరికి సుందరి తండ్రి, అక్కలు, అన్నలు అంతా ప్రత్యక్షమైనారు. సుందరి వారందరినీచూసి మరింత సంతోషించింది.

ఇంతలో సుందరికి వెనక, కలలో కనిపించిన దేవతే మళ్లీ ప్రత్యక్షమై ఇలాగ ఆశీర్వదించింది.

"సుందరీ, నీవు చాలా అదృష్టవంతురాలవు. ఇంతటి గుణవంతురాలవు కనకనే నీకిలాంటి భర్త దొరికాడు. లోకంలో అందంకంటె గుణాలే గొప్పవి.

నీగుణాలవల్ల, ప్రేమవల్ల బ్రహ్మరాక్షసుడు చక్కని రాజకుమారుడుగా మారిపోయాడు. నీవింక నీభర్తతో కలిసి సుఖంగా కాపరం చేస్తూ, గుమ్మడి పళ్లవంటి పిల్లల్ని కంటావు! మీయిద్దరు ఆభవంతిలోకి వెళ్ళి సుఖంగా ఉండండి!"

ఆతరవాత ఆదేవత సుందరి అక్కలకేసి తిరిగి ఇలా గన్నది. "మీరు తలపెట్టిన దుర్మార్గాలన్నీ నేనొక కంట కనిపెడుతూనే ఉన్నాను. సుందరి ఇంత సుఖంగా ఉండడమే మీకొక శిక్ష. ఈభవంతి ద్వారానికి రెండువైపులా మీరిద్దరు రెండు శిలా విగ్రహాలై నిలబడతారు. కాని మీరుచేసిన పనికి మనసారా పశ్చాత్తాప పడితే మళ్ళీ మనిషి స్వరూపాలు వస్తాయి. పశ్చాత్తాప పడకపోతే ఇక మీ ఖర్మ ఇంతే!"

వెంటనే ఆదేవత చెప్పినట్టుగా జరిగిపోయింది. సుందరి, రాజకుమారుడు చెట్టాపట్టాలు వేసుకుని భవంతిలోకి వెళ్లిపోయారు. వెంటనే దేవత కూడా మాయమైపోయింది. కథకూడా కంచికి వెళ్లిపోయింది.

అయిపోయింది.

['బ్యూటీ అండ్ ది బీస్ట్' అనే కథకు స్వేచ్ఛానుసరణం]

★

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

(31-వ పేజీ తరువాయి)

వారితోనే కలిసికట్టుగా వుండటానికి ప్రయత్నిస్తుంది.

అన్ని జంతువులూ ఒకే మాదిరిగా మనుష్యులకి మచ్చిక అవటానికి ఒప్పుకోవు. తల్లిపై ఎక్కువ కాలం ఆధారపడి వుండే తత్వం ఏజంతువులో వుంటుందో ఆజంతు సంతానం అవలీలగా మనుష్యులకి మచ్చిక అవుతుంది.

శాఖాహారులైన జంతువుల సంతతి తల్లిపై అట్టే కాలం ఆధారపడి వుండదు. ఆవుదూడలకీ, గేదెదూడలకి పసితనం త్వరత్వరగా వదిలిపోతుంది. భూమిమీద పడిన కొద్ది రోజుల్లోనే వాటికి స్వతంత్రంగా బ్రతుకగల శక్తి వచ్చేస్తుంది.

మాంసాహారులైన జంతువుల విషయం అల్లాక్కాదు. శాఖాహారుల తత్వానికి వీటి తత్వం పూర్తిగా విరుద్ధంగా వుంటుంది. ఈజంతువులకు పసితనం పోవటానికి ఎక్కువ కాలం పట్టుతుంది. అందుకని యివి ఎక్కువ కాలం తల్లులను అంటిపెట్టుకొని వుంటాయి.

అదీకాక-తల్లి పోషణపై ఎక్కువ కాలం ఆధారపడివుండే జంతువుల్లో ప్రేమాభిమానాలకు ఎక్కువ అవకాశం వుంటుందనుకోవటానికి వీల్లేదు. కాకపోగా - అవసరం వున్నంతవరకూ తల్లి అండనుకానీ, తల్లిలాంటి వారి అండను కానీ పోగొట్టుకోకుండా వుండటంకోసం అవి చేసే ప్రయత్నాలలో వాటి తెలివితేటలు, శాణాతనమూ బయటపడుతాయి.

(ఇంకావుంది)



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సువారి "పెంపుడుకొడుకు"లో సావిత్రి.



జయంతి వారి "బంగారు భూమి" లో రామచంద్రన్, అంజలీదేవి.

ఇటాలియన్ చిత్రాల్లో వాస్తవికత

శ్రీ మునిపల్లె రాజు

గో॥ పాలక్రిష్ణకేస్కర్ గారు భారత [illegible] మంత్రిగా నియమింపబడిన నాటినుంచీ, నైతికపతనంలో వున్న [illegible] సముద్ధ రించటానికి మంచి చిత్రాల అవసరం ఎంతైనా వున్నదని — కొంత అందోళనా గానేనా, కొంత సూచనలుగానేనా, కొంత ప్రయత్నపూర్వకంగానేనా, ఈ విష యం [illegible] చిత్రాలు [illegible] ప్రజల్ని [illegible] [illegible] [illegible] [illegible] సూచనలను విరచ్ఛిన్నం చేసింది. శ్రీ కేస్కర్ పై ఫిలిం పాత్రికేయ పత్రికలన్నీ [illegible] ప్రచారం సాగించాయి.

నేటిరంగంలో పలుకుబడిగల్గిన్న మేధావులు, ఖ్యాతిగాంచిన సంఘ సంస్కర్తలు, ఉపాధ్యాయబృందం, వైజ్ఞానిక ప్రగతికి కృషి చేస్తున్న ప్రముఖులూ, రచయితలూ శ్రీ కేస్కర్ గారితో సంపూర్ణంగా ఏకీభ వించటమే గాక, ఆయనను పూర్తిగా బల పరుస్తున్నారు. సినిమా దుష్ప్రవృత్తి పోస్తున్న దుర్లాలసల బలహీనతలను, [illegible] దౌర్బల్యాలను, పేరేపిస్తున్న [illegible] [illegible] యీ దురదృష్టాల నుంచి నైతికపతనానికి బాటలు వేస్తున్న సినిమా చిత్రాలను సృష్టించి, [illegible] లాభాలు గడిస్తున్న ఫిలిం [illegible] [illegible] శ్రీ కే.

మనం ఏ కోణం నుంచి [illegible] నిజమైన చిత్రాల [illegible] యీ దుష్ప్రచారమే [illegible] ప్రజాభిప్రాయాన్ని [illegible] అని, శ్రీ కేస్కర్ గారి ఒక [illegible] కింపటమే యిక్కడ నా ముఖ్యోద్దేశం.

మనకు [illegible] చిత్రాల్లో నూటికి 80 పాళ్ళు [illegible] 20 శాతంలో ఎన్నిక [illegible] చిత్రాలు. చాలా కొద్ది [illegible] యీ [illegible]



రోహిణీ వారి "బిడ్డల ఆస్తి" లో వ్యసనాలు మరిగిన రఘుగా మాస్టర్ సుధాకర్

ఇక్కడ కేస్కర్ గారు ఒక అమూల్యమైన సూచన చేశారు. ఇకనుంచీ మనం దిగుమతి చేసుకొనే చిత్రాలు ఎక్కువభాగం, యూరప్ ఖండ దేశాల చిత్రాలయితే, దేశ కల్యాణానికి కొంతవరకైనా తోడ్పడగలవనే - యీ సూచన.

ఈ సూచనకెనుక బలమైన కారణాలున్నాయి. అమెరికన్ చిత్రాలు ప్రజా జీవితానికి దూరమైనవి. వాస్తవికతకు, మానవికోన్నత్యానికి, విజ్ఞాన స్ఫురణకు - చాలా అమెరికన్ చిత్రాలు బద్ధశత్రువులుగా వున్నాయి. ముఖ్యంగా హత్యా చిత్రాలు, అమెరికాలో పెట్టుబడిదారీ కేంద్రీకరణపద్ధతి వృద్ధిచేసిన మహానగరాల్లో జరిగే దోపిడివర్గాలను పరోక్షంగా పొగిడే చిత్రాలు, అవి యివిగాక - విహ్వారుతున్న మనస్సులతో, వువ్విళ్ళూరుతున్న కోర్కెలతో సినిమాల కెగబడే మన యువతీ యువకుల్ని, విద్యార్థిసమాజాన్ని - చౌకరకపు సెంటిమెంట్లతో, అబద్ధపు మానవత్వ విలువల్లో - పెడమార్గం పట్టించ గలిగిన సెక్సు బూతుచిత్రాలు - యీ 80 పాళ్ళలో 75 పాళ్ళుగా వుంటున్నాయ్.

ఇకపోతే యూరప్ ఖండచిత్రాలు. వీటి ప్రత్యేకతను భారతదేశీయ చిత్రాభివృద్ధికి ఒక వుదాహరణగా వుంచుకొని, మంచి చిత్రాలను సృష్టించమని యీ సందర్భంలోనే అనేకసార్లుగా శ్రీ కేస్కర్ గారు మన ప్రొడ్యూసర్లతో వుద్ఘాటించారు. విశిష్టమైన వాస్తవికత, మనోహ్లాదకరమైన సంస్కృతి వుట్టిపడే ఫ్రెంచి, ఇటాలియన్ చిత్రాలను యీ సందర్భంలో ఆయన దృష్టిలో వుంచుకొనే పై సలహాను యిచ్చారు.

కాని ప్రజానీకపు మనస్తత్వాలను తాము మాత్రమే గ్రహించగలమనీ, యితరుల సలహాల్లో విలువ ఏమాత్రమూ లేదనీ భావించే మన ప్రొడ్యూసర్ల కీహితవాక్కు లెట్లా నచ్చుతాయి? గుడ్డిగా హాలీవుడ్ నీచతరగతి చిత్రాలకు యింకా నీచమైన కాపీలు తీసి, బూజుపట్టిన పాత అభిప్రాయాలను కొత్త గ్లామరుతో చూపి, అర్థమూ, ఆదర్శమూ లేని మృగప్రేమను, తక్కువ అభిరుచులనూ - వేరే వైజ్ఞానిక ప్రదర్శనాలకు నోచుకోని పేద, మధ్యతరగతి ప్రజానీకం మీద వెదజల్లుతున్న ఫిలిం ప్రొడ్యూసర్లు ప్రజాభిరుచులకు తామే ధర్మకర్తలమని చాటించుకొనటం మన యీ దురదృష్టదేశం వంటి దేశాల్లోనే చెల్లుతున్నది.

కాని - మొన్న మొన్నటి - అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనలు భారత దేశపు పెద్ద నగరాల్లోని మేధావులకు యూరోపు చిత్ర సృష్టిలోని విశిష్టతను హఠాత్తుగా చవిచూపినాయి. కాని ప్రజా బాహుళ్యం యీ చిత్రాల్లో చాలావాటిని చూడటానికి అవకాశంలేదు గనుక పత్రికాముఖాన కొంత తెలిసికొనటం అత్యవసరమని భావిస్తున్నాను. ముఖ్యంగా ఇటాలియన్ చిత్రాల్లోని వాస్తవికతను ముచ్చటించటం నా ప్రధానోద్దేశం.

ఇటలీదేశపరిస్థితులు దాదాపు మనదేశపు ఆర్థిక సాంఘిక స్థితిగతులతో పోల్చదగినవి. జనాభా సమ్మర్దం ఎక్కువ. నిరక్షరాస్యత గూడా అంతే. పరిశ్రమలు ఉత్తరభాగంలో మిలాన్ వంటి ఒకటి రెండు నగరాల్లోనే వున్నవి. వ్యావసాయిక శ్రమే ముఖ్యాధారము. అజ్ఞానానికి తోడు మత గురువుల ప్రాబల్యం పలుకుబడి కొంచెం ఎక్కువ పాలుగా వుంది. ఒకనాడు మహాసామ్రాజ్యాలను నిర్మించినజాతే, ఒకనాడు సకల కళాపోషణలో ముందంజవేసినజాతే; కాని నేడు - దారిద్ర్యం, రోగం, అజ్ఞానం తాండవ నృత్యం చేస్తున్నాయి. ముసులోని ఫాసిస్టు పరిపాలన, ఆ తర్వాత రెండవ ప్రపంచయుద్ధం - వీటితో దేశపరిస్థితి మరీ తారుమారయింది. ఉన్న భారీ పరిశ్రమలు మూలబడ్డాయి. నిరుద్యోగులు వేలసంఖ్యలో ప్రతి పట్టణంలోనూ రోడ్లమీద తిరుగుతుంటారు యిప్పటికీ. వలసరాజ్యాలూ



అసోసియేటెడ్ ప్రొడ్యూసర్సు వారు నిర్మిస్తున్న తమిళ, మలయాళీ చిత్రంలో తెలుగునటి గిరిజ.

పోయాయి గనక స్వేచ్ఛ యిక శరణయింది. భూమంతా జమీందార్ల చేతిలోవుంది. వ్యవసాయ సంస్కరణలకు యీ వేళ్ళపాకి స్థిరపడిన పురాతన నిరర్థకవ్యవస్థ పెద్ద అడ్డుగా వుంది. రాజకీయపార్టీల్లో వామపక్షాలే బలమైనవయినా అధికారం, మార్పులు తీసుకురాలేని పాత పార్టీలచేతిలోనే వుంది. ప్రజా చైతన్యం అరికట్టటానికి మత గురువుల ప్రాబల్యం యీ పార్టీల కున్నది. అంటే యుద్ధానంతర నిరాశ, నిరుద్యోగ తీవ్రత, భవిష్యత్తులోపం, వర్తమానపు కాలేకడుపు, వీటన్నింటితో నైతికపతనం పొందుతున్న జాతికి - మన ఫిలిం ప్రొడ్యూసర్ల "విలువగల" అంచనాల ప్రకారం - నాలుగు డాన్సులు, ఒక డజను పిచ్చి పాటల ట్యూనులు, సెన్సును రేకొల్పే ఘట్టాలు గల అమ్మాయి - అబ్బాయి ప్రేమగాథలు నాలుగుచూపిస్తే, వాళ్లు కష్టాలు మరిచి, చిత్రం చూసినంతసేపైనా కాస్త వినోదం పొందుతారుగదా!

కాని యిటలీ అదృష్టం యిట్లా లేదు. ఆ ప్రొడ్యూసర్లు దేశ . దౌర్భాగ్యాన్ని, సామాన్య పౌరుడు దినదినమూ పొట్ట చేపట్టుకొని ఎదుర్కొంటున్న క్లిష్టతర సమస్యలన్నీ, దేశ సాంస్కృతిక సాంప్రదాయాలన్నీ, యుద్ధానంతర దీర్ఘతాన్నీ తమ చిత్రాల్లో సృష్టించి, ప్రజాజీవితాన్నే కొత్తకోణాలనించి చూపుతున్నారు. ఆ మటకి దేశమంటే వాళ్ళకెందుకో అంత అభిమానం, అంతటి ప్రేమకీ మన కట్టుబొట్టు తీసివేసి, పాశ్చాత్య నాగరికత అర అంగుళం లోతుకూడా తెలియని ఫిలిం నాయకో నాయికులకు, పారిన్ దర్జీలు అప్పుడే పార్శిల్లో పంపిన నవీన దుస్తులువేసి, పనీపాటా, వృత్తీ లేని ప్రేమ బైరాగులుగా ప్రదర్శించే మన నిర్మాతలనుండి మాతృదేశభక్తినీ, ప్రేమను అప్పిచ్చివాళ్ళు ఎంతయినా నేర్చుకోవాలి సుమా!!!


ఇక్కడ మనం కొన్ని వుదాహరణలుగా ఇటాలియన్ చిత్రాలను సమీక్షించవచ్చు. ముఖ్యంగా మొన్న మొన్నే మన ప్రాంతాల్లోగూడా విడుదలయిన "బైసికల్ దొంగలు" చూడండి. ఒక పేద కార్మిక కుటుంబం, నిరుద్యోగపు కోరల్లో చిక్కిపడే బాధలు, వుద్యోగం దొరికిం తర్వాత కార్మికుడి ఆశలు, ఆ దరిద్రనారాయణుల సమాజంలో మళ్ళీ యీ కార్మికుడి సైకిల్ దొంగతనం, దానికి ప్రతీకారంగా మళ్ళీ,

★ ఇటాలియన్ చిత్రాల్లో వాస్తవికత ★

ఆ కార్మికుడే వేరొక సైకిల్ దొంగిలించ బూనుకొని పట్టుపడటం, స్కూలుకు పోవలసిన కొడుకు తెలతెలవారుతూండగనే కూలికిపోవటం, పేదసాదల ఐహిక బాధలను గురించి పట్టించుకోని వేదాంతులు, వాళ్ళకు ఆముష్మిక సుఖం యిచ్చేందుకు చర్చీల్లో చెప్పేనీతులు, అందులోనే దొంగను పట్టుకోనేందుకు తీసుకురాబడిన పోలీసు - తల తిరుగుడు - లా పాయింట్లు - ఈ దృశ్యాలన్నీ చాలా నిరాడంబరంగా, కేవలం వాస్తవికతే దృష్టియందుంచుకొని, (అర్థహీనమైన సంభాషణలకు, నృత్యాలకు, పాటలకూ వున్న అవకాశాలన్నింటినీ అణగద్రొక్కి) హృదయానికి హత్తుకుపోయేట్లుగా చిత్రించడం జరిగింది. ఇటలీలో నిరుద్యోగ సమస్య తీవ్రతను యీ చిత్రం చూచినవారెవరైనా సులభంగా వూహించుకొనవచ్చు. దీని దర్శకుడు వాస్తవిక వాదుల్లో ప్రథముడైన విట్టోరియో డిసికా. యీ చిత్రంలో 'పాత్రలెవరూ మనం మామూలుగా అంటలమెత్తే - తారలుగారు. పాత్రోచితి ననుసరించి, సామాన్య జీవితపు కుటుంబాలనుండి ఎన్నుకోబడ్డారు. నాయకుడు నిజంగా ఒక నిరుద్యోగ కార్మికుడు. ఒకసారి ఒక వుద్యోగ నియోగ కేంద్రం ముందు యీ కార్మికుడు నిలబడివుంటే గా డిసికా చూచి, తన చిత్రానికి తీసుకొన్నాడు. (యీ ఫిలిం పూర్తయాక ఆ నాయకుడు తిరిగి నిరుద్యోగి కార్మికుడే అయినాడులెండి.) ఒక హాలీవుడ్ కంపెనీ పెద్దజీతంకింద వాళ్ళ తారల్తో చిత్రం పూర్తిచేయమని ఆశలు చూపారుగాని డిసికా వాస్తవికతా ప్రేమ ఆ పేరాశను బానిస కాలేకపోయిందని మనం చదివాము గూడా.

డిసికాతో సరితూగగలిగిన దర్శకులు - రోస్సెల్లిని, లాట్టూడా, వర్గానో మొదలైన వారు. రోస్సెల్లిని చిత్రాలు ఇండియాలో చాలా ప్రదర్శించబడ్డాయి. "స్ట్రాంబోలి" (అగ్ని పర్వతద్వీపం -) జరిగిన ఒక వాస్తవిక గాథ. ఆ ద్వీపవాసి అయిన ఒక పల్లె బెస్తవాడు యుద్ధంలో సోల్జరుగావుండి యుద్ధానంతరం, ఒక యుద్ధపీడితను అనాథ యువతిని పెండ్లాడతాడు. ఆమెకు వేరే గతి స్ఫురించక యీ మార్గాన్ని చేసుకొంటుంది. ఇద్దరూ కలిసి బెస్తపల్లె చేరతారు. చదువూ, సంస్కృతీ, నవీన నాగరికత వున్న ఆ అనాథ భార్య, యీ కొత్తదరిద్ర వాతావరణంలో నిలవలేకపోతుంది. భర్త చేత తన్నులుతింటుంది. ద్వీపం దాటిపోవాలనే ఆమె ప్రయత్నం, అగ్ని పర్వతం

(50-వ పేజీచూడండి)



తిక్క శంకరయ్యలాటి జమీందారుగారింట్లో నర్సుగా చేరింది రమ.

శోభావారి "పరోపకారం" లో జి. వరలక్ష్మి, సి. ఎస్. ఆర్.

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ కె. రామతారకేశ్వరరావు—ఏలూరు.

సినిమా పరిభాషలో 'మాంటేజ్' అంటే యేమిటి? ఎలాంటి సందర్భములలో అది చిత్రాలలో ప్రవేశపెట్టబడుతుంది?

—'మాంటేజ్' అనే ఫ్రెంచి, జర్మన్ భాషా పదానికి 'నిర్మించటం' 'పేర్చటం' అని అసలు అర్థం. సినిమా పరిభాషలో దీని అర్థం 'ఎడిటింగ్.' మన స్టూడియోలలో ఎడిటింగ్ అనేమాట వేర్వేరుషాట్లను, సీన్లను కథాక్రమంలో అతికించటం అనే అర్థంలో వాడబడుతున్నది. ఈఅర్థం రైటే. కాని రష్యన్ సిద్ధాంతకారులైన ఐజెన్‌స్టీన్, పుడోవ్కిన్, తదితరులు ఈ పదాన్ని ఇంకా విశాలమైన అర్థంలో వాడారు. దానికి వారెక్కువగా ఉపయోగించినమాట 'మాంటెజ్'. ఎడిటింగ్‌లో అదొక విధానం. ఈ విధానంద్వారా ఒక సన్నివేశాన్ని మామూలుగాకంటె ఎక్కువ శక్తివంతంగా ప్రేక్షకులకు చూపించవచ్చును. సాహిత్యం రాసేవాడికి విలక్షణమైన శైలి (*Style*) ఎటువంటి సాధనమో సినిమా డైరెక్టరుకు మాంటెజ్ అటువంటి సాధనము. పుడోవ్కిన్ తీసిన "మదర్"లో దీనికొక ఉదాహరణవుంది. ఖైదులో మగ్గిపోతున్న కథా నాయకునికి మరునాడే తనకు స్వేచ్ఛ లభిస్తుందని కబురు తెలుస్తుంది. అతని సంతోషం చిత్రించటానికి అతని ముఖం ఫోటో తీయలేదు పుడోవ్కిన్. సంతోషంతో వణుకుతున్న అతని చేతులు, విప్పారిన పెదవులు పెద్ద క్లోజప్‌లో తీశాడు. ఈ షాట్లకు మధ్యమధ్య, పరవళ్లు తొక్కుతూ ప్రవహించే యేరు, నీటి అలలపై విరుగుతున్న సూర్యకాంతి, చెర్లో కేరింతలుకొట్టే పిట్టలు, నవ్వుతున్న పసిపాప - ఈ షాట్లను కలిపాడు. దీనివల స్వేచ్ఛ లభించనున్న ఖైదీ సంతోషం, అతని మానసిక స్థితి ద్విగుణీకృతంగా వెల్లడి కాగలిగింది.

ఇటీవల వెలువడిన "కన్నతల్లి"లో తల్లి గొడ్డపాకలో ఉంటూ కుట్టిన విస్తరాకులను బాగా లేవంటూ మామ కింద విసిరికొడతాడు. అది చూడగానే రామూకు తన చిన్నతనంలో తల్లి విస్తళ్లుకుట్టి ఇవ్వటం, తను అమ్మకు రావటం జ్ఞాపకం వస్తుంది. ఈ జ్ఞాపకం రావటాన్ని సూపర్ ఇంపోజిషన్ ద్వారా చూపిస్తారు. ఆ సమయంలో రామూ మానసిక స్థితిని వ్యక్తం చెయ్యటానికి దర్శకుడు పూర్వ సన్నివేశాన్ని, ప్రస్తుత సన్నివేశాన్ని ఒకే సారిగా చూపిస్తాడు. ఇది మాంటెజ్‌కు మరొక ఉదాహరణ.

మాంటెజెస్‌లో అనేకరకాలున్నాయి. 'మల్లీశ్వరి'లో ఎన్. టి. రామారావు, భానుమతి చెరసాలలో ఉన్నప్పుడు భానుమతి తమ చిన్నతనాన్ని జ్ఞాపకం చేస్తూ "ఓబావా, నాబావా" అనే పాట పాడుతుంది. ఈ పాట ఆ సమయంలో తిరిగి పాడటంతో సన్నివేశానికి పదును కలిగింది. ఇదొక రకమైన మాంటెజ్. ఇలాగే కొద్ది కొద్ది తేడాలతో పలురకాల మాంటెజెస్ ఉన్నాయి.

(ఉదా:— మెట్రికల్ మాంటెజ్, రిద్మిక్ మాంటెజ్, టోనల్ మాంటెజ్, ఓవర్ టోనల్ మాంటెజ్.) కేవలం కటింగ్ రూమ్‌లోనే కాక, సినేరియో రాసేటప్పుడు, డైలాగ్స్ రాసేటప్పుడు, షూట్ చేసేటప్పుడు, రీరికార్డింగ్ జరిపేటప్పుడు ఎప్పుడైనా మాంటెజ్ ఉపయోగంలోకి రావచ్చు. సినిమా కళకు ఆధారం ఎడిటింగే నన్నాడు పుడోవ్కిన్. మాంటెజ్ లేనిదే ఏకళాలేదన్నాడు ఐజెన్‌స్టీన్.

* * *

శ్రీ దేవకి రామసుబ్బారావు–వినుకొండ.

హిందీ పిక్చర్సు ఎంత డబ్బయినా ఖర్చుపెట్టి పిక్చరు బాగా తీస్తారు. కాని మన తెలుగువారు ఆవిధంగా డబ్బు ఖర్చుపెట్టి బాగా తీయ రెందుచేత?

—హిందీ చిత్రాలమీద మీ కింకా మోజు పోనందుకు ఆశ్చర్యం. తెలుగు చిత్రాలు హిందీ చిత్రాలకు ఏవిధంగానూ తీసిపోవు. మనకంటే మంచి చిత్రాలు తీసేది బెంగాలీలు, మహారాష్ట్రులు.

మేము యేవైనా పుణ్యక్షేత్రాలలోని వింతగొలుపు ఫోటోలు పంపాలంటే, నెగటివ్ పంపాలా పాజిటివ్ పంపాలా?

—నెగటివ్‌లు పంపనక్కర్లేదు. ప్రింట్లు మాత్రమే పంపించాలి.

* * *

శ్రీ ఒ. శ్రీనివాసరావు—గూడూరు.

ప్రొడ్యూసరు సోషలిష్టు, డైరెక్టర్ కమ్యూనిష్టు, ఆర్టు కాంగ్రెసు వీరు ముగ్గురూ కలసి ఒక చిత్రం తీస్తే ఎలా వుంటుందో వూహించి చెప్పగలరా?

—కమ్యూనిస్టుగానే వుంటుంది.

* * *

శ్రీ అడివి శివరావు—కోరుకొల్లు.

'నాటకము - నాటిక'–ఈ రెండింటికి గల తేడా ఏమిటంటారు?

—నాటకం పెద్దది. నాటిక చిన్నది.

* * *

శ్రీ వై. సుబ్రమణ్యం—తెంపల్లె.

రచయిత చలం సాహిత్య రంగంనుండి విరమించారు. ఇప్పుడెక్కడుంటున్నారో, ఏంచేస్తున్నారో, వారి సిద్ధాంతాలలో ఏమన్నా మార్పువచ్చిందో సవివరంగా తెలుపగరా!

—చలంగారిప్పుడు తిరువణ్ణామలైలో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్నారు. ఇదివరకు ఏ ఆధ్యాత్మికతను నిరసించారో ఆ ఆధ్యాత్మికతనే ఇప్పుడు సాధనం చేస్తున్నారని వెళ్ళిచూసివచ్చిన వారు అంటున్నారు.

* * *

శ్రీ ఎస్. ఎమ్. బాషా–బద్వేలు (కడప)

ఇండియాలో తయారుకాబడిన ప్రథమ టెక్నికలర్ చిత్రం 'ది రివర్' అని నేనూ, 'ఆన్' అని మా సీనూ రెండూ కాదు 'ఝూన్సీ కి రాణి' అని మా మూర్తి వాదించుకొంటున్నాము. మాలో ఎవరు రైటు?

—మీరే రైటు. మీ సీను, మూర్తి కూడా రైటుకాదని చెప్పలేము. 'ది రివర్' ఇండియాలో తయారైనా, నిర్మాత విదేశీయుడే. 'ఆన్' నిర్మాత భారతీయుడే, కాని ఫోటోగ్రఫీ టెక్నికలర్ కాదు, ప్రింట్‌మాత్రమే టెక్నికలర్. 'ఝూన్సీ కి రాణి' నిర్మాత భారతీయుడు; ఫోటోగ్రఫీ కూడా టెక్నికలరే.

* * *

శ్రీ డి. గోపాలకృష్ణరాజు—విశాఖపట్నం.

"పెళ్ళిచేసి చూడు" వంటి సంపూర్ణ హాస్య చిత్రాన్ని ఎవరయినా తయారు చేస్తున్నారా? అవి యేవి?

—రోహిణీవారు తయారు చేస్తున్న కొత్త చిత్రం సంపూర్ణ హాస్యచిత్రమే. ★

(48-వ పేజీ తరువాయి)

సకలం పని [illegible] నశిస్తుంది ఈ చిత్రం చూచినతర్వాత హృదయాలు కరిగిపోతవి. రోస్సెల్లిని మరొక ప్రఖ్యాత చిత్రం – "పైసా." ఇందులో ఇటాలియన్ యుద్ధ-యుద్ధానంతర విషాదమయ దృశ్యాలు – ఆరు వేర్వేరుగా తీసుకొని వాటిని ఒకేచిత్రంలో కలిపివేయటం జరిగింది. మన దేశంలో అయితే, ప్రజలు మూర్ఖులనీ, వాళ్ళకి ఎక్స్పెరిమెంట్లు అర్థంకావని వదిలివేసే వారు. కాని రోస్సెల్లినీకి యీ చిత్రం తోనే అసామాన్యమైన పేరువచ్చింది.

ఇదేసమయంలో ఇటలీలో దొంగవ్యాపారుల్ని గూర్చి డి శాంటిస్ ఒక మంచిచిత్రం తీశాడు (రోమ్, యూ ట్రాజెడో.)గా గ్రెగో అలెస్సాండ్రిని – తీసినయూరు [illegible] చిత్రం మంచిదకపు వాస్తవిక చిత్రం అనిపించుకొన్నది (పల్ ఎ ట్రిబోరా ఎడ్రావెక్). బాయిసికి ఇంకా తీసినచిత్రం యుద్ధానంతర జీవనవ్యవస్థలతో – ఒక కార్మిక స్త్రీ [illegible] అనేవాళ్ళ [illegible] [illegible] ఒంటరిపోరాటం [illegible] లో కి వచ్చింది. ఈ చిత్రకులందరూ సామాన్యుల [illegible] యీ వసులు. విశ్వంసకి [illegible], డిసికా నిజంగా స్త్రీకి మనస్ఫూర్తిగా చెప్పాలి. ఇవిగాక మరొక మహత్తర చిత్రం ప్రస్తుతం మనదేశంలో విడుదలయింది – డిసికా – "మిరకిల్ – యిన్ – మిలాన్." డిసికా పదునుపొందిన వాస్తవిక దృష్టి ప్రతిభ యిందులో మరింత స్పష్టంగా చూడవచ్చు. ఇదికూడా యిటలీ చిత్రమే.

నాకు తెలిసిన చిత్రాల సంగతే యిందులో చెప్పటించాను. ఇవిగాక యింకెన్నో ఉత్తమ తరగతి చిత్రాలను పై దర్శకులు ప్రపంచానికి యిచ్చారు. అంతేగాక ఏ దేశంలోనూ ప్రోద్బలంలేని కొత్త యువక కథకులకు, దర్శకులకు, యితర టెక్నీషియన్లకు (ఇటాలియన్ నగరాలనుంచే గాక, యితర దేశస్థులకుగూడ) తరిఫీదు నిచ్చి ప్రోత్సహిస్తున్నారు.

ప్రజాసమస్యలను కేవలం పరిష్కరించగల శక్తివంతమైనవి గానక్కర్లేదు వాస్తవిక చిత్రాలు. అసలు ప్రజాజీవితాలను ప్రతిబింబిస్తే చాలు. ఆ ప్రతిబింబన ప్రజా జీవితాన్నికి సారిత్తుంది. ఇటాలియన్ చిత్రాలు చేస్తున్న పని యిదే. అందువల్లనే, ప్రేక్షకులు – యీరోపు ఖండపు చిత్రాలను గురించి విశేషించి చెప్పారు. "బైసికల్ దొంగలు" చిత్రం మొత్తం నికారికి డిస్ట్రిబ్యూటింగు హక్కులు ఒక [illegible] కంపెని లక్షరూపాయలకు కొన్నది. కాని ఒక్క బొంబాయి సర్కిల్ లోనే యిది 5-౦ లక్షలదాకా సంపాదించింది. దానితో తమ తప్పు అంచనాలతో స్వకీయానందం పొందే ప్రొడ్యూసర్లలో కొంత సంచలనం కలిగింది గాని అది క్షణికమూ, నామమాత్రమూ అయి పోయింది.

తెలుగు ప్రొడ్యూసర్లు – కాకిముజిలీలు, అర్థం కాని పాటలు, అసంభవ సాంఘికాలు – (యీ వ్యాపారాల ఫలితాలను చక్కగా అనుభవించారు గనక) వీటిని వదిలి ధైర్యంతో ముందడుగువేసి, నిజమైన వాస్తవికతగల చిత్రాలను పూనుకొంటారని ఆశిస్తాను. ప్రజాభిప్రాయం అల్లాలేదనీ, తమ అంచనాల ప్రకారమే వుందని తమ సంకుచిత వాతావరణపరిధులలో అనుకోనే మాటల్లోని బూటకాన్ని గ్రహించుకోవాలి. తెగిన కథకులు రావటంలేదని చెప్పే మాటల్లోని అసత్యాన్ని తెలుసుకోవాలి. గుర్తించుకోవటం యీ పరిశ్రమ భవిష్యత్తుకు శ్రేయోదాయక మవుతుంది. కొత్తకథకులు లేవని ప్రచారం చేస్తున్నవారు యిది సరాలుగా తీసుకుంటారని ఆశిస్తున్నాను. ★

శోభావారి "పరోపకారం" లో తులసికోటవద్ద పాటపాడేందుకు సిద్ధంగా వున్న జి వరలక్ష్మి.





జయంతీవారి "బంగారు భూమి" లో సీతగా అంజలీదేవి.

సినిమా వార్తలు

నవయుగ పిక్చర్సు వారి "జ్యోతి" ద్విభాషాచిత్రం షూటింగ్ చకచకా జరుగుతున్నది. చాలరోజులనుండి నుండిగతిలో నిర్మాణం సాగుతూండిన ఈ చిత్రంముప్పాతికభాగం దాకా తయారైంది. శ్రీరామమూర్తి, జి. వరలక్ష్మి, సావిత్రి, శివరావు, మున్నగువారు నటిస్తున్నారు. దర్శకత్వం, ఫొటోగ్రఫీ. శ్రీధర్.

* * *

జయంతీ ప్రొడక్షన్సువారి "బంగారు భూమి" ద్విభాషాచిత్రం కూడా ముప్పాతికవరకూ తయారైంది. వాహినీ స్టూడియోలో షూటింగ్ త్వరత్వరగా జరుగుతోంది. అంజలీదేవి, టి. ఆర్. రామచంద్రన్, సారంగపాణి, ఆర్. కె. రావు మొదలగువారు నటించే ఈచిత్రానికి తెలుగులో సంభాషణలు మల్లాది వెంకటకృష్ణ శర్మగారు రాశారు. దర్శకుడు ఎ.టి. కృష్ణస్వామి.

* * *

శోభా పిక్చర్సువారి "పరోపకారం" దాదాపు అయిపోయినట్లేనని, మరి ఆయిదారురోజుల చిల్లరపనితో పూర్తవుతుందనీ, ఈ నెలలోనే విడుదలకావచ్చునని తెలుస్తోంది. ముక్కామల, జి. వరలక్ష్మి, సావిత్రి, రామశర్మ మున్నగువారు నటిస్తున్నారు. సంగీతం ఘంటసాలగారే. దర్శకుడు, ఫొటోగ్రాఫర్ కమాల్ ఘోష్.

* * *

వాహినీ స్టూడియోలో తయారవుతున్న మరొక చిత్రం అసోసియేటెడ్ ప్రొడ్యూసర్సువారి ప్రొడక్షన్ నంబర్ వన్. ఇది తమిళ, మలయాళ భాషల్లో మాత్రమే తయారవుతున్నది. బి. ఎస్. సరోజ, గిరిజ, ఆర్. గణేశ్, టి. ఎస్. బాలయ్య, బి. ఆర్. పంతులు మున్నగువారు నటిస్తున్నారు. దర్శకుడు జి. ఆర్. రావు. ఫొటోగ్రఫీ ఆది ఎమ్. ఇరానీ. కథాస్థలం మలయాళ ప్రాంతం గనుక లొకేషన్ షూటింగ్ కోసం ఈ సంస్థవారు ప్రస్తుతం మలబారుపల్లె గ్రామ దృశ్యాలు తీస్తున్నారు. ఈచిత్రం ముప్పాతిక భాగంవరకూ తయారైంది.

* * *

కొద్దిరోజుల క్రితం "సురంగ్" అనే కొత్తచిత్రం ప్రారంభించిన శాంతారాం అప్పుడే మరొక చిత్రానికి కథ తయారు చేస్తున్నాడు. కాళిదాస మహాకవి రాసిన "కుమార సంభవ" కావ్యం ఆధారంగా ఈ చిత్రం కేవాకలర్‌లో నిర్మిస్తాడు. స్క్రిప్టు వ్రాసేది దివాకర్ కారే. శాంతారాం గతంలో కాళిదాస విరచితమైన "అభిజ్ఞాన శాకుంతలం" కథ తీసుకొని కాళిదాసు శకుంతలకు భిన్నమైన ఆధునిక శకుంతలను సృష్టించాడు. ఈసారికూడా 'ఆధునిక' పార్వతిని సృష్టిస్తాడేమో చూడవలసి వున్నది.

* * *

ప్రస్తుతం యూరప్‌లో సంచారం చేస్తున్న చార్లీ చాప్లిన్ కొను తిరిగి అమెరికా వెళ్లబోవటంలేదని ప్రకటించాడు. స్థిరనివాసం ఎక్కడ ఏర్పరచుకొంటాడో చెప్పలేదు. అమెరికాలోని అభ్యుదయ నిరోధకులు తనపై సాగిస్తున్న దుష్ప్రచారం మూలంగా అక్కడ తను చిత్ర నిర్మాణం సాగించటం కష్టసాధ్యమవుతుందనీ, అందుచేత తిరిగి వెళ్లటం అనవసరమనీ ఆయన అన్నాడు. అమెరికన్ అధికారులు చార్లీ చాప్లిన్ అమెరికానుంచి లండనుకు బయలుదేరగానే 'విచారణజరిగి అతడు నిర్దోషి అని తేలితేగాని తిరిగి అమెరికాలో అడుగుపెట్టరాదని నిషేధించారు. చాప్లిన్ కమ్యూనిస్టు సానుభూతి పరుడనేది వారి ఆరోపణలలో ఒకటి. ఏది ఏమైనా, ఫలితంగా చాప్లిన్ కొత్తచిత్రం "లైమ్‌లైట్" అమెరికాలో ప్రదర్శనాన్ని ఉపసంహరించటం జరిగింది.

కాంతాసమ్మితం

(11-పేజీ తరువాయి)

ఖర్తీనా తనకి సమకూర్చలేదు-అవి రోజూ రోజూ అవసరం అయిపోతున్నాయి తనకి.. ఆఖరికి ఒకనాడు - తనలో ఇముడ్చుకోలేక - కాంతం ముందే ఏడ్చేసింది.

"నాకేం తెలియడంలేదు కాంతం ఈ అశాంతి. నాకీ జీవితం ఏం బాగులేదు" అంటూ.

* * *

తన స్నేహితు లెవరో ఫిల్ముతీస్తూ కాంతాన్ని అందులో ఒక ముఖ్యమైన పాత్రకి నటించనిమ్మని అడిగారని సుందరం తెచ్చిన వార్త వసంతకి అబ్బురంగా తోచింది. కాంతం ఎంత అదృష్టవంతురాలు. నటి కాబోతున్నది. తన ఆశయాలకి రూపం,! అందానికి వినియోగం, పలుకుబడి, ధనం, అంతకన్న ఏం సుఖాలు కావాలి. తన బతుకు చూసుకుంటే!! కాని తన బతుకు చూసికదా ఒకప్పుడు కాంతం ఉవ్విళ్ళూరేది - కాంతానికి పట్టబోయే యోగం చూస్తే తనకి ఈర్ష్య కూడా కల్గుతోంది. అసలు తాను పెళ్లి చేసుకోడంతప్పు-బండి బాటవంటి గాడిలో పడి తన జీవితాన్ని కూడా అలవాటు ప్రకారం గెంటివేస్తోంది - ఇది కాదు తన స్వప్నం. తనకి జీవితంమీద రోజురోజూ విరక్తి కల్గుతోంది. కాంతం ఇంట్లోంచి వెళ్ళిపోతుందంటే కొంచెం ఉపశాంతిగానే ఉంది. ఈమధ్య తమలో కలతలు; భేదాలు కాంతం గమనిపడ్డం ఇష్టంలేదు తనకి. మొన్న దుఃఖం ఆపుకోలేక తన అసంతృప్తి వెళ్ళగక్కుకుని కాంతం దగ్గర ఏడ్చినందుకే చిన్నతనంగా వుంది - కాని కాంతం ఆ వూళ్లో అంత అసంతృప్తినీ ఎలా తనలో దాచుకొనేదో!!

"నా పుట్టింటికి పోయివస్తా"నంది కాంతంతో. ఆమాటకి నా మొగుణ్ణి వదిలేస్తావన్నంత కంగారుపడిపోయింది కాంతం - నిజానికి తనకి అలాగే ఉంది - కాని ఒద్దు గాక వద్దని కాంతం. కాని తను విన తలచుకోలేదు. సుందరం వద్దనడు అది ఎలాగా తెల్సు.

పర్యవసానంగా వసంత పుట్టింటికి బయలుదేరి వెళ్ళింది.

6

ఏడాది కావచ్చింది వసంత పుట్టింటికి వచ్చి. సుందరం ఉత్తరం రాయలేదు. తనూ వెళ్ళలేదు. కాని బ్రతుకు కిక్కడా దుర్భరంగానే ఉంది. ఏం బావుకుందామని వచ్చినట్లు? ఇక్కడ ఇంకోరకమైన అశాంతి! ఆ కాంతం! అసలే దాని కీయనమీద కన్ను! ఈ ఏడాదిలోనూ ఎన్ని విశేషాలైనా జరిగివుండొచ్చు. తనకి ఆయనమీద మమకారం తను అనుకున్నట్లు పోలేదు. అన్ని కలతలతోనూ అక్కడే బావుండేది. తనకి నెలనెలా జీతంలాగ 400 రు. పంపడం బాగానే వుంది ఆయన. ఇక్కడివాళ్ళంతా పోట్లాటవల్ల విడివిడిగా ఉన్నారనుకోడం మానేశారు. తను సుఖం లేదన్నానని రాణీగారివలె బతకమని తనకి పంపడం అది అని వాళ్ళకేం తెల్సు? తనకి పుట్టింట్లో ఉండ బుద్ధికావడం లేదు. రాక రాక తనకో ఉత్తరం వచ్చింది ఓనాడు. చింపి చూస్తే అది కాంతం రాసింది.

లక్ష్మీదేవిగారూ,

నా ఉత్తరానికి ఆశ్చర్యపోయివుంటారు. నా స్వతంత్రానికి మన్నించండి. ఈ ఉత్తరం మీవారి పూర్వపు ఉత్తరాలంత కమ్మగా ఉండదు. కాని కారంగా ఉండనుకోకపోతే అంతే చాలు.

మా పిక్చరు చూసేవుంటారు. అందులో నా వేషం కథానాయకి కాకపోయినా ముఖ్యమైనదే. దానితో నాకు సిరీ, కీర్తి ఎత్తుకున్నాయి. వందిమాగధులూ ఎక్కువైనారు. ఇదంతా మీ దంపతులు చేసిన సహాయం. కృతజ్ఞురాల్ని.

కాని మీరు అలా విడివిడిగా ఉండడం నా మనసు కొంత శల్యంలా వుంది. మీ రెందుకు వెళ్ళిపోయారో నేను విన్నాను. ఆవేళ రాత్రి మీరంతలేనిమాటలు ఆయన్ని అంటారని నే ననుకోలేదు - అంటే మన వూళ్లో మనసులు కల్సిన మిమ్మల్ని చూసిన నేను అనుకోలేదు - మీ రాయనతో అన్ని కష్టాలే పడుతున్నాననీ, మీ కోర్కెలన్నీ చంపుకున్నాననీ, ధనం పలుకుబడీ లేని బతుకుకంటె చావే మేలనీ, అస లెందుకు ఆయనకు మిమ్మల్ని కట్టబెట్టారాఅని ఏడుస్తున్నాననీ ఇంకా ఎన్నో అన్నారు. ఆయన పట్టుదల కూడా నా కాశ్చర్యం వేస్తోంది. మీకు నెలకి నాల్గు వందలు పంపిస్తే మీకా సుఖాలన్నీ ఇస్తున్నాననుకుంటున్నట్లున్నా రాయన!

అమ్మాయిగారూ! అసంతృప్తికీ అశాంతికీ మందు, అంతూ అంటూ లేవు. ఈ విషయాలలో నాకూ మీకూ కించిత్తు సామ్యం ఉంది. నాదీ అసంతృప్తి చెందిన జీవితమే. ఈ జీవితంలో ఇన్ని వేషాలు మార్చిన మీదట ఇప్పుడనుకుంటున్నాను - తృప్తిని మించిన సుఖం లేదని.

ఇన్ని కష్టాలు పడ్డా నా అశాంతిపోయే మార్గం లేనేలేదు - అశాంతి మన మనసులోనే ఉంది. బైటి ప్రపంచంలోలేదు - మీ ఆయన రాసిన ఆ ఉత్తరం; మీ ఆనందమయ జీవితం చూస్తూ నేనేదో అశాంతితో బాధపడేదాన్ని - నా కలాంటి జీవితం లేదని. ఎన్నిసార్లన్నాను మీ రదృష్టవంతులని! ఆపైని మాయింటి పరిస్థితుల్లో నే ఉండలేకపోయాను. సాంప్రదాయిక కట్టుదలలో ఇముడలేని కొన్ని జీవితాలు, బతుకు పొడుగునా తుఫాను వేగంతో ఆ గాలికి పడవలా కొట్టుకుపోయే జీవితాలు ఉంటాయి. అందులో నా దొకటి. కాని నేను అటువంటి అనేక తెరచాపల్లేని పడవల్లా నీటిలో మునిగిపోలేదు మీ దయవల్ల - కాని మిమ్మల్ని చూస్తేనే భయం కల్గుతుంది.

నాకు లేనిసౌఖ్యం లేదిప్పుడు. కాని నే కోరిన ప్రేమించే పురుషుడు ఇంకా రాలేదు. నాకు అశాంతీ తప్పలేదు అన్నాను. కారణం - మా వూళ్ళో ఒకరకం పరిస్థితుల్ని ఎదుర్కోవలసివస్తే ఈ సినిమా రంగంలో అనేక స్వార్థాల్నీ, అవినీతినీ; ఒత్తిడినీ ఎదుర్కోడం తప్పలేదు. ఎక్కడో నావంటి హృదయం తప్పితే

ఒకానొక ప్రఖ్యాత దిన పత్రిక కార్యాలయానికి దిగువ విధంగా ఒక జాబు వచ్చింది.

"సంపాదక మహాశయా! మీ పత్రికా రాజానికి ఎంతటి శక్తివున్నదో నాకు యిటీవల బాగా నిదర్శనమైంది. బంగారంతో తయారుచేసిన జేబుగడియారం ఒకటి నేను యిటీవల పోగొట్టుకోవటం జరిగింది. ఆగడియారం అంటే నాకెంతో అభిమానం. అందుచేత మీ పత్రికలో ప్రకటన చేయించాను. మరునాటికల్లా, నా బంగారుగడియారం నాకోటు రెండో జేబులో కనుపించింది."

సంగీతమంటే ఆట్టే తెలియని ఒక పెద్దమనిషి శాస్త్రీయ సంగీతాన్ని గురించి మాట్లాడుతూ యిలా అన్నాడు.

"పాట పాడుతున్నప్పుడు ఎప్పటికప్పుడు ఏదో ఒక శబ్దంవినిపించి, ఇక యిక్కణ్ణుంచీ విన సొంపుగా వుండవచ్చునని పించి, మళ్ళీ అంతలో కర్ణ కఠోరంగా తయారు అవుతూ వుంటుంది. అల్లాంటి సంగీత మంతా శాస్త్రోక్తమైన సంగీత మని గుర్తించవలసింది."

దీనిని 'సౌఖ్యం' అని అందరూ ఎందుకు అనుకుంటారంటే దీనిలో స్వాతంత్ర్య భావ ఉన్నది - ఒకరు మనల్ని పోషిస్తున్నారు అనే భావంపోయి - స్వతంత్రులం అనే భావం కల్గించేభావం అది-ఇంతకీ నాకీ అశాంతి తప్పలేదు. ఇక్కడ ఒక రకం ఒత్తిడికి దాసులం.

ప్రేమ అప్రయత్నంగా లభించేది. సుర్ద మనోహరాలైన హృదయాలు పరస్పరం తొలిసారి ప్రేమించుకోడంతో వారికి కలిగే అనుభూతి వెయ్యి జన్మలెత్తినారాదు.

ఇంతకీ చెప్పవచ్చింది ఏమంటే - మీ 'సంపద మీరు' చేతులారా పాడుచేసుకుంటున్నారు. ఈ వివాదంలో నామీ ఆయనమీద మనసు పడకపోలేదు. నేనన్నీ విస్పష్టిస్తున్నాను. కాని ఆయన స్త్రీలంటేనే అసహ్యించుకోడం మొదలు పెట్టారు. ప్రేమించినవారితో కష్టసుఖాలు పంచుకోలేని స్త్రీ అయినారు మీరనిఆయన బాధ అనుకుంటాను. మీరే ఇలా అయితే- ఇంత చరిత్రతో, సినీమాతారనైన నావలపు ప్రతి అసలే నమ్మదగ్గది కాదని ఆయన అభిప్రాయం. నేనంటే కించిత్తూ ఆయన చలించలేదన్నదే నిదర్శనం - మిమ్మల్ని ఆయన ఎంతగా ప్రేమించారో అన్న దానికీ, మీరెంతగా ఆయన హృదయాన్ని శిథిలపరచారో అన్న దానికీ నిదర్శనం.

మీరు తిరిగి ఆలోచించుకోండి. మీకే తెలుస్తుంది. అసంతృప్తి అనే దానికి అర్థం లేదు. మీరు వెంటనే రండి. మీ కాపరం దిద్దుకోండి. వచ్చేటప్పుడు నాకు వ్రాయండి. మీ ఆయనకేం రాయవద్దు.

మనస్నేహం కొద్దీ ఇంత మనసు విప్పి మాట్లాడాను - ఆపైన మీయిష్టం.

ఇట్లు,

మీ మిత్రురాలు కాంతం.

కాంతానికిన్ని కబుర్లెలావచ్చాయని నిర్ఘాంతపోయింది వసంత. తనెలాగా అనుకుంటూనే వుంది ఏవంకన తిరిగి వెళ్ళడమా అని. కాంతంకూడా ఉంటే - తమ సమావేశంలోని - ఆ సందర్భం కొంచెం తగ్గించి - కలుపుగోలుగా వుంటుంది. ఆలస్యం చెయ్యలేదు. మర్నాడే కాంతానికి టెలిగ్రాం ఇచ్చి బయలుదేరింది.

మద్రాసులో కాంతం స్టేషన్కి వచ్చింది. ఇదివరకు కంటె అందంగావుంది. సుందరం ఈమెను చూసికూడా చలించలేదా! ఏమో ఆగాలేవ వద్దు తనకి.

"అరెరె! ఎలా చిక్కిపోయారో చూశారూ. ఇదంతా అక్కడికివెళ్లి ఎక్కువ సుఖం అనుభవించినందువల్లే కాబోలు! నీ అందం అంతా ఎలా పాడైపోయిందో" అని ఎగతాళి చేసింది కాంతం. ఆహుషారు-విద్యుచ్ఛక్తివంటిది. వసంతని కూడా ఉత్తేజపరచింది. చిరునవ్వెజవాబు.

ఇద్దరూ కారులో సుందరం ఇంటికెళ్ళారు. వీడాడి తర్వాత వసంతని చూసినందుకు సుందరం చాలా సంతోషించాడు. కాని ఈ రాకకి వింతపడ్డాడు. ఆమె రావడం తృప్తిగానే వుంది అతనికి - ఈ రాకకి కారణం అయినా అడగలేదు. పాత కథ జ్ఞాపకంవస్తుందని.

చాలా సేపు సంభాషణలోనూ అందరూ- ఏమీ జరగనట్లే వ్యవహరించారు-ఆఖర్న.

"మళ్లీ అమ్మాయిని కష్టపెట్టకండి సుమా. అలిగి పారిపోతే మళ్ళీ నాలాంటి మధ్యవర్తులను బతిమాలుకోవల్సివస్తుంది మీరు" అని పరిహాసించింది కాంతం. సుందరం నవ్వేడు.

"ఎన్ని కబుర్లు నేర్చింది - అసలు కబుర్ల పోగకాని - ఇప్పుడు మరీను" అని ప్రశ్నార్థకంగా చూసింది వసంత.

"అవును లక్ష్మీ" అన్నాడు తన ప్రేమనంతా ఆ లక్ష్మి అన్న పిలుపులో ధ్వనింపజేస్తూ.

"సరే ఇద్దరూ ఒకటైపోయారు - ఇక నేం వెళ్ళొచ్చు" అంది కాంతం. అందరూ నవ్వుతున్నారు... ★

★ దత్తత ★

(20-వ పేజీ తరువాయి)

అంతలో స్కూల్లో గంట మ్రోగింది. బిలబిలమంటూ పిల్లలంతా వెలుపలకు వచ్చారు.

డ్రైవరు శాంతమ్మకు సమాధాన మివ్వలేదు.

ధర్మయ్యతో రాము కారు దగ్గరకు వచ్చాడు. ధర్మయ్య ప్రక్కగా లక్ష్మి నిలబడి ఉంది.

రాము కారు ఎక్కి అటువైపు చూశాడు. శాంతమ్మ నిలబడి ఉంది. రాము లేత హృదయం ఎందుకో ఆమెవైపులాగుతోంది. ఎక్కడో చూసినట్లు చిన్న మెదడు ఊహించడానికి ప్రయత్నిస్తోంది.

"ఎప్పుడైనా మాయింటికి వచ్చావా?" ఈ ప్రశ్న శాంతమ్మను చూస్తూ రాము వేశాడు.

శాంతమ్మ మాతృ హృదయం ఒక్కసారి ఉప్పొంగింది. ఆనందబాష్పాలతో నిండిన కనుకొలకులతో ఆలాగేచూస్తోంది. సమాధాన మివ్వలేదు.

రాము మొగం చిట్లించి మళ్లీ అడిగాడు "నన్నెరుగుదువా?" ఈమాటకుకూడా సమాధాన మివ్వలేదు.

ప్రక్కనున్న రవి కారులో ఉన్న రాముకేసి చూస్తూ - "మా అమ్మ" అని దగ్గరకు చేరాడు.

శాంతమ్మ రవిని చంకను వేసుకుంది. రాముకేసి చూస్తూ - "నిన్నసలు ఎరగను బాబూ" అంది.

రాముకి చాలా నిరుత్సాహం కలిగింది. తన్ను ఎరగని వాళ్ళు ప్రపంచంలో లేరని అతని ఉద్దేశం.

"మరి నాకేసి ఎందుకాలా చూస్తావ్?" కొంచం కోపంగా అడిగాడు.

ఈమాట సకారణమైందే, అయితే శాంతమ్మ సమాధానం యివ్వలేదు సరికదా, భయంగా వెనక్కి తిరిగి వెళ్లిపోతోంది.

రాము నవ్వాడు. కారు స్టార్ట్ అయింది. కారుకదలి వెళ్ళిపోతుంటే; రవి - రాముకేసి రాము రవికేసి చూసుకుంటూనే ఉన్నారు.

"అమ్మా"

వెళ్ళే శాంతమ్మను ఆగేటట్లు చేసింది. ఉపాధ్యాయుడు ఆప్యాయంగా పెంచిన పిలుపది. శాంతమ్మ వెనక్కి తిరిగివచ్చింది.

"మాయింటికి వస్తారా?" అన్నాడు ధర్మయ్య. "నడవండి" శాంతమ్మ అంది.

శాంతమ్మ మనఃస్థితి యిప్పుడు చాలా విచిత్రంగా వుంది. ఏం చేస్తోందో - ఏం చేయాలో నిర్ణయం లేదు. ఆమె మనస్సులో ఒక ఉత్కంఠ ఏర్పడింది. హృదయం బాధతోనూ, సంతోషంతోనూ ద్వంద్వ యుద్ధం చేస్తోంది. ఏడవాలనీ ఉంది, నవ్వాలనీ ఉంది. కాని ఏదో చేయకూడదని కూడా లేకుండా పోలేదు. మౌనంగా ధర్మయ్య వెనక రవితో వెడుతోంది. ధర్మయ్య చంకను ఉన్న లక్ష్మి, రవిని కోపంగానూ తీవ్రంగానూ చూస్తోంది. రవి ఆమెను మధ్యమధ్య వెక్కిరిస్తున్నాడు.

పేరుకు తగ్గ మనుషులు ప్రపంచంలో బహు తక్కువగా కనిపిస్తారు. కొన్ని పేర్లు తల్లి తండ్రుల అధికారాను, మరికొన్ని పేర్లు వాళ్ళ విశాలభావాలను, ఇంకా కొన్ని వాళ్ళవైరాగ్యభావాన్ని స్ఫురింపచేస్తాయి.

అయితే ధర్మయ్య పేరును పెట్టడంలో తల్లి తండ్రులు ఏవిధమైన వక్రగతినీ పొందలేదని,ఆయన ధర్మనిష్ఠనూ మానసిక సంపత్తినీ గ్రహించినవాళ్లు తప్పక అనుకుంటారు.

ధర్మయ్య భార్య గతించి మూడు సంవత్సరాలు కావచ్చింది. లక్ష్మికి సంవత్సరం నిండకమునుపే భార్యావియోగాన్ని పొందిన ధర్మయ్య మళ్ళీ పెళ్లి అనే మాట లేకుండా స్వయంపాకం చేసుకుంటూ బిడ్డను పోషిస్తున్నాడు. మిత్రులెవ్వరన్నా పెళ్ళివిషయం ప్రస్తావిస్తే; మౌనంగా ఒక నవ్వు నవ్వి మాత్రం ఊరుకునేవాడు.

శాంతమ్మతో ధర్మయ్య యింటికి చేరుకున్నాడు. లక్ష్మిని దింపి యింటితాళం తీస్తుంటే శాంతమ్మ ఆశ్చర్యంగా చూస్తూ "ఇంట్లో ఎవరూ లేరూ" అని అడిగింది.

"ఇదిగో నా లక్ష్మి నేనూ ఉన్నాం" అని మాత్రమే సమాధాన మిచ్చాడు.

అంతా లోపలకు వెళ్లారు. అది చిన్న పెంకుటిల్లయినా - ఆడదకుత లేకపోయినా యింటిలోపల ఎంతో పరిశుభ్రంగా ప్రతి వస్తువూ తీర్చిదిద్దినట్లుగా వుంది.

లక్ష్మిని ఒళ్లో కూర్చో పెట్టుకొని ధర్మయ్య ఒక పాలు కుర్చీమీద కూర్చున్నాడు. శాంతమ్మను చూసి "మీ రలా కూర్చోండి" అంటూ ప్రక్కగావున్న బల్లను సంజ్ఞతో చూపించాడు.

"మరి మీ భోజనం?" శాంతమ్మ ఆలాగే నిలబడి అడిగింది.

"భోజనం తరువాత. మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అన్నాడు. ఈ మాటల్లో ఏదో పట్టుదల ఉన్నట్లుగా శాంతమ్మ ఊహించింది. భయపడుతూ బల్లమీద కూర్చొంది. ప్రక్కగా రవిని కూర్చొ పెట్టుకుంది.

"రాము మీకేమవుతాడు?" మెల్లగా అడిగాడు.

శాంతమ్మ భయాశ్చర్యాలతో చూసింది.

రవి క్రిందకుదిగి లక్ష్మిని "రా" అని పిలచాడు. ధర్మయ్య లక్ష్మిని క్రిందకు దించాడు. ఇద్దరూ కలిసి వంటవసారాలోకి వెళ్ళారు.

శాంతమ్మనుండి సమాధానం రాకపోవడం ధర్మయ్య ఊహ నిరాధారం కాదని నిర్ణయించుకోడానికి ఎక్కువ కాలం వినియోగించలేదు "మీ అబ్బాయా?" మళ్ళీ అదే ధ్వనిలో అన్నాడు.

"మీ కేలా తెలిసింది?" కొంచం భయంగా - ఆత్రంగా తలెత్తి ప్రశ్నించింది.

"మీవల్ల."

"నావల్లా?"

"నీ హృదయావేదన చెబుతోంది...... నాదగ్గర దాచకు చెల్లాయీ!" అన్నాడు సరళంగా.

ఆ చెల్లాయి అనే పదం ఆమె మనస్సు ధర్మయ్యను సన్నిహితం చేసుకోగలిగింది. చిన్ననాడే పరాగైన అన్నగారు గుర్తొచ్చాడు. చెమ్మగిల్లిన కళ్ళతో ధర్మయ్యను చూస్తూ "మీరు తెలుసుకున్న రహస్యాన్ని ఎక్కడా వెల్లడి చేయొద్దు" అంది.

"ఏం" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆమె జరిగిన తన గాథను యావత్తూ ధర్మయ్యకు విపులీకరించి చెప్పింది.

ధర్మయ్య అంతా విని బరువుగా నిట్టూర్చి "మరి ఎక్కడికి వెళ్లాలని నిర్ణయం?" అని అడిగాడు.

"గంగాధరంగారు కూడా ఈలాంటి ప్రశ్నే వేశారు కాని నేనేం సమాధానం చెప్పలేకపోయాను."

"దాని కేమన్నారు?" ఆత్రంగా అడిగాడు.

"ఎక్కడున్నాసరే రాము మాత్రం నీ బిడ్డ అని చెప్పొద్దు అన్నారు" అని సమాధాన మిచ్చింది.

ధర్మయ్య కుర్చీమీదనుంచి లేచి "సరే! ఇది నీ అన్నయ్య యిల్లు. ఇక్కడుండటానికి నా అభ్యంతరం లేదు. కాని మేనగోడలి బాధ్యత నీది" అన్నాడు.

అప్పటికే శాంతమ్మకూడా లేచింది. "అన్నయ్యా...నీరుణాన్ని..." మాట పూర్తికాని క్రితమే "వద్దు, వద్దు ఒకళ్లకొకళ్ళు రుణస్తులు కావడం నా కిష్టం

లేదు..." అంటూ రెండడుగులు వేసి "లక్ష్మీ" అని పిలిచాడు.

పిల్లలిద్దరూ అప్పుడే స్నేహితులైపోయారు. లక్ష్మి రవీ కూడా వంటగదిలో నుంచి మసిపూసుకు వచ్చారు.

"ఛీ! ఛీ! ఏమిటమ్మా యిది" ధర్మయ్య లక్ష్మిని ఎత్తుక ఒళ్ళు దులుపుతున్నాడు.

"ఆ అబ్బాయి" తన చిన్ని వేలుతో రవిని నేరస్తుడుగా ఫిర్యాదు చేసింది.

"అబ్బాయి కాదమ్మా – బావ!" అన్నాడు.

"బావ" చప్పట్లు చరుస్తూ ఉత్సాహంగా నవ్వుతూ అంది లక్ష్మి. ఉన్న భోజనమే నలుగురూ తిన్నారు.

ధర్మయ్య చూపిన సామానులు తీసుకు సాయంత్రం వంట ప్రయత్నానికి శాంతమ్మ ఉపక్రమించింది.

శాంతమ్మకు ధర్మయ్య అంత తొందరగా తన యింట్లో అవకాశం యివ్వడం ఆమెకు చాలా ఆశ్చర్యంగా తోచింది. అయితే ధర్మయ్యమాత్రం మనుష్యుల మొగాలు చూడ్డంతోనే వాళ్ళ చిత్తప్రవృత్తిని తెలుసుకోగల శక్తి మొదట్నుంచీ అతనిలో వుంది. కాకుండా శాంతమ్మ పుట్టింటివారూ – ధర్మయ్య ఒకే యింటిపేరు గలవాళ్ళు కావడం, ఆమె చెప్పిన బంధువుల పేర్లవల్ల అంత దగ్గిర గాకపోయినా తనకు శాంతమ్మ దూరపుచుట్టం కావడం జరిగింది.

లక్ష్మి భవిష్యత్తుకోరిన ధర్మయ్యకు, సద్వర్తనంగల శాంతమ్మ చేతులో పెరగడం చాలా సంతుష్టికరమైన సంగతి.

ఆనాటినుంచీ, ధర్మయ్య శాంతమ్మ అన్నా చెల్లెలుగా ఆ యింటిలోనే ఉంటూ, సంతుష్టిగా జీవనోపాధి చేస్తున్నారు.

(ఇంకావుంది)

★ మా సుందరమ్మక్క ★

(16-వ పేజీ తరువాయి)

ముఖాన్ని గోడవైపుకు త్రిప్పుకొన్నది. తన విశాల నయనాల్లోనుంచీ కన్నీటి జలపాతాలు క్రిందికి దూకడం నేను చూడలేదని ఆమె ఉద్దేశమేమో!

ఇదే అదను, నీ పథకాన్ని అమల్లో పెట్టవోయ్ అన్నదినా అంతరాత్మ! ప్రారంభించాను. "చూచావా అక్కయ్యా! అతడెంతపని చేశాడో ఈలా అతడెందుకు చేశాడనుకొన్నావ్, నిన్ను సాధించాలని. మానవజాతి చరిత్రలో పురుషుణ్ణి స్త్రీ సాధించిన ఘట్టాలున్నాయిగానీ, స్త్రీని పురుషుడు సాధించిన ఘట్టాలు ఇంతవరకూ లేవు, ఇక వుండబోవు. నువ్వు కొంచెం గుండె నిబ్బరంచేసుకొని మీ పుట్టింటికి వెళ్ళిపో? అతడు తనంతటతానే అక్కడికి వచ్చి నిన్ను రమ్మని వేడుకోకపోతే నా పేరు మారుపేరు పెట్టు" అన్నాను. నా మాటలు విన్నంత సేపూ విని ఆమె "అక్కడికి నేనొక్కదాన్నే ఏముఖం పెట్టుకొని వెళ్లను తమ్ముడూ? నేనెప్పుడూ అలా వెళ్లిందీలేదు, ఇప్పుడసలే పోలేను" అన్నది-గద్గదమైన కంఠంతో. నాహితబోధ మహాబధిరునికి శంఖారావంలా ఆమెదగ్గర వమ్మైపోగానే, "ఛత్! ఈ ఆడా మొగుళ్ళ వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోవడం మన పొరబాటు. వీళ్లేం మనం చెబితే వినేవాళ్లా?" అనుకొని "సరే, నేను వస్తానక్కయ్యా!" అని అక్కడి నుంచీ బిరబిరా వచ్చేశాను.

ఆరోజు సాయంత్రం సూర్యుని స్వర్ణకాంతులు మాఇంటి అరుగుమీద పడుతుంటే వెచ్చగా వుంటుందని అక్కడ కూచొని చదువుకుంటున్నా. అనసూయ స్కూలు నుంచీ పరుగెత్తుకుంటూ వస్తున్నది. దాని గస, బుస చూచి "ఏమిటే నీ రభస?" అన్నాను. అది తన బ్యాగులోనుంచీ నాలుగైదు కొత్త రిబ్బన్లు, రెండుమూడు రబ్బరు బెలూన్లు పైకి తీసి "చూచావా బావా! మానాన్న కొని ఇచ్చాడు" అన్నది. "ఎక్కడున్నాడే మీ నాన్న?" అన్నాను ఆశ్చర్యంగా. అది నా ప్రశ్నకు బదులు చెప్పకుండా "ఇవ్వేనా? ఇంకా ఎన్నో తీసిచ్చాడు. ఎన్ని గులాబీ పూలను కొన్నావ్? ఒక్కొక్కటీ ఇంతింత పెద్దది" అంటూ తుర్రున వాళ్లింట్లోకి పారిపోయింది. నేను దానివెంట పడ్డాను. సుందరమ్మక్క రిబ్బన్లను, బెలూన్లను, రోజాపువ్వుల్ని చూచి విస్తుపోయినా, నే నక్కడ ఉండడం మూలాన కూతురితో మాట్లాడలేకపోతోంది. అందువల్ల నేనే కలగజేసుకొని అనసూయను 'అసలు కథేమిటే' అని అడిగాను.

అనసూయ స్కూలునుంచీ వస్తుండగా టౌన్‌హాలుముందర వేపచెట్టుక్రింద నిలుచొని వుండి మోహనరావు దాన్ని పిలిచి, వరుసగా అది కోరిన వస్తువులు కొనిచ్చి తనంతకు తానే రోజాపువ్వుల్ని కూడా తీసి బ్యాగ్‌లో పోశాడట. తరువాత నేమో అనసూయ "రా నాన్నా! అమ్మ నీకోసం బెంగపెట్టుకొంది" అని పిలవగా అతడు "అమ్మో! మీ అమ్మంటే సామాన్యమైందనుకొన్నావా? కొట్లాడి నన్ను ఇంట్లోనుంచీ తరిమేసింది గదా! ఇక నేను ఏముఖం పెట్టుకొని ఆ ఇంటికి రాను? నేను ఒక మంచి బంగళాకొని అందులో వుండబోతున్నాను. నువ్వు నాతో కూడా వుంటావా? మీ అమ్మదగ్గరే వుంటావా!" అని అడిగాడట! "అమ్మైతే ఏమీ కొనివ్వదు. నేను నీదగ్గర్నే వుంటాను నాన్నా" అన్నదట అనసూయ! "సరే, ఇప్పటికి నువ్వు వెళ్ళిపో. బంగళా కొనగానే నా వెంట వచ్చేద్దువు గాని" అని మోహనరావు పెద్దబజారులోబడి ఎక్కడికో వెళ్ళిపోయాడట.

ఈ కథనాన్ని వినిపించిన అనసూయతో "ఆ తండ్రికి తగిన కూతురివేలే నువ్వు" అని సుందరమ్మక్కవైపు చూశాను. ఆమె రోజాపువ్వుల్ని ఒక్కొక్కటిగా తీసి వారగా పెడ్తున్నది. ఆమె నేదైనా మాట్లాడించాలనుకొని "ఎన్ని పువ్వులున్నా యక్కయ్యా?" అన్నాను. ఆమె పువ్వులన్నింటినీ ఒక కుప్పగా పెట్టి టకీమని సమాధానం చెప్పింది "ఇరవై తొమ్మిదీ" అని!

పేషన్లు ముదిరిపోయిన ఈకాలంలో ఆడవాళ్ళు తల్లో ఒకటి రెండు గులాబీల కంటే ఎక్కువ పెట్టుకోరుగదా, ఈ ప్రబుద్ధుడు ఎందుకని ఇన్ని పూలుతీసి పంపాడో అని నేను విస్తుపోతూ ఈజీ చేర్లో వాలిపోయాను. ఐదు నిమిషాలు మౌనంతో గడచిపోయినతరువాత సుందరమ్మక్క "ఈదినం నాపుట్టిన రోజు తమ్ముడూ" అన్నది మెల్లగా. నేను లేచి నిటారుగా కూచొని "ఎన్నో ఏడు పెట్టిందేమిటి?" అని అడిగాను. "నిన్నటితో ఇరవై ఎనిమిది పూర్తై ఈరోజు ఇరవైతొమ్మిదో ఏడు ప్రారంభమైంది" అన్నదామె!

* * *

కాకినాడలో మాదగ్గర బంధువుల ఇంట్లో పెళ్లయితే దానికి వెళ్లి పదిరోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చాము నేనూ, మా అమ్మ. వచ్చేసరికి పక్కింట్లో ఎవరో కొత్తవాళ్లు కాపురమున్నారు! మోహనరావు గారి కుటుంబం ఏమైపోయిందని ఇరుగు పొరుగువాళ్ళని విచారించాను. ఐదారు రోజుల క్రితం ఒక జట్కా వచ్చి ఆ ఇంటి ముందర నిలవగా సుందరమ్మక్క అనసూయతో సహా అందులో వెళ్ళిపోయిందట! మళ్ళీ మోహనరావు వచ్చి ఒకలారీ నిండుకు సామాన్లు భర్తీచేసుకొని ఇంటిని ఖాళీచేసి వెళ్లిపోతూ ఎవరో అడగ్గా తాను

★ మా సుందరమ్మక్క ★

గాంధీ రోడ్డులో ఒక కొత్తఇంటినికొన్నట్టు అందులో కాపురముండబోతున్నట్టు చెప్పాడట.

ఆరోజు సాయంత్రం మోహనరావు మా యింటికి వచ్చి "ఒకసారి మా ఇంటికి వస్తావుట్రా? ఊరినుంచీ రాగానే నిన్ను మీ అక్క పిలుచుక రమ్మంది" అన్నాడు. "రానుపో" అన్నాను రోషంగా! ఇక్కడ నాకు కోపం రావలసిన ప్రమేయమేమిటో స్పష్టంగా నాకే తెలియలేదు! మోహనరావు నవ్వి "మేము మీ ప్రక్క ఇంట్లో నుంచీ వెళ్లిపోయినందుకు నీకు కోపంగా వుందా? ఐతే ఆక్షేపాన్ని నువ్వు చూపవలసింది నామీద కాదు, మీ అక్కమీద. ఈ ఇంటిని ఖాళీ చేయడానికి, ఆ ఇంటిని కొనడానికి అదే కారణం" అన్నాడు. "కొంచెం వివరించి చెప్పకూడదా! మీ కలహాలకు మూలకారణమేమిటో నాకు తల కొట్టుకొన్నా తెలియడంలేదు" అని ప్రతిమాలుకొన్నాను.

దాదాపు ఏడెనిమిదేండ్లనుంచీ సుందరమ్మక్క ఒక ఇంటిని కొనాలని మోహనరావుతో పోరుతోందట. ప్రతినెలా ముప్పైరూపాయలవంతున సంవత్సరానికి మూడొందల అరవైరూపాయలు అద్దెచెల్లించడంకన్నా ఒకేసారిగా ఏడెనిమిదివేల రూపాయలతో ఒక ఇల్లు కొనేస్తే ఆడబ్బు ఆదా కావటమేగాక, ఇల్లు స్థిరాస్తిగా మిగిలిపోతుందని ఆమె వాదనట. ఐతే ఒక్కసారిగా అంత పెద్దమొత్తం ఎక్కడినుంచీ తేను అని మోహనరావు కొంతకాలం ఊరుకోగా అతని పిత్రార్జితమైన భూమిలో కొంతవరకొంత తెగనమ్మైనా ఇంటిని కొనవలసిందేనని సుందరమ్మక్క పట్టుబట్టిందట. ఆభూమి అసేదగ ఉన్నదే తప్ప, అది మెట్టకావడంవల్లా సర్వాలు శూన్యమై అందునుంచీ ఒక్కదమ్మిడీ ఆదాయమైనా రాకపోవడంవల్లా ఆమె వాదన సబబే అనిపించినా మోహనరావుకు తన తాతముత్తాతలు సంపాదించిన ఆస్తిని అమ్మడానికి ఇష్టం ఉండేదికాదట. "మగవాళ్ళకు ఇష్టమైనా, అయిష్టమైనా కడకు ఆడవాళ్ళ పంతమే గదా నెరవేరేది" అంటూ ముగించాడు మోహనరావు.

"ఇంతకూ నువ్వు ఆనాటి రాత్రి ఇంట్లోనుంచీ ఎందుకు వెళ్లిపోయావో తప్ప మిగతా విషయాలన్నీ చెప్పావు" అన్నాను. "వెళ్ళిపోవడానికి ప్రత్యేకమైన కారణం వున్నది. ఇంటిని కొనవేమా, కొనకపోవడేమా అన్న విషయంపై మాటలు పెరిగి నేను తింటూవున్న అన్నంకూడా విడిచి పెట్టేసి వీధిఅరుగుమైన పడుకొన్నాను. నువ్వు నన్ను మాట్లాడించినప్పుడు కూడా నేనింట్లోనుంచీ వెళ్లిపోదలచుకోలేదు. అర్ధరాత్రి వరకూ అక్కడే పడుకొన్నా. మీ అక్కయ్య లోపలికిరమ్మని పిలిచింది కాదు. సరే, ఇక ఇంటిని కొనేదాకా ఈ ఇంటి గుమ్మమైనా తొక్కగూడదని వెళ్ళిపోయాను" అన్నాడతను.

"అబ్బో! మా సుందరమ్మక్కపైకి అమాయికురాలిలాగే వున్నా నిజానికి మహా ఘటికురాలల్లే వుందే బావా!" అన్నాను. "ఆ విషయం నీ కిప్పటికైనా తెలిసినందుకు సంతోషం. 'ఒక్కొక్కతరి జవరాండ్రు కటారి కత్తియల్' గా బాబూ" అన్నాడు మా మోహనరావు బావ! ★

(౧౧-వ పజీ తరువాయి)

పోయేటప్పటికి గగనమైంది. ఎలాగైతే నేం వచ్చి చెడి కిటికీ దగ్గరకు చేరి టిక్కెట్టడిగేసరికి, వాడు "ఆఅణా మంచిది కా"దని డబ్బులు నాపైపుకు నెట్టేసి మిగిలినవాళ్లకు టిక్కెట్లు యిచ్చేస్తున్నాడు.

'దేవుడా' అనుకొంటూ బయటకు వచ్చి, ముసలమ్మతో ఈవిషయం చెప్పేసరికి, ఆమెనోరు యింత చేసికొని, "నా సలు నొక్కుకొంటూ బలే వాడవే! ఏదో మంచివాడవని నిన్ను అడిగితే ఎక్కడో చెల్లని అణా తీసుకొచ్చి-ముసలిముండను కదా అని-నాకు అంటగట్టుదామనుకొంటున్నావా? నీ అణా నువ్వే తీసుకో, నా టిక్కెట్టు నాకు తెచ్చియ్యి" మంది. నేను నిర్ఘాంతపోయాను. ఈవిడతో యిప్పుడు వాదిస్తూ కూర్చుంటే అవతల బండి తప్పిపోయేలా వుంది. అఘోరిస్తూ జేబు తడుముకొన్నాను. ఒక బేడబిళ్ళ; ఒక అణాబిళ్ళ వున్నై! 'సరే' బ్రతికామనుకొని మళ్ళా ఆజనంలోకి వెళ్ళి, ఎట్లాగయితే నేం టిక్కెట్టు తెచ్చియిచ్చాను.

ఎంత అనుభవముందోగాని, చూడంగానే "టిక్కెట్టుమీదతొమ్మిదణాలుఅని అచ్చువేసి వుంటే, నువ్వు పదణాలు కాజేస్తివే, మిగిలిన అణా మర్యాదగా యియ్యి" మంది. ఇప్పుడు రేట్లు మారాయని, ఐనా గూడ టిక్కెట్టుమీద పాతరేటే ఉంటుందని, నెత్తిన నోరు పెట్టుకుని లబోదిబో మన్నాను. అప్పటికీ ఆవిడగారి ఆగ్రహం ఆగకపోగా, పక్కనున్న ముగ్గురు పెద్దమనుష్యులచేత సాక్ష్యం ఇప్పించాను. మొత్తానికి ఆవిడను ఒప్పించేసరికి బ్రహ్మప్రళయమైందంటే నమ్మండి.


అప్పటికి ఆ ముసలమ్మ సణుక్కొంటూ గొణుక్కొంటూ మూట ఏదో చంకను పెట్టుకొని వెళ్ళింది. బయటికివచ్చి చూద్దును గదా, నాసంచి కనిపించలేదు! స్టేషనులో చాలసేపు వెదికాను. వెదుకుతూ వెదుకుతూ వుండగా, ఇందాక ముసలమ్మ చేతికిచ్చినట్టు గుర్తుకొచ్చింది. ప్లాట్‌ఫారంమీదికి పరుగెత్తాను.

అప్పటికే రైలు వెళ్ళి చాలా సేపు అయిందన్నాడు టి. సి.

"అబ్బా!- నిజంగా ఇంతసేపు వెదికానా!" అనుకొంటూ, ప్రయాణం తప్పిపోయినందుకూ, నిక్షేపంలాంటి సంచీ, సరుకులూ పోయినందుకూ ఏడుస్తూ యింటి మొఖం పట్టాను.


మంచికిపోయి యీ శాపం నెత్తిమీదికి తెచ్చుకొన్నానని మా యింట్లోవాళ్లని యెలా నమ్మించాలో నాకు యిప్పటికీ తెలియటం లేదు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras



విక్టోరియా మెమోరియల్ హాల్—కలకత్తా

ఫోటో—శ్రీ ఏ. చక్రవర్తి (మచిలీపట్నం.)



★

తాజ్ హోటల్ (బొంబాయి)

ఫోటో—శ్రీ కొంపల్లి సుబ్రహ్మణ్యం

'గాయత్రిగారూ! ఈసారి మీరు నిశ్శబ్దంగా దుఃఖించండి,' అని ఉపదేశిస్తాడు డైరెక్టరు.

గాయత్రి నిశ్శబ్దంగా దుఃఖిస్తుంది.

'ఓకే. లైట్స్ ప్లీజ్!'

క్లాప్‌బోయ్ వచ్చి ఆమె ముక్కుదగ్గర క్లాప్‌బోర్డుపెట్టి టక్ మని పిస్తాడు. గాయత్రి నిశ్శబ్దంగా దుఃఖిస్తుంది. కెమేరా టుర్ మని శబ్దం చేస్తూ ఫొటో తీస్తూంటుంది.

'కట్. ఓకే,' అంటాడు డైరెక్టరు.

ఇలా షాట్ తరవాత షాట్ మెల్లిదిగా పూర్తవుతుంది. గాయత్రి ఇందాక ఎవర్ని తలుచుకుని నిశ్శబ్దంగా దుఃఖించిందో, ఆ వ్యక్తిని ఇంతవరకూ ఆమె చూసివుండక పోవచ్చును. బహుశా అతన్ని మళ్ళీ మెయ్యి బోయే సెట్‌లో కలుసుకోంటుంది:

'అమ్మయ్య. ఇవాళ్ళ చాలాపని చేసేశాం. పదిషాట్లు షూట్ చేశాం. ఫరవాలేదు,' అని డైరెక్టరు నీరసంగా కుర్చీలో కూలబడుతూ అంటాడు. 'కాంపనీని ఈయన్ని ఈ కుర్చీలోనే మోసికెళ్లాలేమో ఇంటికి?' అని ఆయన పరిస్థితి గమనించిన అసిస్టెంట్లు అనుకుంటారు. డైరెక్టోరియల్ పని అంటే అంత కష్టం. ఇంతా చేస్తే ఆయన ఆ రోజున షూట్ చేసిన పదిషాట్లూ అయిదారు నిమిషాల సేపైనా తెరమీద కనిపిస్తాయో లేదో. ఒక్కొక్కసారి అషాట్లు అనవసరమై బుట్టదాఖలైనా కావచ్చు.

పాఠకులు మరొక విషయంకూడా గుర్తుంచుకోవాలి. సినిమా చూస్తున్నప్పుడు నాయిక నాయకునికోసం విరహతాపాలు పడటం, కన్నీళ్ళు కార్చటం చూస్తాము. నాయిక నిజంగా ఈ వివిధావస్థలు అనుభవించిం దనుకునేరు. వట్టిది, వట్టిది. అవన్నీ కేవలం నంబర్లు. కాని మీరు సినిమా భ్రాంతి పోకుండా వుండాలనివుంటే గప్‌చిప్‌గా సినిమాను సినిమాగానే చూడటం మంచిది; మరీ అంత విమర్శగా స్తనశల్య పరీక్ష చేసి చూడటం అనవసరం.

"డిసీజ్ ది లాబ్, ప్లీజ్!"

ఆధునిక చలనచిత్రాలు టెక్నికల్‌గా ఇంకా ఎంతో అభివృద్ధి కావలసి వున్నట్లు కనిపిస్తుంది. చిత్రనిర్మాణంలో ఇంకా పాత పద్ధతులే అమల్లో వున్నాయి. ఉదాహరణకి నటీనటులను తీసుకోండి. నటీనటులచేత ఇంకా చక్కగా నటింపచేసే యంత్రాలు, ఇంకా త్వరగా, తక్కువ ఖర్చుతో నటింపజేసే యంత్రాలు రావటం చాలా అవసరం. బహుశా కొంతకాలానికి ఇవి కూడా వస్తాయేమో.

కాని షూట్ చెయ్యబడిన ఫిలింముక్కల దగ్గా చూడండి. ఇవి అందమైన, అద్భుతమైన యంత్రాల్లోకి వెడతాయి. ఒక యంత్రంలోకి వాటిని తోస్తే నిమిషంలో డెవలప్ కావటం, ప్రింట్ కావటం చకచకా జరిగిపోతుంది. మళ్ళీ వాటిని ఇవతలకు తీసి, బాగా తెల్లబడిన భాగాలను, బాగా నల్లబడిన భాగాలను గుర్తుపెట్టుకుంటారు. అప్పుడు వాటిని ఇంకో యంత్రంలోకి తోస్తారు. ఆ యంత్రం రెండు నిమిషాల్లో ఆ లోపాల్ని టకటకా సరిదిద్దేస్తుంది. తరవాత ఫిలిమును, సౌండ్ ట్రాక్‌ను సింక్రొనైజ్ చేసుకుంటూ పోతారు. తరవాత ఫిలిమ్‌ను 'టచ్' చేసుకుంటూపోతారు.

ఈ పని అంతా ఎలాంటిచోట జరుగుతుందనుకున్నారు? అందమైన గాజు గదులుంటాయి; వాటిలో నుంచి పారదర్శకాల్లాగ మెరిసి నిగనిగలాడుతూ నిలబడిన యంత్రాలుంటాయి. మనుష్యులుకూడా నీటుగా, నిశ్శబ్దంగా, తళతళలాడే ఫిలిం రీల్సు పట్టుకుని పనిచేస్తూంటారు. చూట్టానికి చాలా హాయిగా వుంటుంది. షూటింగ్ జరిగే స్టూడియోతో పోల్చిచూస్తే లాబొరేటరీభవనం ఇంద్రభవనంలాగానే వుంటుంది. ఆధునిక విజ్ఞానశాస్త్రం సాధించిన మహత్తర విజయాలకు నివ్వెరపోవడంతప్ప మనం చేయగలిగిం దేమీ లేదు. అసలు మనిషి పనికీ, యంత్రం పనికీ ఈ భేదా ఎప్పుడూ ఉంటుందనుకుంటాను. మనిషి చేసే పని అరాజకంగా, కల్లోలితంగా,



సాసైటీ వారి "ప్రపంచం" లో జి. వరలక్ష్మి, రామశర్మ

★ సినిమా ఎల్లా తీస్తారు? ★

చక్త ఆధారంతో కూడినదిగా ఉండడం తప్పదు. యంత్రం చేసేపని ఎప్పుడూ నీటుగా, క్రమబద్ధంగా, ఏ గాదరబందీ లేకుండా వుంటుంది.

లాబొరేటరీలో ప్రాసెస్ అయి బయటికి వచ్చే ఫిలిం ఇంకా అసంస్కృతంగానే వుంటుంది. దాన్ని ప్రొజెక్షను గదిలో తెర మీద ప్రొజెక్టుచేసి చూసుకుంటే ఈ విధంగా కనిపిస్తుంది!

క్లాప్‌బోయ్ క్లాప్‌బోర్డు పట్టుకుని ముందుకు వస్తాడు. దానిమీద సీనునంబరు, షాట్ నంబరు, టేక్ నంబరు రాసివుంటాయి. క్లాప్ చెయ్యగానే మెరుపులాగ వెనక్కి వెళ్ళిపోతాడు. వెంకయ్యగారు బల్లవద్ద కూర్చుని రాసుకుంటూ వుంటాడు. తలుపు తట్టిన చప్పుడు వినిపిస్తుంది. వెంకయ్యగారు తలెత్తి చూస్తాడు. 'ఎవళ్ళది?' అని తరవాత ఏమనాలో జ్ఞాపకం రాక ఆగుతాడు. 'స్టాప్!' అని డైరెక్టరు ఉరుముతాడు. "ఏమిటయ్యా, ఉన్నవి రెండుముక్కలూ, ఆ రెండూ మర్చిపోతే..." అని డైరెక్టరు గారి గొంతుక వినిపిస్తుంది.

మళ్ళీ క్లాప్‌బోయ్ రావడం, క్లాప్ చేసి వెనక్కి వెళ్ళడం, వెంకయ్యగారు 'ఎవరది? ...లోపలికి రండి,' అనడం, రామారావు లోపలికి రావడం తెరమీద కనిపిస్తుంది. 'స్టాప్' అని మళ్ళీ డైరెక్టరు గర్జన, 'డామిట్, ఎవరక్కడ చప్పుడు చేసింది? ఎవరతను? ఎందుకొచ్చాడిక్కడికి?...' ఇత్యాది దూషణవాక్యాలు వినిపిస్తాయి.

తరవాత ఇంకో సీను కనిపిస్తుంది. క్లాప్ బోయ్ వస్తాడు, వెడతాడు. గాయత్రి తల క్లోజప్ కనిపిస్తుంది. 'నే నొప్పుకోను, ముమ్మాటికీ ఒప్పుకోను,' అంటుంది తల. 'కట్. ఓకే,' అని డైరెక్టరు గొంతిక వినిపిస్తుంది.

మళ్ళీ ఇంకో సీను. మళ్ళీ క్లాప్ చప్పుడు వినిపిస్తుంది. గాయత్రి తల క్లోజప్ తెర మీద నిండుతుంది. 'నిశ్శబ్దంగా దుఃఖించాలి,' అని డైరెక్టరు గొంతిక. గాయత్రి కంటిలో నీటి బొట్టు తొంగిచూస్తుంది. 'కట్......ఓకే,' అని తిరిగి డైరెక్టరు గొంతుక.

ఆ సీను అయిపోతుంది. ప్రొజెక్షన్‌గదిలో కూర్చున్న డైరెక్టరు అంటాడు: 'ఈషాట్ బాగాలేదు. గాయత్రి ముఖంమీద ఎక్కువ నీడ పడింది. ఇది మళ్ళీ షూట్ చెయ్యాల్సిందే.'

ఇలాగ ఒక టేక్ తరవాత ఒక టేక్ తెరమీద ప్రొజెక్టుచేసి చూసుకుంటారు. క్లాప్‌బోర్డు, డైరెక్టరు గొంతిక, అన్నీ ఉంటాయి. ఒకచోట బొమ్మ సరియైన ఫోకస్‌లో ఉండదు. ఒకచోట అనుకున్న ఎఫెక్టు రాదు. ఇంకోచోట మైక్రోఫోనో, స్పాట్‌లైటో ఫ్రేములోకి వస్తుంది. ఈ షాట్లన్నీ తిరిగి షూట్ చేసుకోవలసిందే. కొన్ని షాట్లలో సౌండ్ సరిగ్గా 'సింక్' కాదు. దీన్ని తేలిగ్గా సరిదిద్దుకోవచ్చు. ఆతరవాత ఎడిటింగ్ రూమ్‌లో ఆప్టికల్ యంత్రాల ద్వారా వైప్, డిసాల్వ్, ఫేడౌట్ ఇత్యాదులన్నీ ఆయా షాట మధ్య చేర్చబడతాయి. స్లోకటింగ్, క్విక్ కటింగ్, మాంటేజ్ ఇత్యాది పద్ధతులు అవలంబించబడతాయి. షాట్లన్నీ కథాక్రమంలో గుచ్చెత్తబడతాయి. చివరికి చిత్రం తయారవుతుంది. కాని డైరెక్టరు కొన్నిచోట్ల అనవసరంగా పొడుగెక్కువై పోయిందని భావించి "ఇరవై నిమిషాల టైమ్ కత్తిరించాలి,' అని నిర్ణయిస్తాడు.

ఇంతలోకే ప్రొడ్యూసరువచ్చి ఫలానా డైలాగు బాగులేదనీ, ప్రజలకి ఆ డైలాగు నచ్చదనీ చెప్పి కత్తిరించమంటాడు. తరవాత సెన్సార్ అధికారి చిత్రం అంతా చూసి ఫలానా సీనులో సెక్సు అప్పీలు జాస్తిగా వుందని అది తీసెయ్యాలనీ అంటాడు. లేక విలన్ ఒక స్త్రీ పాత్రను గొంతునులిమి చంపటం భయానకంగావుంది గనక తీసెయ్యమంటాడు.

మళ్ళీ ఫిలిమును కంటిన్యూయిటీ చెడకుండా ఎడిట్ చెయ్యాలి. ఆ తరవాత కాపీలు ప్రింటుచెయ్యాలి. అప్పటికి

అఆ ఫిలిమ్స్‌వారి
మహోజ్వల చిత్రం

విడుదల తేదీ ప్రకటించబడుతుంది.

వెనకటికి ఎనటోల్ ఫ్రాన్సు ఒకమాట అన్నాడు: 'ప్రపంచంలోవున్న వివిధ రాజ్యాల సైన్యాలన్నీ గొప్పవే, అన్నీ ఉత్తమమైనవే,' అని. అలాగే సినిమా లోకంలో ప్రతి చిత్రమూ మహోజ్వలమైనదే; అపూర్వమైనదే; అద్భుతమైనదే. అఆ ఫిలిమ్స్‌వారు చిత్రం నిర్మిస్తున్నంత కాలమూ తమ చిత్రం బాక్సాఫీసు రికార్డులు బద్దలు గొట్టేస్తుందనే ఉత్సాహంలోనే వుంటారు. ఈలోగా ఇఈ ఫిలిమ్సువారు, ఉఊ ఫిలిమ్సువారు 'చూద్దాంగా, వీళ్ళ ఫిలిమ్ ఏమాత్రం బావుకుంటుందో' అని అసూయగా తమలో తాము అనుకుంటారు.

కాలం గడిచినకొద్దీ, షూటింగ్ పురోగమిస్తున్నకొద్దీ, అఆ ఫిలిమ్సువారు తమ చిత్రంతాలూకు వార్తలు, స్టిల్ ఫొటోలు, ప్రకటనలు పత్రికల్లో అచ్చు వేయిస్తూంటారు. చాలా బ్రహ్మాండమైన సెట్లు వేశారనీ, చాలా లక్షలు ఖర్చు పెట్టారనీ, గాయత్రి, భాగేశ్వరరావు అద్భుతంగా నటించారనీ, గొప్ప బాక్సాఫీసు హిట్ అవుతుందనీ వార్తలు బయటి ప్రపంచంలోకి పాకి శ్రోతలను నిర్ఘాంత పరుస్తూ వుంటాయి.

చివరికి చిత్రం విడుదల అవుతుంది. ఇంతకాలం, ఇన్ని నెలలు, డైరెక్టరు దగ్గిర్నించి క్లాప్‌బోయ్‌వరకూ ఇంతమంది కష్టపడి తయారుచేసిన చిత్రం తెరమీద ప్రేక్షకులకు దర్శనమిస్తుంది. వెంకయ్యగారు తలెత్తి 'ఎవరది? లోపలకి రండి,' అంటాడు. గాయత్రి 'నేనొప్పుకోను, ముమ్మాటికీ ఒప్పుకోను,' అంటుంది. ఇలాగ అంతా సజావుగా సక్రమంగా జరిగిపోతుంది.

రెండో రోజున ఇఈ ఫిలిమ్స్ ప్రొడ్యూసరు ఉఊ ఫిలిమ్స్ ప్రొడ్యూసరును ఫోనులో పిలిచి అడుగుతాడు:

'అఆ ఫిలిమ్స్‌వాళ్ళ చిత్రం ఎలా పోతోంది?'

'బాగా పోతోందిట. బాక్సాఫీస్ హిట్టేనట.'

'నిజంగానే. అగె.'

(సంపూర్ణం)

సినిమా వార్తలు

యునైటెడ్ టెక్నీషియన్స్‌వారూ, శ్యామలాస్టూడియోవారు కలిసి నిర్మిస్తున్న తెలుగుసాంఘికచిత్రం "పల్లెపడుచు" సగం దాకా పూర్తయిందని తెలుస్తోంది. దర్శకుడు, ఫొటోగ్రాఫరు శ్రీ బోళ్లసుబ్బారావు; రచన శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి ("దత్తత" సీరియల్ వ్రాస్తున్నవారే,); సంగీతం శ్రీ ఎమ్. ఎస్. రామారావు; నటీనటులు కృష్ణకుమారి, విద్య, జయలక్ష్మి, రమాదేవి, సి. ఎస్. ఆర్., ముక్కామల, రామశర్మ, సీతారాం, కుటుంబరావు, చలం, రచయిత పినిశెట్టి తదితరులు. "పల్లెపడుచు" కథకు మూలం అదేపేరుతో శ్రీ పినిశెట్టి వ్రాసిన నాటకం. ఇది ఆంధ్రదేశంలోను, మద్రాసులోను చాల సార్లు ప్రదర్శించబడి ప్రేక్షకుల ప్రశంసలు చూరగొన్నది. జమీందారుకు, రైతుకుటుంబానికి జరిగే సంఘర్షణ కథావస్తువు. ఈ చిత్రం షూటింగ్

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ. జి. యన్. రావ్—నల్గొండ.

మహారాష్ట్రులలోను, ఆంధ్రులలోను ఎవరు సంగీత సాహిత్య సాంకేతిక చిత్రములు నిర్మించుటయందు నిపుణులు?

—ఉభయులూ నిపుణులే. వాహినీవారి "మల్లీశ్వరి" సంగీత సాహిత్య సాంకేతిక విషయాలలో మనం గర్వించదగిన చిత్రమే. అలాగే మహారాష్ట్రులు గర్వించదగినచిత్రం "అమర్ భూపాలి" ఉన్నది. కాని "మల్లీశ్వరి''తో పోల్చదగిన చిత్రాలు తెలుగులో ఎన్ని ఉన్నాయి?

*　*　*

శ్రీ ఎమ్. రామసుబ్రహ్మణ్యం—ఎలమంచిలి.

మద్రాసులో తెలుగువారు హెచ్చు వుంటారా లేక అరవలు హెచ్చుమంది వుంటారా?

—ఎవరెక్కువ వుంటేనేం, మద్రాసు మనకు రాకుండాపోయిన తరవాత?

*　*　*

శ్రీ రావుల నాగేశ్వరరావు—పెద్దాపురం.

ప్రకాశరావుగారు స్వంత స్టూడియో నిర్మించుకొన్న తరువాత తీసిన "కన్నతల్లి" చిత్రములో విద్యార్థులయొక్క నడవడికను గురించి అవమానకరముగా చిత్రించుటకు వారి ఉద్దేశ్యము ఏమిటో సెలవిప్పించెదరా?

—"కన్న "తల్లి"లో విద్యార్థులను చిత్రించిన విధమును మేము సమర్థించడం లేదు. కాని ఇటీవల ఒకధోరణి ప్రబలుతున్నది. ఒక కోడలు గయ్యాళిగాఉన్నట్లు చిత్రిస్తే దేశంలోని కోడళ్లందరికీ కోపం వస్తుంది; ఒక అత్త గయ్యాళి అని చిత్రిస్తే దేశంలోని అత్తలందరికీ కోపం వస్తుంది; ఇలాగే ఒక కులానికి చెందిన ఒక పాత్రను మోసగాడుగా చిత్రిస్తే ఆ కులంవారందరికీ కోపంవస్తుంది. ఒక వృత్తికి చెందినపాత్రను మోసగాడుగా చిత్రిస్తే ఆవృత్తివారందరూ మండిపడతారు. ఇంతసంకుచితంగా ఆలోచించడం మొదలిడితే ఏకథా రాయడానికీ గాని, చిత్రం తీయడానికిగాని పనికిరాదు. ఒక పాత్రను సహజంగా చూపించారా లేదా అని మాత్రమే ఆలోచించాలిగాని దుర్మార్గుడుగా చిత్రించబడిన ఒక పాత్ర ఫలానావర్గానికి చెందినపాత్ర గనక ఆవర్గం వారంతా కుపితులు కాగూడదు.

*　*　*

కుమారి కమలాదేవి—హైద్రాబాద్.

మహాశయా! హిందూ స్త్రీ ప్రేమించి పెళ్ళి చేసుకోడం అధర్మమా?

—అధర్మమని ఎవరన్నారు? ఎవరన్నా అంటే నలదమయంతుల కథ, సావిత్రీ సత్యవంతుల కథ ఉదహరించండి.

విద్యావతులైన పెళ్ళిగాని పడుచుపిల్లలు ప్రేమను కవిత్వ రూపంలో వ్రాయడం తప్పా?

—పెళ్ళి కాకముందే ఎవరైనా ప్రేమ కవిత్వం రాసేది. పెళ్ళి అయిన తరవాత సంసార తాపత్రయంలో ప్రేమనుగూర్చి కవిత్వం రాసే ఓపిక ఉంటుందా?

ఒక ఆడపిల్లలో వుండవలసిన లక్షణాలు చెబుతారా?

—ఆడపిల్ల లక్షణాలే వుండాలి; మగ లక్షణాలు వుండగూడదు.

*　*　*

శ్రీ మేలిసీమ రామన్న—లక్ష్మవరము.

విద్యార్థులు సినిమా నటీనటులను, సినిమా పరిశ్రమనుగూర్చి తెలుసుకోవడం వలన కలుగులాభమేమి?

—ఆసంగతి విద్యార్థులకే బాగా తెలియాలి.

*　*　*

ప్రస్తుతం జమీందారు భవనం సెట్ పై జరుగుతోంది.

*　*　*

నటుడు శ్రీ గౌరీనాథ శాస్త్రి గారు త్వరలో మరొక చిత్రం తీయడానికి నిశ్చయించారు. శ్రీ కె. వి. రెడ్డి ఈ చిత్రం డైరెక్టు చేయడానికి అంగీకరించారు. వాహినీవారి "పెద్ద మనుషులు" జూలై మాసాంతానికి పూర్తవుతుందనీ, ఆగష్టులో శాస్త్రిగారి చిత్రానికి పేపర్ వర్కు పనులు రెడ్డిగారు ప్రారంభిస్తారనీ తెలుస్తోంది.

*　*　*

సినీ రచయిత శ్రీ సదాశివబ్రహ్మంగారు మొదటిసారిగా చిత్రనిర్మాణం సంకల్పించారు. వీరి సంస్థ పేరు "సదాశివ్ పిక్చర్ ప్లేస్." తీయనున్న చిత్రం ఇంగ్లీషు పేరు "ఎడ్వెంచరస్ గర్ల్.' తెలుగు పేరింకా పెట్టలేదు. దర్శకత్వం, రచన కూడా సదాశివబ్రహ్మంగారే. మొన్న 15వ తేదీన శోభనాచల స్టూడియో ఆవరణలో ఉదయం 7 గంటలకు చిత్రం ప్రారంభోత్సవం జరిగింది. శ్రీ సుబ్రహ్మణ్యంచెట్టియార్ (దేవకోట) కెమేరా 'క్రాంక్' చేశారు. ఈచిత్రంలో తారాగణం ఇంకా నిర్ణయంకాలేదు.

*　*　*

అశోక్ సినీ ప్రొడ్యూసర్సువారు తమిళంలోనూ (ఆశైమగన్), మలయాళంలోనూ (ఆశాదీపం) తీస్తున్న చిత్రంలోకి కొత్తగా పద్మినిని బుక్ చేశారు. బి. ఎస్. సరోజ, గిరిజ, ఆర్. గణేశ్, టి. ఎస్. బాలయ్య మున్నగువారు తదితర నటీనటులు. దర్శకుడు జి. ఆర్. రావు; సంగీతం దక్షిణామూర్తి; స్టూడియో వాహిని. ★

త్రీ-డీ చిత్రాల తమాషా

(49-వ పేజీ తరువాయి)

అదల్లా వుంచి క్లోజప్ కూడా కష్టసాధ్యమవుతుంది. క్లోజప్ సినిమా టెక్నిక్‌లో ఒక ముఖ్యాంగం. సినిమాస్క్రీన్ తెరమీద తల క్లోజప్ ఇస్తే ఎంత భయానకంగా ఉంటుందో చెప్పక్కర్లేదు.

శబ్దగ్రహణంవల్ల సినిమాకళకు గొప్ప ప్రయోజనం లభించింది; కేవలం కెమేరాతో చెప్పలేనిదాన్ని శబ్దంవల్ల చెప్పడానికి వీలైంది. అందుచేత శబ్దగ్రహణం నిజమైన కళావిప్లవం. ఇక త్రీ-డీ చిత్రాలవల్ల సినిమాకళకు కలిగే కొత్త ప్రయోజనము ఏమిటి? దీనికి సమాధానం మరికొంతకాలం పోతేగాని తెలియదేమో. మామూలు గుల్ల కగుప్త ప్రతిబింబాలవల్ల సాధించలేని కళావిశిష్టత త్రీ-డీవల్ల చేకూరగలుగుతుందో లేదో కాలమే నిర్ణయించాలి. ★


తేదీకై
నిరీక్షింపుడు
పక్షిరాజా వారి ...
ఒక తల్లి పిల్లలు
తెలుగు
BHARAT STUDIO



పిల్ల: మన పాపాయి పుట్టినప్పుడు కళ్లు తెరుచుకునే పుట్టిందా అమ్మా?

తల్లి: లేదమ్మా! ఏం?

పిల్ల: నేనూ అదే అనుకొన్నాను; లేకపోతే మీలాంటి వాళ్ల యింట్లో అదిపుట్టకపోను!

—మిస్. హేమా (నాగపూరు)

★ అంగుళిమాల ★

(37–వ పేజీ తరువాయి)

మెందుకు? ఈసన్యాసినే గురు దక్షిణ నెపంతో బాధిస్తాను'. అని నిశ్చయించి బుద్ధుని సమీపించి కత్తి ఝుళిపించాడు అంగుళిమాల.

శాక్యముని మామూలుగా నడుస్తూనే వున్నాడు. కాని ఆయన్ని కలుసుకునేందుకు ఎంత ప్రయత్నించినా అంగుళిమాల తరం కాకపోయింది. చివరకు ఒక చోట నిలబడి బుద్ధుడు నవ్వుతూ యిలా అన్నాడు. 'నేను చాలించినా నీవు మాత్రం చాలించనే లేదు కదా!' ఈమాటలు అర్థంకాక హింసకుడు, 'స్వామీ-మీ మాటలు నాకు తెలియలేదు. విరళంగా చెప్పరూ-' అని నవినయంగా అడిగాడు. 'అంగుళిమాలా! హింసా విధానాన్ని నేను చాలించాను. కాని నువ్వు మాత్రం నీసోదరులను యింకా హతమారుస్తూనే వున్నావు. ఇకనైనా చంపడం చాలించవా?' అని బుద్ధదేవుడు నవ్వుతూ అన్నాడు.

అంగుళిమాలకు తల నరికివేసినట్లనిపించింది. 'ఈమహానుభావుడు నాకు తరణోపాయం చూపించి నాకు మహోపకారం చేశాడు. ఈయన బుద్ధుడు కావచ్చును' అని అనుకొని వెంటనే కత్తినీ, ధరించిన కవచాన్ని, నమకూరుస్తున్న వేళ్లను, ఎముకల దండను-అన్నిటినీ పారవేశాడు. బుద్ధ దేవుని పాద పద్మములపైపడి, 'నాతప్పును క్షమించి నన్ను తమ శిష్యకోటిలో చేర్చుకోండి! అని ప్రార్థించాడు. వెన్నవంటి పెద్దమనసు అంగుళిమాలను శిష్యకోటిలో చేర్చుకున్నాడు.

నాటినుండీ అంగుళిమాల బౌద్ధ భిక్షువు. బౌద్ధ ధర్మములు తెలుసుకున్నాడు. వాటిని జీర్ణం చేసుకున్నాడు కాని ప్రజలుమాత్రం హింసకుని వికృత స్వరూపాన్ని మరచిపోలేదు. అంగుళిమాల భిక్షార్థం పట్టణంలోనికి వెళ్లినప్పుడు కొంతమంది అతనిపై రాళ్లు రువ్వేవారు. అతణ్ణి నానామాటలు అనేవారు. కాని అంగుళిమాల మాత్రం వాటిని లెక్క చేసేవాడు కాదు. తన్ను హింసించినా సరే అంగుళిమాల సహనంతో వుండేవాడు. ఒకానొకప్పుడు హింసకుడు; ఇప్పుడో అహింసకుడు.

కాలక్రమమున అంగుళిమాల ప్రముఖ బౌద్ధ భిక్షువయ్యెను. బౌద్ధ ధర్మములను జీర్ణించుకొనెను. బుద్ధదేవుని ముఖ్య శిష్యులలో ఒకడయ్యెను. ★

ఆలుమగలు

(23-వ పేజీ తరువాయి)

మాట - మాట వరుసకన్నా గాని, అత్తయ్యా! యిప్పుడు వచ్చినంతలో నాకేం పోయింది ? అమ్మ వుండుతుందిగా.

కామే : ఏమిటి బాబా ! నామీద పెద్ద వుపన్యాసం యిచ్చేశావట.

రాజు : (నవ్వుతూ వసంత వేపు చూస్తాడు) నీకు చెప్తుందని తెలిసే, చెప్పాలనే అన్నా. నాకేం భయం లేదు.

కామే : నీకొకరి భయం యెందు కుంటుందిలే !

రాజు : ఔను! యెందుకుండాలి?

కామే : వుండవలసిన రోజులు గతించిపోయాయి.

రాజు : గతించిన రోజు లందరికీ అలాంటివే - ఆ రోజులు కాలచక్రంతో కలిసిపోతే నే మనకి కొత్త స్వతంత్రం.

లక్ష్మి: మీ రిద్దరెందుకలా జగడమాడ్డం ? అయినా కామేశం - నీకు పెద్దమాట లెక్కువయి పోతున్నయ్.

కామే : నాకు తెలుసు - నువ్వతన్ని వెనకేసుకొస్తావని.

లక్ష్మి : వసంతా ! పోయి బావకు కాఫీ తీసుకురా.

(వసంత లేచి వెళ్ళుతుంది.)

లక్ష్మి : చూడు రాజూ ! యింకా చిన్నతనం - మాటకుమాట జవాబిస్తుంది. మంచి మాటలమీద చెప్పి చేయించుకోవాలి. కొన్నాళ్ళపాటు సహించాలి మరి.

రాజు: ఏదో మాలో మాకు తగవులుండక తప్పుతాయా అత్తయ్యా? అవన్నీ తను చెప్పుకోవటం యెంత సమంజసంగా వుందో నువ్వే ఆలోచించు.

లక్ష్మి : ఔను నాయనా ! నేనుమాత్రం కాదంటానా? అదే నేనుకూడా చెప్పాను.

రాజు : అదికాదత్తయ్యా! నోటి కెంత మాట వస్తే అంతా అది నిక్కచ్చిగా అనేస్తుంది. వెనకా ముందూ చూడదు. తనన్నదంతా అయి తీరవల్సిందే. లేకపోతే మొండి పట్టుతో సామాను విసిరేయటం—యిలాగైతే యెలా భరించటం చెప్పత్తయ్యా.

లక్ష్మి : నాకు తెలుసు బాబూ ! తెలివి తక్కువల్లే పెంకితనం. మరి కొద్దిరోజులు పోయాక దాని బాధ్యత దానికే తెలుస్తుంది. నేనూ చెప్తాలే! అసలు యీ కారణం వల్లనే బాబూ పరాయివాళ్లకిచ్చి పెళ్ళి చేయటానికి, వెనుకంజవేసి పట్టుదలతో నీ కిచ్చాం...

రాజు : (కాఫీ పట్టుకొచ్చి నిల్చున్న వసంత వేపు చూస్తూ) ఏమంటోందో మీ అమ్మ విన్నావా ? నువ్వన్నీ విన్నా, నీ కెవరెన్ని చెప్పినా ఫలితం మట్టుకు సున్నా.

వసం : వూరుకుందురూ ! ఎప్పుడూ యిదేవరుస (కాఫీకప్పు అందిస్తుంది)

లక్ష్మి : (కోపంగా) చాల్లే...

రాజు : (కాఫీ త్రాగేసి) తయారవ్వు వసంతా - రిక్షా తెస్తాను (నిష్క్రమిస్తాడు)


కామే : విన్నావమ్మా; అతని మాటల్లో యెలాంటి గూఢార్థాలున్నాయో ?

లక్ష్మి : అర్థాలేవిటే? తెలివైనవాడు - యెంత నెమ్మది?

కామే : నీకే కన్పించాయి అతని తెలివి తేటలు... నాకెందుకులే ! బయలుదేరు చెల్లీ ! వచ్చాడంటే ఒక్క నిముషం ఆగడు (బయటకు నడుస్తాడు).

తెరవాల్తుంది)


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras




రైలు సిగ్నలు

ఫోటోలు—శ్రీ పి. శివరామరాజు (మద్రాసు)

రోడ్డు సిగ్నలు



Regd No. M 4479 Andhra Patrika Illustrated Weekly



డిస్ట్రిబ్యూటర్సు:

ఆంధ్రా - వినోదా పిక్చర్సు సర్క్యూటు, విజయవాడ. ★ సీడెడ్ - నవయుగ ఫిలిమ్సు, గుంతకల్లు. ★ నైజామ్ - ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాదు. ★ మైసూరు - తల్లం పిక్చర్సు సర్క్యూటు, బెంగుళూరు.